జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | శనివారం 29 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 204 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



## ప్రపంచం చూపు

# భారత్ వైపే



- ఏఐ, డీప్ టెక్నాలజీకి కేంద్రంగా ఏపీని మార్చుతాం
- ఏపీ తీసుకొచ్చిన ఐటీ పాలసీ దేశానికే మార్గదర్శిగా ఉంది
- ఐఐటీ మద్రాస్ భాగస్వామ్యంతో ఏపీలో ‘క్వాంటమ్ వ్యాలీ’.
- సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఇండియన్స్ ముందుంటారు.
- అమెరికా దేశంలోని ధనిక ప్రాంతాల్లో తెలుగు, తమిళులే అధికం

-ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మద్రాస్‌లో జరిగిన ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ కు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు

ప్రజాజ్యోతి చెన్నై

ఏపీ రాజధాని అమరావతిలో ఐఐటీ మద్రాస్ సహకారంతో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని, 1995లో హైదరాబాద్ హైటెక్ సిటీని స్థాపించిన విధంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ, డీప్ టెక్నాలజీకి కేంద్ర బిందువుగా మార్చుతామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. భారతదేశంలో 65 శాతం మంది ఏఐ వినియోగిస్తున్నారని, ఇది ప్రపంచ సగటు 30 శాతం కన్నా అధికమన్నారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త సాంకేతికతలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. చెన్నైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మద్రాస్‌లో జరిగిన ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025కు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సీఎం సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశ ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. చైనా ఆర్థిక సంస్కరణలతో ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. బ్రిటిష్ పాలకులు మనం దేశం నుంచి వెళ్తూవెళ్తూ ఇంగ్లీష్ భాషను మనకు వదిలేసి పోయారు. ఏపీలోని కోహినూర్ వజ్రాన్ని కూడా తీసుకెళ్లారు. టెలికాం రంగంలో - మిగతా3లో

# ఏపీలో నామినేటెడ్ పదవుల జాతర



**47 మార్కెట్ కమిటీలకు సంబంధించి తెలుగు దేశం పార్టీ శుక్రవారం ఛైర్మన్లను ప్రకటన**

**47 మార్కెట్ కమిటీలకు గానూ.. సభ్యులతో కలిపి 705 నామినేటెడ్ పదవులు భర్తీ**

**37 టిడిపి, 8 జనసేన, 2 బీజేపీ కేటాయింపు**

ప్రజాజ్యోతి విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల జాతర మొదలైంది. 47 మార్కెట్ కమిటీలకు సంబంధించి తెలుగు దేశం పార్టీ శుక్రవారం ఛైర్మన్లను ప్రకటించింది. 47 మార్కెట్ కమిటీలకు గానూ.. సభ్యులతో కలిపి 705 నామినేటెడ్ పదవులు భర్తీ చేయనుంది. - మిగతా3లో



## మయన్మార్‌ను కుదిపేసిన భూకంపం

- మయన్మార్‌ను అన్ని విధాలుగా ఆదుకుంటాం : ప్రధాని మోదీ
- భూకంపంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- మయన్మార్, థాయ్‌లాండ్‌లను భూకంపం కుదిపేసింది
- భూకంపం ధాటికి భవనాలు ఊగాయి
- బహుళజాతి భవనాలు నేల మట్టమయ్యాయి.

## ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా’

- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో విజయంపై వైఎస్ జగన్ హర్షం
- ఎల్లప్పుడూ పార్టీకి వెన్నుముకలా నిలుస్తున్న కార్యకర్తలకు నా హ్యాట్సాఫ్
- పార్టీ కేడర్ అభినందనలు తెలిపిన వైఎస్ జగన్



ప్రజాజ్యోతి తాడేపల్లి

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ మేరకు వైఎస్ జగన్ తన సోషల్ మీడియా అకౌంట్‘ఎక్స్’ ద్వారా వైఎస్సార్‌సీపీ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.‘స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేయటం హర్షించదగ్గ విషయం. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఎలాంటి బలం లేకపోయినా.. చంద్రబాబు గారు అధికార అహంకారాన్ని చూపి, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినా..కేసులు పెట్టినా, ఆస్తులు ధ్వంసం చేస్తామని, బంధువుల ఉద్యోగాలు తీసేస్తామని..జీవనోపాధి దెబ్బతీస్తామని భయపెట్టినా, ఎన్ని ప్రలోభాలు పెట్టినా వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ మన పార్టీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు - మిగతా3లో

# పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి చర్యలు

- నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంకు వివరించిన సిఎస్ విజయానంద్
- సమర్థవంతమైన ఇంధన పరివర్తన కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూప కల్పన
- 2024 ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 160 గిగావాట్ల కు మించి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని నెలకొల్పేందుకు లక్ష్యం
- రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి పెద్దఎత్తున చర్యలు



ప్రజాజ్యోతి విజయవాడ

రాష్ట్రంలో ఇంధన రంగంలో తీసుకురానున్న వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం శుక్రవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో భేటీ అయింది. ఈసమావేశంలో ముఖ్యంగా ఖర్చు - సమర్థవంతమైన ఇంధన పరివర్తన కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూప కల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రంలో నికర సున్నా లక్ష్యాలను సాధించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ ప్రతినిధి బృందానికి వివరించారు. ముఖ్యంగా 2024 ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 160 గిగావాట్ల కు మించి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని నెలకొల్పేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందని - మిగతా3లో

## కేంద్రం సంచలనం.. ఇక మీ మెసెజ్‌లు అన్నీ చదివేస్తారు

- మీ అకౌంట్ ఖాతాలకు వాట్సప్, ఈ మెయిల్‌తోపాటు టెలిగ్రాఫ్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు
- ఆదాయపు పన్ను బిల్లు - 2025ను అనుసరించి ఈ తరహా చర్యలు ఉంటాయి
- క్రిప్టోకరెన్సీ వంటి వర్చువల్ ఆస్తులు విస్మరించబడకుండా చూసుకోవడానికి ఇది సహాయపడుతుంది



# కేంద్రం సంచలనం.. ఇక మీ మెసేజ్‌లు అన్నీ చదివేస్తారు

**న్యూఢిల్లీ :** మరికొద్ది రోజుల్లో కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. అలాంటి వేళ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. మీ అకౌంట్ ఖాతాలకు వాట్సప్, ఈ మెయిల్‌తోపాటు టెలిగ్రాఫ్‌ను యాక్సెస్ చేసుకోవచ్చని తెలిపారు. అయితే వాటిని ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఓ కంట కనిపెడతారని చెప్పారు. ఆదాయపు పన్ను బిల్లు -2025ను అనుసరించి ఈ తరహా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.
గురువారం లోక్‌సభలో ఆమె మాట్లాడుతూ.. ఈ కొత్త బిల్లు వల్ల కొత్త సాంకేతికతతో పన్ను అమలుకు సంబంధించని వివరాలను ఆమె వివరించారు. క్రిప్టోకరెన్సీ వంటి వర్చువల్ ఆస్తులు విస్మరించబడకుండా చూసుకోవడానికి ఇది సహాయపడుతుందన్నారు. డిజిటల్ ఖాతాల నుండి వచ్చే ఆధారాలను అధికారులు కోర్టులో పన్ను ఎగవేతను నిరూపించడంతోపాటు పన్ను ఎగవేత ఖచ్చితమైన మొత్తాన్ని లెక్కించడానికి ఈ ఆధారాలను అందిస్తాయన్నారు.

ఈ బిల్లును ప్రభుత్వం ఎందుకు తీసుకువచ్చిందంటే..?

ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో ఆదాయపు పన్ను బిల్లు -2025ను కేంద్రం తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వం లెక్కల్లో చూపని నగదు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించడానికి ఈ బిల్లు అనుమతి ఇస్తుందన్నారు. అక్రమ కార్యకలాపాల కోసం వినియోగిస్తున్న లెక్కల్లో చూపని నగదును గుర్తించేందుకు ఈ బిల్లు ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. మొబైల్ ఫోన్లలో ఎన్‌క్రిప్ట్ చేసిన సందేశాలు రూ. 250 కోట్ల లెక్కల్లో లేని నగదును బయటపెట్టాయని గణాంకాలతో సహా ఆమె వివరించారు. అలాగే వాట్సాప్ సందేశాలతో క్రిప్టో ఆస్తులకు సంబంధించిన ఆధారాలు గుర్తించినట్లు తెలిపారు. వాట్సాప్



కమ్యూనికేషన్‌లో రూ. 200 కోట్లు లెక్కల్లో లేని నగదును వెలికి తీయడానికి సహాయ పడిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇక గూగుల్ మ్యాప్స్.. నగదును దాచడానికి తరచు సందర్శించే ప్రదేశాలను గుర్తించడంలో సహాయపడిందని ఆమె వివరించారు. బినామీల ఆస్తి యాజమాన్యాన్ని నిర్ణయించడానికి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను సైతం విశ్లేషించామన్నారు. ఈ నూతన బిల్లు ద్వారా అధికారులు ఏమి యాక్సెస్ చేయవచ్చునంటే..
కొత్త బిల్లుతో వాట్సాప్, టెలిగ్రామ్, ఈ మెయిల్ వంటి డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌లను యాక్సెస్ చేసే హక్కును ఆదాయపు పన్ను శాఖ అధికారులకు కల్పిస్తుందని ఆర్థిక మంత్రి వివరించారు. ఇవి కాకుండా అదనంగా, ఆర్థిక లావాదేవీలను దాచడానికి ఉపయోగించే వ్యాపార సాఫ్ట్‌వేర్‌తోపాటు సర్వర్‌లను కూడా ప్రభుత్వం యాక్సెస్ చేస్తుందని స్పష్టం చేశారు. వెల్లడించని ఆదాయం తాలుక వ్యవహారాలను ఈ బిల్లు వెలుగులోకి తీసుకు వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఆదాయపు పన్ను శాఖ సోదాలు, నగదు స్వాధీన సమయంలో.. వర్చువల్ డిజిటల్ స్థలాలను యాక్సెస్ చేయడానికి ఆ శాఖ అధికారులకు అనుమతి ఇస్తుందన్నారు. ఇది ఈ మెయిల్ సర్వర్‌లు, సోషల్ మీడియా ఖాతాలు, ఆన్‌లైన్‌లో పెట్టుబడితోపాటు వాణిజ్య ప్లాట్‌ఫారమ్‌లు, ఆస్తి యాజమానుల వివరాలను నిల్వ చేసే వెబ్‌సైట్‌లను కవర్ చేస్తుందని సోదాహరణగా ఆమె వివరించారు. కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025, ఫిబ్రవరి 13వ తేదీన లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

# కశ్మీర్ కనుమరుగేనా


భారతదేశానికి తలమానికగా ఉన్న కశ్మీర్ త్వరలోనే కనుమరుగు అవుతుందా..? అక్కడి వాతావరణం చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. కశ్మీర్ కింద భూమి అపాయం అంచులో కొట్టుమిట్టాడుతోంది. కాలం గడుస్తున్న కొద్దీ.. కశ్మీర్‌లో పరిస్థితులు ఏవీ కలిసిరావడం లేదు. రాజకీయం, పర్యావరణం.. ఏదీ కశ్మీర్‌ను కాపాడే కండీషన్‌లో లేవు. ఒకవైపు అభివృద్ధి పేరుతో పర్యావరణం పాడైపోతుంటే.. మరోవైపు, భూమిపై పెరుగుతున్న వాతావరణ మార్పు కశ్మీర్ ఊపిరిని స్లోగా మింగేస్తుంది. వెరసి, చల్లని ప్రదేశం కాస్తా సెగలు కక్కుతోంది. కశ్మీర్‌ని చూడని వాళ్లు ఎవరైనా ఉంటే.. త్వరగా వెళ్లి చూసేయండి. ఎందుకంటే, ఇంకొన్ని సంవత్సరాల్లో కశ్మీర్ ఇప్పుడు అనుకుంటున్నంత అద్భుతంగా ఉండకపోవచ్చు. అందమైన మంచు అంతా కరిగిపోయి.. మనం రెగ్యులర్‌గా చూసే కొండలా రాళ్లు రప్పలు మట్టితోనే కనిపించొచ్చు. ఇంకా లేదంటే.. అసలు కొండలన్నీ కూలిపోయి, అల్లకల్లోలంగా మారొచ్చు. పచ్చని భూమి, రహదారులు, వంతెనలన్నీ కుంగిపోయి భారీ గోతులే మిగలొచ్చు. విపరీతమైన భూకంపాలు, దారుణమైన ఉప్పెనలతో కశ్మీర్ కళ తప్పి పోవచ్చుఅవును.. వినడానికి చాలా కష్టంగా ఉన్నా.. జమ్మూ కశ్మీర్ భూమి కింద పెద్ద అపాయం దాగుంది. స్లో పాయిజన్‌లా అది ఆ ప్రాంతంలో భూమి బలాన్ని నీరుగారుస్తుంది. ఫలితంగా.. ఇంకొన్ని సంవత్సరాల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్‌లో భూమి ద్రవంగా మారి, కుంగిపోయే ప్రమాదం ఉంది. కశ్మీర్ హిమాలయాల్లో శాశ్వతంగా పరుచుకున్న మంచు ప్రస్తుతం సాధారణం కంటే అత్యంత ఎక్కువగా కరగడం మొదలయ్యింది. ఇది ఒక ప్రత్యేకమైన పర్యావరణ ముప్పుగా మారుతుందని ఇటీవలి అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.అందంగా పరుచుకున్న ఈ శాశ్వత మంచు కరిగిపోవడం వల్ల.. పర్వత ప్రాంతంలోని 193 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్లు.. 2 వేల 415 గృహాలు.. 903 ఆల్పైన్ సరస్సులు.. 8 జలవిద్యుత్ ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఒక కొత్త అధ్యయనంలో పరిశోధకులు కనుక్కున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని భూమి కింద కనీసం రెండు సంవత్సరాలుగా నిరంతరం ఘనీభవించిన నేల, అవక్షేపాలు, రాతి మొదలైన వాటితో ఏర్పడిన పెర్మాఫ్రాస్ట్ ఉంది. మంచు గడ్డలా ఘనీభవించిన ఈ భూమిపైన శాశ్వతంగా మంచు కప్పబడి ఉంటుంది. ఈ మంచులో ఎక్కువ భాగం అనేక సహస్రాబ్దాలుగా అలాగే ఉంది.అయితే, ఈ అధ్యయనంలో భాగంగా.. 2002 నుండి 2023 వరకు ఉపరితల ఉష్ణోగ్రతల ఎలా ఉన్నాయో తెలుసుకోడానికి ఉపగ్రహ డేటాను విశ్లేషించగా ఈ విషయం వెల్లడయ్యింది. 21 సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరానికి 56కి పైగా చిత్రాలను పరిశీలించారు పరిశోధకులు. మొత్తం 11 వందల 76 భూ ఉపరితల ఉష్ణోగ్రత చిత్రాల డేటాసెట్ ద్వారా ఒక




అంచనాకు వచ్చారు. ఈ డేటా మోడిస్ అని పిలిచే టెర్రా, ఆక్వా ఉపగ్రహాలపై ఉన్న నాసా సెన్సార్ నుండి సేకరించింది. అయితే, ఈ చిత్రాల్లో ప్రతి పిక్సెల్ 1 చదరపు కిలో మీటర్ల వైశాల్యాన్ని చూపిస్తుంది. ఈ ప్రకారం.. జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లోని సుమారు 222,236 పిక్సెల్‌లను విశ్లేషించారు.సాధారణంగా చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల సూర్య కిరణాలు శాశ్వత మంచుపై పడి, దాన్ని కరిగించకుండా రక్షిస్తాయి. అలాగే, భూకంపాల వంటి సహజ ప్రక్రియలను నియంత్రిస్తాయి. అయితే, అభివృద్ధి పేరుతో భారీగా ఆనకట్టల నిర్మాణం, రోడ్లు వేయడం, కొండలను తొలుస్తూ టన్నెల్స్ నిర్మించడం, ఈ ప్రాంతంలో భారీగా పెరిగిన పర్యాటకం.. ముఖ్యంగా, 370 రద్దు తర్వాత పెరిగిన రియల్ ఎస్టేట్.. వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా పశ్చిమ హిమాలయాలు ప్రమాదంలో పడినట్లు తెలుస్తోంది. కశ్మీర్ నేలపై ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ ఆ ప్రాంతంలోని శాశ్వత మంచు స్థిరత్వం ప్రశ్నార్థకంగా మారిందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఇక, సిక్కింలోని దక్షిణ లోనాక్ సరస్సు, అక్టోబర్ 2023లో ఇలాంటి పరిస్థితులలోనే భారీ నాన్-ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బస్ట్ ఫ్లడ్‌ని ఎదుర్కొంది. సరస్సు చుట్టూ శాశ్వత మంచుతో నిండిన పదార్థంతో కూడిన మొరైన్‌లు ఉన్నాయి. కాలక్రమేణా, ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు క్షీణించిన ఈ శాశ్వత మంచు వల్ల కొండవాలు పూర్తిగా కూలిపోయింది. ఇలా శాశ్వత మంచు క్షీణత వల్ల భూగర్భ జలాలు, నది నీటి లభ్యత కూడా ప్రతికూల ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది. ఇక, రాతి హిమానీనదాల రూపంలో శాశ్వత మంచు, నది ప్రవాహానికి దోహదం చేస్తుంది.కొన్ని ప్రాంతాల్లో అయితే, దాని క్షీణత నదుల మూల ప్రవాహాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అయితే, భారతదేశంలో ఈ ప్రభావాలను ఖచ్చితంగా గుర్తించడానికి సమగ్ర అధ్యయనాలు ఇప్పటి వరకూ జరగలేదు. కాబట్టి, ఈ విషయంపై ఖచ్చితమైన ప్రకటనలు ఇప్పుడప్పుడే చేయలేమన్నది పరిశోధకుల అభిప్రాయం. అయితే, ఒక్కటి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. శాశ్వత మంచుకు వస్తున్న ఈ నష్టం వల్ల కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది.ఈ శాశ్వత మంచును పరిరక్షించడం కోసం ఇప్పటికే ప్లాన్ చేసిన రోడ్లను ఆపకపోయినప్పటికీ.. భవిష్యత్‌లో ప్లాన్ చేసే నిర్మాణాలను శాశ్వత మంచు ఉన్న ప్రదేశాల్లో నిర్మించకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, పర్యావరణ పరంగా పెళుసుగా ఉండే ప్రాంతాల్లో స్థిరమైన నిర్మాణాలు చేపట్టకపోవడం మంచిదని అంటున్నారు. ఇక, జలవిద్యుత్ విద్యుత్ ప్రాజెక్టుల వంటి భారీ ప్రాజెక్టులకు పర్యావరణ ప్రభావాలు ఎలా ఉంటాయనే అంచనాలు వేస్తున్నప్పటికీ.. అవి నాన్-ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బస్ట్ ఫ్లడ్‌కి, ఇతర క్రయోస్పిరిక్ ప్రమాదాలను తెస్తాయా లేదా అనేది కూడా పరిశీలించాలనే సూచనలు ఉన్నాయి. ఎందుకంటే, గతంలో జరిగిన పెద్ద విపత్తుల తర్వాతే ఈ శాశ్వత మంచు సంబంధిత ప్రమాదాల గురించి అవగాహన పెరిగింది. గతంలో, నాన్-ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బస్ట్ ఫ్లడ్‌లు ప్రధానంగా నేపాల్‌లో సంభవించేవి. అయితే, కేదార్‌నాథ్ విపత్తు, దక్షిణ లోనాక్ సరస్సు విస్ఫోటనం, లడఖ్‌లో జరిగిన సంఘటనలు ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాయి.రాబోయే ప్రమాదాన్ని తగ్గించడానికి.. పరిశోధకులు చెబుతున్న సూచనలు పాటించడం చాలా కీలకమని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా శాశ్వత మంచు ఉన్న ప్రదేశాల్లో దీన్ని తక్షణమే అమలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే, శాశ్వత మంచు అధికంగా ఉన్న ప్రాంతాలలోని ఇళ్లు.. పలు స్థాయిల్లో ప్రమాదం ఎదుర్కొనే అవకాశం ఉంది. లడఖ్‌లో, శాశ్వత మంచు ఉన్న నిటారైన కొండవాలుల్లో ఇళు ఎక్కువగా ఉన్నాయి.వీటికి ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండొచ్చు. అలాగే, లడఖ్‌లోని మిలటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ప్రమాదంలో ఉన్నాయి. కాబట్టి, కశ్మీర్, లడఖ్‌లో ఇలాంటి పరిస్థితి ఏర్పడటం జాతీయ భద్రతకు కూడా ఆందోళనలను కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో.. అనేక వ్యూహాత్మక రోడ్లు.. శాశ్వత మంచు మండలాల గుండా వెళతాయి. అలాంటి చోట.. శాశ్వత మంచు కరిగిపోతే.. రోడ్లు కుంగిపోయి కనెక్టివిటీకి కూడా తీవ్రమైన అంతరాయాలు ఏర్పడతాయనడంలో సందేహం లేదు.ఈ డేటా లాగర్లు ఉపగ్రహ డేటాను క్రమపద్ధతిలో విశ్లేషించడంలో.. ఏవైనా మార్పులు ఉంటే వాటిని గుర్తించడంలో కూడా సహాయపడతాయి. శాశ్వత మంచును పర్యవేక్షించడంలో ఇవి మరింత ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తాయి. కాబట్టి, కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ప్రభుత్వం దీని దిశగా చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, పర్యావరణాన్ని కాపాడుకోడానికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన చేయాలని కూడా చెబుతున్నారు.

## జస్టిస్ వర్మ బదిలీని నోటిఫై చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** పెద్ద ఎత్తున తన నివాసంలో నోట్ల కట్టలు కనిపించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో మరీ కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనిపై ఒకవైపు సీజేఐ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరుపుతుండగానే, అలహాబాద్ హైకోర్టుకు ఆయనను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారంనాడు నోటిఫై చేసింది. భారత రాజ్యాంగంలోని 222వ నిబంధనలోని క్లాజ్ వన్ ద్వారా రాష్ట్రపతి తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుని భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలాహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే సిఫారసు ఆమోదించారని ఆ ఉత్తర్వు తెలిపింది. జస్టిస్ వర్మ అలాహాబాద్ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించినట్టు పేర్కొంది. జస్టిస్ వర్మపై ఆరోపణల దుమారం నేపథ్యంలో ఆయనను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ



చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేసింది. అయితే ఈ నిర్ణయంతో అలబాహాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ విభేదించింది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుతో సహా దేశంలోని ఏ కోర్టుకు బదిలీ చేయరాదని, ఆయనపై ఉన్న అభియోగాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, అభిశంసన చేపట్టాలని, ఆయన పాత కేసుల్లో తీర్పులను కూడా తిరగదోడాలని హైకోర్ట్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలోనే జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీ విచారణ జరుపుతున్నందున ఈ దశలో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీని కేంద్ర నోటిఫై చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మయన్మార్‌ను కుదిపేసిన భూకంపం



**ఢిల్లీ :** మయన్మార్‌ను కుదిపేసిన భూకంపంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మయన్మార్‌ను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లను భూకంపం కుదిపేసింది. భూకంపం ధాటికి భవనాలు ఊగాయి. బహుళజాతి భవనాలు నేల మట్టమయ్యాయి. ఓ భవనం కూలడంతో శిథిలాల కింద 50 మంది చిక్కుకున్నారు. నేల మట్టమైన భవనాల కింద వేలాది మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ భూకంపంతో వేలాది భారీ నిర్మాణాలు నేల మట్టమయ్యాయి. భారీ ఆస్తి నష్టం సంభవించింది. ముఖ్యంగా మయన్మార్‌లో వరుసగా స్వల్ప వ్యవధిలో రిక్టర్ స్కేలుపై 7.7,6.4 భూకంప తీవ్రత నమోదైంది. ఆ భూకంపంపై ప్రధాని మోదీ ద్రిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మయన్మార్‌ను ఆదుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. అందరి భద్రత, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నట్లు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. భూకంపం ప్రభావం నేపథ్యంలో మయన్మార్, థాయిలాండ్ దేశాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతుంది. అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధమైంది.

భూమి లోపల.. పది కిలోమీటర్ల మేర భూకంపం

మయన్మార్ వాయువ్య భాగమైన సాగైంగ్‌కు 16కిలోమీటర్ల దూరంలో 10కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మయన్మార్‌లో గతంలో కూడా సాగైంగ్‌కు భూకంపాలు సంభవించిన చరిత్ర ఉంది. ఈసారి కూడా అదే ప్రాంతంలో భూకంపం రావడం గమనార్హం.

## ట్రంప్ మరో సంచలన నిర్ణయం



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 2.0 పాలనలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. సంచలన నిర్ణయాలతో అమెరికన్లను, ప్రపంచ దేశాలను భయపెడుతున్నారు. ఇప్పటికే చైనా, కెనడా, మెక్సికోపై సుంకాలు పెంచారు. ఏప్రిల్ 2 నుంచి ప్రపంచ దేశాలన్నింటిపై సుంకాలు విధిస్తామన్నారు. ఇప్పుడు దిగుమతి కార్లపైనా సుంకాలు విధించాలని నిర్ణయించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన నిర్ణయం తీసుకున్నారు. విదేశాల్లో తయారై యూఎస్‌లోకి దిగుమతయ్యే అన్ని కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు బుధవారం వైట్‌హౌస్‌లో ప్రకటించారు. ఈ నిర్ణయం ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి రానుంది. 'అమెరికాలో తయారుకాని కార్లపై 25% సుంకం విధిస్తున్నాం. ఇది శాశ్వత చర్య. ఇక్కడ తయారయ్యే వాహనాలపై మాత్రం సుంకాలు ఉండవు. ఈ నిర్ణయం మా ఆర్థిక వృద్ధిని పెంచి, ఇప్పటివరకూ చూడని అభివృద్ధిని సాధిస్తుంది' అని ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రకటనలో చైనాపై ప్రత్యేక దృష్టి సారించారు. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై తొలుత 10 శాతం సుంకం విధించిన ట్రంప్, ఆ తర్వాత దాన్ని 20 శాతానికి పెంచారు. ఇప్పుడు చైనాకు ఓ ఆసక్తికర ఆఫర్ ప్రకటించారు. ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్‌ను విక్రయిస్తే, సుంకాలను తగ్గించే అవకాశం ఉందని, అవసరమైతే ఒప్పంద గడువును కూడా పొడిగిస్తామని విలేకరులతో చెప్పారు. టిక్‌టాక్‌పై అమెరికా ఇటీవల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. యూఎస్ నిబంధనలకు కట్టుబడనందుకు జనవరి గూగుల్, ఆపిల్ ప్లే స్టోర్ల నుంచి ఈ యాప్‌ను తొలగించాయి. అయితే, ట్రంప్ నిషేధ అమలును వాయిదా వేయడంతో టిక్‌టాక్ మళ్లీ యాప్ స్టోర్లలో అందుబాటులోకి వచ్చింది. అమెరికాలో దీనికి 170 మిలియన్ల మంది వినియోగదారులు ఉన్నారు. టిక్‌టాక్ కొనుగోలు గురించి ఎలాన్ మస్క్ పేరు వార్తల్లో వచ్చినా, ఆయన దాన్ని తోసిపుచ్చారు.ట్రంప్ ఇటీవల 'సావరిన్ వెల్త్ ఫండ్' సృష్టించాలని ట్రెజరీ, వాణిజ్య విభాగాలను ఆదేశించారు. ఈ ఫండ్‌తో టిక్‌టాక్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉందని సూచించారు. ఈ నిర్ణయాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, వాణిజ్య విధానంలో ట్రంప్ దూకుడును చాటుతున్నాయి.

## అమెరికా, భారత్ మధ్య చర్చలు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన పరస్పర సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో, భారత్?అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు బుధవారం దిల్లీలో ప్రారంభమయ్యాయి. ఈ చర్చల్లో అమెరికా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భారత్‌ను చైనా, కెనడా, మెక్సికోలతో పోల్చి చూడబోమని యూఎస్ స్పష్టం చేసింది. ఈ దేశాలతో కరెన్సీ అవకతవకలు, అక్రమ వలసలు, భద్రతా సమస్యలు ఉన్నప్పటికీ, భారత్‌తో కేవలం సుంకాల సమస్య మాత్రమే ఉందని పేర్కొంది. ఈ సమస్యను ఇరు దేశాలు సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని భావిస్తున్నాయి. ఈ చర్చల కోసం వాషింగ్టన్‌వాణిజ్య అధికారి బ్రెండన్ లించ్ తన బృందంతో భారత్‌కు చేరుకున్నారు. శుక్రవారం నాటికి ఇరు దేశాలు ఒక ఒప్పందానికి చేరుకునే అవకాశం ఉంది. ఈ ఒప్పందం రెండు దేశాలకు సంతృప్తికరంగా ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏప్రిల్‌లో వాషింగ్టన్‌కు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో సుంకాలు, వాణిజ్యం, ఆర్థిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరగనున్నాయి.ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, మిత్ర దేశాలు, శత్రు దేశాలతో సంబంధం లేకుండా సుంకాలు విధిస్తున్నారు. భారత్ తమ వస్తువులపై భారీ సుంకాలు విధిస్తోందని ఆరోపిస్తూ, ఏప్రిల్(ంజూతీతిశ్రీ) నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌ఇటీవల అమెరికా పర్యటనలో యూఎస్ వాణిజ్య ప్రతినిధులతో చర్చలు జరిపారు. సుంకాల తగ్గింపు, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించారుప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలి అమెరికా పర్యటనలో ట్రంప్‌తో దౌత్య, వాణిజ్య, రక్షణ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ట్రంప్, సుంకాల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని, భారత్ అమెరికా దిగుమతులపై అధిక పన్నులు విధిస్తోందని, ఇకపై తాము కూడా అదే విధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ చర్చలు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి.

# ప్రపంచం చూపు ఇక భారత్ వైపే

-మొదటిపేజీ తరువాయి

అనేక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ ఆధిపత్యం ఉండేది. సంస్కరణలు రావడంతో ప్రైవేట్ సంస్థలు కూడా టెలికాం రంగంలోకి వచ్చాయి. ఇదొక గేమ్ ఛేంజర్ అయింది. ప్రస్తుతం ప్రపంచం చూపు భారతదేశం వైపు మళ్లింది. రాబోయే రోజులంతా భారతదేశానివే. ఐఐటీ మద్రాస్ చాలా విషయాల్లో మొదటి స్థానంలో ఉంది. వివిధ రకాల ఆన్లైన్ కోర్సులు కూడా అందిస్తోంది. ఐఐటీ మద్రాస్ కొత్త ఆవిష్కరణలు,స్టార్టప్ అగ్నికుల్ కోస్మోస్, మైండ్‌గ్రో టెక్నాలజీస్ వంటి స్టార్టప్‌ల్లో నూతన పరిశోధనలు భారతదేశాన్ని అంతరిక్షం, సెమీ కండక్టర్ రంగాల్లో ముందుండేలా చేస్తున్నాయి. ఇక్కడి స్టార్టప్‌లు దాదాపు 80 శాతం సక్సెస్ అయ్యాయి. ఈ ఐఐటీలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు 40 శాతం దాకా ఉన్నారు.' అని సీఎం అన్నారు.

**అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్**

'1995లో నేను ముఖ్యమంత్రి అయ్యాక తర్వాత బిల్ గేట్స్‌ను కలవాలని అడిగినప్పుడు రాజకీయ నేతలతో సత్సంబంధాలు లేవని, కలవడం కుదరదని అన్నారు. అయినప్పటికీ ఆయనతో సమావేశం కావాలని ఒప్పించి దాదాపు 45 నిమిషాలు మాట్లాడాను. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ స్థాపించాలని బిల్ గేట్స్‌ను కోరాను. ఇప్పుడు మైక్రోసాఫ్ట్‌కు తెలుగువాడైన సత్య నాదెళ్ల సీఈఓగా ఉన్నారు. 2014లో భారత్ పదో ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇప్పుడు ఐదవ స్థానానికి ఎగబాకింది. మనమంతా మరింత కృషి చేస్తే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుంది.

**అక్కడ తెలుగు, తమిళులే ఎక్కువ**

భారతదేశానికి జనాభా గొప్పవరం లాంటింది. మన దేశానికి ఇంకో 40 ఏళ్ల దాకా జనాభా సమస్య ఉండదు. దక్షిణ భారతదేశంలో కూడా జనాభాను పెంచాల్సి ఉంది. అమెరికా దేశంలో అత్యధిక తలసరి ఆదాయం మన దేశీయులదే. అక్కడి ధనిక ప్రాంతాల్లోకి వెళ్లి చూస్తే తెలుగు, తమిళం వారే ఎక్కువ మంది ఉంటారు. భారతీయులు సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుంటారు. సిలికాన్ వ్యాలీ, నాసా, వాల్ స్ట్రీట్‌లలో భారతీయుల ఆధిపత్యాన్ని సాధిస్తున్నారు.



**ఎనర్జీ రంగంలో ఏపీ ముందు**

ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుంది. భవిష్యత్తులో ఏపీ రూ.2 రూపాయలకే యూనిట్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. భారతదేశం మొత్తం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం ఉంటే, ఇందులో 160 గిగావాట్లు ఒక్క ఏపీలోనే ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నాం. ఎనర్జీలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి 7.5 లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ యూనిట్ స్థాపిస్తోంది. రిలయన్స్ బయోఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతోంది. రాబోయే రెండేళ్లలో 20 లక్షల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేస్తున్నాం.

**ఏపీ ఐటీ పాలసీ దేశానికే మార్గదర్శి**

అభివృద్ధి సాధించాలంటే సుస్థిర పాలన అవసరం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ విధానం దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. ఏఐ వినియోగాన్ని మరింత ప్రోత్సహిస్తాం. భారతదేశం డేటా సేకరణలో ముందుంది. నేను చేతి వేలుకు పెట్టుకున్న రింగ్ నా ఆరోగ్యం ఎలా ఉందో కూడా ట్రాక్ చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్‌కు కేంద్రంగా మార్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్ అవకాశాలను కల్పిస్తాం. భారతదేశ ఆధునిక టెక్నాలజీ, సరైన నాయకత్వంతో అభివృద్ధి చెందుతుంది.' అని సీఎం అన్నారు. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి మాట్లాడుతూ... సైబరాబాద్ అభివృద్ధికి మార్గదర్శకుడు చంద్రబాబు నాయుడు అని ప్రశంసల వర్షం కురిపించారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా పిఠాపురం

**కాకినాడ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. అన్నీ తెలిసి మౌనంగా ఉంటున్నారా? లేక వాటంతట అవే సర్దుకుంటాయని భావిస్తున్నారో తెలియదు కానీ పవన్ కళ్యాణ్ మౌనం మాత్రం పిఠాపురం టీడీపీ నేతలకు ఎక్కడో కాలుతున్నట్లే కనపడుతుంది. వరసగా జరుగుతున్న ఘటనలు చూస్తుంటే పవన్ కళ్యాణ్ కు అన్నీ తెలిసి జరుగుతున్నాయని అనుకోవాలని తెలుగు తమ్ముళ్లు భావిస్తుంటే, పవన్ వస్తే అంతా సెట్ రైట్ అవతుందని జనసైనికులు చెబుతున్నారు. అసలు పిఠాపురం నియోజకవర్గాన్ని ఎందుకు జనసేన నేతలు ఇంత కాంట్రవర్సీతో కొని తెచ్చుకుంటున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభకు ముందు నుంచే టీడీపీ, జనసేనల మధ్య వార్ ప్రారంభమయినట్లు కనిపిస్తుంది. ఎలాగంటే మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ పిఠాపురం అంటే పవన్ కళ్యాణ్ అడ్డా అని అనడం, అక్కడ మరో నేతకు అవకాశం లేదని చెప్పడం వివాదంగా మారింది. నాదెండ్ల మనోహర్ అలాంటి వ్యాఖ్యలు చేశారంటే పవన్ కళ్యాణ్ కు తెలియకుండా చేశారని అనుకోలేం. అందులో పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఏం మాట్లాడినా జనసేన నేతలు ఆచితూచి మాట్లాడతారు. నాదెండ్ల మనోహర్ పవన్ కళ్యాణ్ అడ్డా పిఠాపురం అనడంతో వర్మతో పాటు అనేక మంది టీడీపీ నేతలకు కొంత ఇబ్బందికరంగా మారింది. తర్వాత ఆవిర్భావ సభలోనూ నాగబాబు చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యాన్ని పోశాయి. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలుపునకు పవన్ ఒక కారణమయితే, జనసేన క్యాడర్ మరో కారణమని, ఎవరైనా తామే పవన్ విజయానికి కారణమని భావిస్తే వారి ఖర్మ అని చేసిన వ్యాఖ్యలు వర్మతో పాటు టీడీపీ స్థానిక నేతల్లో గునపాలు దిగినట్లయింది. దీంతో పాటు అదే సభలో పవన్ కళ్యాణ్ కూడా టీడీపీని అధికారంలోకి తెచ్చామని చెప్పి మరింత వివాదానికి తావిచ్చారు. అప్పటి నుంచి పిఠాపురం నియోజకవర్గంలో ఇటు టీడీపీ, అటు జనసేన నేతలు, క్యాడర్ మధ్య పొసగడం లేదన్నది యదార్థం. కానీ రెండు పార్టీల అగ్రనేతలు పిఠాపురం లో జరుగుతున్నవిషయాలను పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ ముదురుతున్నాయి. తాజాగా పిఠాపురం జనసేన ఇన్ ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని టీడీపీ క్యాడర్ అడ్డుకుంది. నియోజకవర్గంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. తమ నేత వర్మకు ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందకపోవడం వల్లనే టీడీపీ శ్రేణులు బరస్ట్ అయ్యారంటున్నారు. ఇలా పిఠాపురంలో రెండు పార్టీల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుంది. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం విభేదాలను మాపే ప్రయత్నం చేయకపోవడం కూడా టీడీపీ నేతలకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. ఇంత జరుగుతున్నా తమ పార్టీ నేతలకు, క్యాడర్ కు సర్దిచెప్పాల్సిన పవన్ మౌనం పాటించడం వెనక వర్మను సైడ్ చేయాలన్న లక్ష్యమే కనిపిస్తుందన్న అభిప్రాయం పిఠాపురం టీడీపీ నేతల్లో మరింత బలపడుతుంది. మరి ఈ వివాదం ఎటు దారి తీస్తుందన్నది చూడాలి.

వరుస సమీక్షలు

పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని, మౌలిక వసతుల కల్పన విషయంలో చురుగ్గా వ్యవహరించాలని అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.



పిఠాపురం నియోజక వర్గంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పాడా) డైరెక్టర్ పర్యటించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. తమ పర్యటన వివరాలను ఉప ముఖ్యమంత్రికి తెలియచేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో చేపడుతున్న రహదారి పనులు, ఉపాధి హామీ కార్యక్రమాల అమలుపై పురోగతి నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని గ్రామాలు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ వేసవి సమయంలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని, సమ్మర్ స్టోరేజి ట్యాంక్స్ దగ్గర తనిఖీలు చేయాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు సమకూరుస్తున్నాము. వాటిని సద్వినియోగం చేసి ప్రజలకు మేలు చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పవన్ తెలిపారు. అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతి వారం ఈ పనులపై సమీక్ష చేపడతాను. అధికారులు క్షేత్ర స్థాయి పురోగతిని నిశితంగా పరిశీలించాలి. పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తన కార్యాలయ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ పని చేస్తోందని.. విద్యుత్ అంతరాయ సమస్య ఉందని తెలియగానే టిడ్కో గృహాల దగ్గర రూ.3 కోట్లతో 5 ఎం.వి.ఎ సామర్థ్యంతో కొత్త సబ్ స్టేషన్ పనులు చేపట్టామమన్నారు. అమృత్ 2.0 ద్వారా పిఠాపురం పట్టణంలో తాగు నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఇప్పటికే పురపాలక శాఖ అధికారులతో సమీక్ష చేశామని పిఠాపురం ? ఉప్పాడ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపగలిగామమన్నారు. రూ.59.7 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో రూ.40.2 కోట్లతో 444 రోడ్డు పనులు చేపట్టాము. అదే విధంగా 431 గోకులాలు పిఠాపురం నియోజకవర్గానికి ఇచ్చాము. పిఠాపురంలో ప్రభుత్వ ఆసుపత్రిని సి.హెచ్.సి. నుంచి ఏరియా ఆసుపత్రి స్థాయికి పెంచాము. అందుకు అనుగుణంగా రూ.38.32 కోట్లు నిధులు వచ్చాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ ఏ విధంగా చూపుతుందో తెలిపేందుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మార్గదర్శకత్వంలో వాటిని సద్వినియోగపరుస్తున్నాము. ఈ క్రమంలో అధికారులు, ఉద్యోగులు సానుకూల దృక్పథంతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు.నియోజకవర్గంలో శాంతిభద్రతల అంశంపై ప్రత్యేక సూచనలు చేశారు. పిఠాపురం నియోజక వర్గ పరిధిలో పోలీసింగ్ వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఊటంకిస్తూ, నాలుగు పోలీస్ స్టేషన్లలో ఉన్న పరిస్థితిపై ఇంటెలిజెన్స్ నివేదిక తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవినీతికి పాల్పడుతున్న పోలీసు అధికారుల మూలంగా శాఖ చులకన అవుతోందన్నారు. ప్రజలను ఇబ్బందిపెట్టే నేరస్తులనే కాదు, వారికి అండగా ఉండే నాయకులను, పోలీసులను కూడా ఉపేక్షించకూడదన్నారు. తన దృష్టికి వచ్చిన కొన్ని అంశాలను వివరించి వాటిని సత్వరమే జిల్లా పోలీసు అధికారులకు తెలియచేయాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు.

## పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి చర్యలు

-మొదటిపేజీ తరువాయి

దానిలో భాగంగా సోలార్,విండ్ విద్యుత్ ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించి పలు ప్రాజెక్టులు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్టు సిఎస్ వివరించారు. ఇటీవల విశాఖపట్నం సమీపంలో ఎన్టిపిసి, ఎన్ఆర్ఇడిసిఎపి జెవి లచే ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి వారి చేతుల మీదగా శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ బృందానికి వివరించారు. అలాగే కాకినాడలో గ్రీన్కో గ్రూప్ చే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి %a% ఎలక్ట్రోలైజర్ తయారీ, ఎపి జెన్కో సొంతంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ తో జీవీ ద్వారా 6,000 ఎం.డబ్ల్యూ సామర్థ్యానికి మించి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, ఇతర పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధిలో ఉన్నాయని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ బృందానికి తెలిపారు. ఇంధన పరివర్తన ప్రణాళిక కింద మహారాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ అందిస్తున్న సేవలు, ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ బృందం సీఎస్ కు వివరించింది.ఇంధన పరివర్తన ప్రణాళిక కింద మహారాష్ట్ర ప్రభుత్వం ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రణాళిక కింద నికర సున్నా లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ బృందం సిఎస్ కు వివరించింది. ఖర్చు-సమర్థవంతమైన ఇంధన పరివర్తనను సాధించడంలో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అవకాశాలను అందుకు మద్దతు ఇవ్వడానికి ?నీతి ఆయోగ్ ముందుకు వచ్చింది. అదే విధంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెట్ జీరో లక్ష్య సాధనకు చేరుకోవడానికి, వ్యయ-సమర్థవంతమైన ఇంధన పరివర్తనను సాధించడంలో రాష్ట్రానికి పూర్తి మద్దతు ఇచ్చేందుకు సంబంధించి నీతి ఆయోగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం(ఎంఓయు)?కుదుర్చుకునేందుకు నీతి ఆయోగ్ ముందుకు వచ్చింది. ఈ సమావేశంలో సిఎండి ఎపి ఇపిడిసిఎల్ ఐ పృధ్వీతేజ్, సిఎండి ఎస్పిడిసిఎల్ కె.సంతోషరావు, సిఎండి సిపిడిసిఎల్ ఎకెవి భాస్కర్ లతో పాటు నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం అన్ను భరద్వాజ్, శిరీష్ సాంఖే, సుశ్రుత్ హెల్వాత్కర్, దీపక్ బవారీ,రోన్ని ఖన్నా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా'

-మొదటిపేజీ తరువాయి

ధైర్యంగా నిలబడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకున్నారు. లిడవిలువలకు, విశ్వసనీయతకు పట్టం కడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నాయకులను చూసి గర్వపడుతున్నాను. క్లిష్ట సమయంలో వీరు చూపించిన ధైర్యం పార్టీకి మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది. ఈ ఎన్నికలను సమన్వయ పరుస్తూ గెలుపునకు బాటలు వేసిన వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో-ఆర్డినేటర్లు మరియు పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది అందర్నీ అభినందిస్తున్నాను. పార్టీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎల్లప్పుడూ వెన్నుముకలా నిలుస్తున్న కార్యకర్తలకు నా హ్యాట్సాఫ్' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## ఏపీలో నామినేటెడ్ పదవుల జాతర

-మొదటిపేజీ తరువాయి

ఇక, అభ్యర్థుల ఎంపికకు ప్రజాభిప్రాయ సేకరణ సైతం చేయనుంది. ప్రకటించిన 47 ఏఎంసీ ఛైర్మెన్ల పదవుల్లో 37 టిడిపి, 8 జనసేన, 2 బీజేపీ నాయకులకు దక్కాయి. టీడీపీ త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మెన్లను ప్రకటించనుంది. టీడీపీ గత ఏడాది సెప్టెంబరులో నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. మహానాడు కంతా అన్ని పదవులు భర్తీ చేయాలని తెలుగు దేశం పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఈ క్రమంలో టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో ఆశావాహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏకంగా 60 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. తొలి జాబితాలో 20 కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు మొత్తం 99 మందికి అవకాశం కల్పించారు. రెండో జాబితాలో మొత్తం 59 మందికి అవకాశం కల్పించారు.

## ఇలా అయితే ఎలా..

## తమ్ముళ్ల మధనం

**విజయవాడ :** నాటి ప్రభుత్వంలో వైఎస్ జగన్ నా ఎస్.సిలు, నా బీసీలు, నాఎస్టీలంటూ ప్రతి చోట నినాదాలు చేసేవారు. పేదరికంతో సంబంధం లేకుండా జగన్ నాడు తీసుకున్న కొన్ని నిర్ణయాలతో మిగిలిన వర్గాలు దూరమయ్యాయి. ప్రధానంగా రెడ్డి సామాజికవర్గంతో పాటు అగ్రకులాలన్నీ దూరం కాగా, నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలన్నవారు కూడా జగన్ కు చేరువ కాలేదు. ఫలితంగా మొన్నటి ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. అన్ని వర్గాలను కలుపుకుని పోతూ, పేదరికంలో కులాలు, మతాలు చూడకుండా ఉండాలన్నది అందరి ఆలోచన. అలా చేయకపోబట్టే జగన్ తాను ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా గెలుపును అందుకోలేకపోయారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు కూడా అదే తరహా రాజకీయాలు చేయడమేంటని టీడీపీలోని సోషల్ మీడియాలోనే ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలతో కొన్ని వర్గాలు దూరమయ్యే అవకాశముందన్న హెచ్చరికలు వినపడుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలు కూడా చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోస్టులు పెడుతున్నారంటే అందుకు జాగ్రత్తలు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. లేకుంటే జగన్ కు పట్టిన గతే టీడీపీకి కూడా పడుతుందని తెలుగు తమ్ముళ్లు హెచ్చరిస్తున్నారు. అందుకే ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలంటూ చంద్రబాబుకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ ఇలా కనపడుతుంది. "చంద్రబాబు చేసే పనులు ఇట్లాగే ఉంటాయి పవర్ హ్యాండ్ లూమ్ కి ఉచిత విద్యుత్ ఇవ్వచ్చు. కానీ చం నేతన్న ఇళ్లకు కూడా ఉచితంగా విద్యుత్తు ఇస్తానంటున్నారు. వాళ్ల ఓట్లు ఒక నాలుగు లక్షలు ఉంటాయి వీళ్ళకిస్తే మిగతా బీసీ కులాలు కోటి పైన ఓట్లు పోగొట్టుకుంటారు. హ్యూమన్ సైకాలజీ చదివి రాజకీయాల్లోకి రావాలి. ఆ వర్గం నాలుగు ఐదు లక్షలు ఓట్లలో మనకు ఒక 65% పడి ఉంటే జగన్ కు 35% పడి ఉంటాయి . చంద్రబాబు ఇప్పుడు ఉచిత విద్యుత్ ఇస్తానంటున్నాడు. ఇళ్ళకి ఆయన ఉచిత విద్యుత్తు ఇచ్చిన ఒక ఫైవ్ పర్సెంట్ మారుతాయి అంటే ఒక 25 వేల ఓట్లు మారుతాయి కానీ 30 నుంచి 40 లక్షల కోట్లు యాంటీ అవుతాయి. ఈ చిన్న లాజిక్ మర్చిపోతే ఎట్లా?" అని ప్రశ్నించారు. "మా ఊళ్లో కరుడుగట్టిన వైసిపి వాడికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చారు. అతనికి పని చేసి పెట్టారని 100 మంది కార్యకర్తలు యాంటీ అయిపోయారు" అంటూ పోస్టు వైరల్ గా మారింది.

## సజ్జల రామకృష్ణారెడ్డి, భార్గవరెడ్డిలకు ముందస్తు బెయిల్

**విజయవాడ :** సజ్జల రామకృష్ణారెడ్డి,ఆయన కుమారుడు సజ్జల భార్గవరెడ్డి ముందస్తు బెయిల్ పొందారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఇటీవల పోసాని కృష్ణమురళిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు పోలీసులకు తను మాట్లాడిన మాటలు, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై ఉపయోగించిన భాష అంతా సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి ప్రోద్బలం వల్లనే మాట్లాడానని నేరం అంగీకరిస్తూ వాంగ్మూలం ఇచ్చారు. దీంతో తమనూ అరెస్టు చేసే అవకాశం ఉందని భావించి వీరిద్దరూ కోర్టును ఆశ్రయించారు. తమకు ముందస్తు బెయిల్ మంజూరు చెయ్యాలని కోరారు. వారి పిటిషన్ ను విచారించిన హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లెలో నమోదు చేసిన కేసులో అరెస్ట్ చేస్తారన్న ఆందోళన ఉందని వారు కోర్టులో వాదించారు. తాము అమాయకులమని, తమను అనవసరంగా ఈ కేసులో ఇరికిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పోసాని తమ పేర్లను వాంగ్మూలంలో చెప్పారని, అది తప్పు ఇందులో తమ పాత్ర ఉందని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు దృష్టికితీసుకెళ్లారు. రాజకీయ ప్రతీకారంతో తప్పుడు కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గుంటూరు జిల్లాలో, పులివెందులలో తమకు శాశ్వత నివాసాలు ఉన్నాయని, తప్పించుకుపోయే ప్రశ్నే లేదని, అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరవుతామని అన్నారు. కాబట్టి తమను ఈ కేసులో అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోర్టులో కోరారు.

## సంపాదకీయం

# అమెరికాలో మకార్తీ భూతం మళ్లీనా?

గతం గుర్తుకు రాని మనిషీ ఉండడు, సమాజమూ ఉండదు. వర్తమానంలోని బాధలను గతంలోని కష్టాలతో పోల్చి చూసుకోవటం నిరంతరం సాగుతూనే ఉంటుంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనే భయం రెండో ప్రపంచ యుద్ధంనాటి బీభత్సాన్నీ విధ్వంసాన్నీ ఎంతో కొంత తెలుసుకునేలా ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు భావప్రకటనా స్వేచ్ఛనూ, అసమ్మతినీ అణచివేస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులు గతంలో తమలాంటి వారినీ అప్పటి ప్రభుత్వాల దాష్టీకాలనూ గుర్తుకు తెచ్చుకోకమానరు. అందుకోసం చరిత్రను తవ్వకుండా ఉండనూ లేరు. అసమ్మతిని సహించలేని ధోరణి హద్దులు దాటినప్పుడు బాధితులతో పాటు ఆలోచనాపరులు కూడా గతంలోని దారుణాలపై దృష్టి సారించకుండా ఉండలేరు. అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అలాంటి అవసరాన్ని కలిగిస్తున్నాయనే చెప్పుకోవాలి. విద్యాసంస్థలను రాడికల్ వామపక్షవాదుల ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత చాలా కటువుగా, మొరటుగా చెప్పారు. 'మార్క్సిస్ట్స్, మేనియాక్స్, లూనటిక్స్'లు విద్యా సంస్థలను శాసిస్తున్నారనీ విమర్శించారు. దీన్ని చూస్తూ ఊరుకుంటున్న ఉన్నతాధికారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తాననీ ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫెడరల్ విద్యాశాఖను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులనూ జారీచేశారు. విద్యాసంస్థలకే పరిమితం కాకుండా ఇతర అంశాలపై తాను వరుసగా జారీచేస్తున్న ఉత్తర్వులను నిలిపివేస్తున్న న్యాయమూర్తులను కూడా 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్'గానే విమర్శిస్తున్నారు. తన ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తున్న న్యాయవాదులనూ, న్యాయవాద సంస్థలనూ కట్టడిచేయటానికి చర్యలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫెడరల్ నిధులు వెళ్లకుండా నొక్కిపట్టి వాటిని దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 400 మిలియన్ డాలర్ల నిధులను ఫెడరల్ ప్రభుత్వం నుంచి పొందటానికి ట్రంప్ ప్రభుత్వానికి నచ్చే విధంగా విధానాలను మార్చుకునేందుకు కొలంబియా విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఎంతో చరిత్ర ఉండి, మహామహులను అందించిన విశ్వవిద్యాలయానికే ఈ పరిస్థితి వచ్చిందంటే మిగతా వాటి పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలు చేయటం, ప్రదర్శనలు నిర్వహించటం గడిచిన రెండేళ్లుగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో బాగా జరిగింది. దీన్ని హమాస్ సంస్థకు మద్దతు పలకటంగా భావించి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల వీసాలను రద్దుచేసి స్వదేశాలకు పంపటమూ మొదలైంది. కొలంబియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ అలాగే భారత్‌కు రావాల్సి వచ్చింది. జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరల్ విద్యార్థి బాదర్ ఖాన్ సూరిని కూడా అలాంటి ఆరోపణలతోనే దేశం నుంచి పంపించి వేయటానికి రంగం సిద్ధమైంది. ఇక అనేక ప్రముఖ విద్యాలయాల్లో విద్యార్థులపై నిఘాలు పెరుగుతున్నాయి. విద్యార్థుల సామాజిక ఖాతాలను తనిఖీ చేయటమూ మొదలైంది. అలా తనిఖీ చేసేందుకు కొత్త నిబంధనలు తీసుకురావటానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి. సామాజిక సమస్యలపై స్పందించే వారందరూ ఏదో విధమైన సిద్ధాంతాలను విశ్వసించేవారే అయివుంటారు. వారందరినీ లెఫ్ట్ లూనటిక్స్‌గా భావిస్తే విశ్వవిద్యాలయాల్లో అల్లకల్లోలం తలెత్తుంది. భావ వైవిధ్యాన్ని ప్రదర్శించలేని స్థాయికి విశ్వవిద్యాలయాలు దిగజారిపోతే సామాజిక జ్ఞానమే స్తంభించిపోతుంది. అమెరికా విశ్వవిద్యాలయాలకు ఉన్న బలమే భావ వైవిధ్యత. అందుకే అక్కడ జరిగే పరిశోధనలకు అంత గుర్తింపు ఉంటుంది. భారతీయ భాషలు, కులాలు, మతాలు, నగరాలు, ప్రాంతీయ సంస్కృతులు, స్థానిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఎన్నో లోతైన పరిశోధనలు జరిగాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వాటిని పక్కనపెడితే ఏర్పడే జ్ఞానశూన్యత చాలా అసాధారణంగా ఉంటుంది. అందుకే అక్కడ భావప్రకటనలపై కట్టడులు పెడితే జరిగే నష్టం భారత్‌తో పాటు చాలా దేశాలపై ఉంటుంది. రిపబ్లికన్ పార్టీకి ఆధునిక భావాలు అంతగా పట్టవు. మతభావాలపై మక్కువ ఎక్కువ. క్రైస్తవ వాదుల ప్రభావం అధికం. అబార్షన్లను వ్యతిరేకిస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు సమానత్వాన్ని నిరాకరిస్తుంది. పర్యావరణ విధ్వంసం నిజం కాదంటుంది. సమానత్వ భావనను చులకన చేస్తుంది. ఇంత చరిత్ర ఉండబట్టే వామపక్ష భావాల పొడ ఏ మాత్రం గిట్టదు. వాటి పట్ల శత్రుత్వధోరణితో వ్యవహరించటం కొత్తకాదు. ఆ ధోరణి అమెరికన్ చరిత్రలో భయానక పరిణామాలకు కారణమైంది. 1940, 50ల్లో ఆ పార్టీకి చెందిన సెనటర్ జోసెఫ్ రేమండ్ మకార్తీ.. వేలమంది ప్రజలను కమ్యూనిస్టులనే ముద్రవేసి వేధించారు. ప్రభుత్వ వ్యవహారాల సెనెట్ కమిటీకి, దర్యాప్తు ఉపసంఘానికీ అధ్యక్షత వహించి విచారణల పేరుతో భయాన్ని, బీభత్సాన్ని సృష్టించారు. హాలివుడ్ దర్శకులు, నటుల నుంచి మొదలుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు మకార్తీ ఆరోపణలనూ, విచారణలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. మకార్తీ చర్యలను విశ్లేషిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి. అమెరికా చరిత్రను వాస్తవిక దృక్పథంతో రాసే వారెవరూ మకార్తీయిజాన్ని విస్మరించలేకపోయారు. మకార్తీ రెండుసార్లే (1946, 1952) సెనట్‌కు ఎన్నికయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖలోకి 57 మంది కమ్యూనిస్టులు చొరబడ్డారని 1950లో ప్రకటించి సంచలనం సృష్టించారు. 'మన ప్రభుత్వంలో కమ్యూనిస్టుల గురించి చర్చించుకునేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనదగ్గరున్న కొత్త ఆయుధానికి సంబంధించిన బ్లూప్రింట్‌ను దొంగిలించటానికి డబ్బుని తీసుకునే గూఢచారులతో మాత్రమే మనం వ్యవహరించటం లేదు. మన విధానాన్ని తీర్చిదిద్దటానికీ మార్గదర్శనం చేయటానికీ ఉద్దేశించిన దుర్మార్గపు కార్యకలాపాలతో మనం వ్యవహరిస్తున్నాం' అని ప్రకటించారు. ప్రభుత్వంలో చొరబడిన కమ్యూనిస్టులు అమెరికా విధానాలను ప్రభావితం చేసే స్థాయికి చేరారన్నదే ఆ ప్రకటన అంతరార్థం. అంతటితో ఆగలేదు. అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏలో కూడా కమ్యూనిస్టులు ఉన్నారని ఆరోపించారు. ఇతర విభాగాల్లోనూ కమ్యూనిస్టులు తిష్టవేశారని విమర్శించారు. రెండోసారి సెనటర్‌గా ఎన్నికైన తర్వాత ఆరోపణలను మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వ కార్యకలాపాల సెనట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికకావటంతో విపరీత అధికారాలు వచ్చిపడ్డాయి. దానికితోడు శాశ్వతంగా ఉండే సెనట్ దర్యాప్తు కమిటీ నేతృత్వమూ దక్కింది. ఏళ్లపాటు మకార్తీ మాటకీ చేతకీ అడ్డూఅదుపూ లేకుండా పోయింది. వామపక్షవాదులుగా ముద్రలువేసిన వారిపై 36 రోజులపాటు జరిపిన విచారణ టెలివిజన్‌లో ప్రసారం చేయటం అప్పట్లో సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. న్యూజెర్సీలోని 'ఆర్మీ సిగ్నల్ కాప్స్ ఇంజనీరింగ్ లేబరటరీస్' గూఢచర్యం ఆరోపణలపై జరిపిన విచారణ కూడా టెలివిజన్‌లో ప్రసారమైంది. ఉద్యోగుల విధేయతను పరిశీలించటానికి అప్పట్లో 'లాయల్టీ సెక్యూరిటీ స్క్రీనింగ్ బోర్డు' అనేది ఒకటి ఉండేది. ఆ బోర్డు వేసిన ప్రశ్నలకు జవాబుచెప్పటానికి నిరాకరించిన ఒక డెంటిస్ట్‌ను సైనిక విభాగం నియమించిదంటూ మకార్తీ ఆరోపణ చేశారు. దీంతో ఆగకుండా ఆర్మీ న్యాయవాదిగా వ్యవహరించే జోసెఫ్ వెల్చ్ కమ్యూనిస్టు ప్రజాసంఘం సభ్యుడైన వ్యక్తిని ఉద్యోగంలో పెట్టుకున్నారని ఆరోపించారు. అప్పటికే ఎన్నో ఆరోపణలను చేసి ఒకటిరెండు తప్ప వేటినీ నిరూపించలేని పరిస్థితి ఏర్పడింది. టెలివిజన్ ప్రసారాలతో క్రమేపీ ప్రచార ఆర్భాటమూ, ఆరోపణల డొల్లతనం కనపడడమూ మొదలైంది. 'మీకు సభ్యత అంటూ లేదా సర్? దాన్ని పూర్తిగా వదిలేశారా?' అంటూ వెల్చ్ ఎదురుదాడి చేయటంతో ప్రజలకు కూడా మకార్తీపై విముఖత మొదలైంది. జర్నలిస్టు ఎడ్వర్డ్ ఆర్.మరో తన 'సీ ఇట్ నౌ' కార్యక్రమంలో మకార్తీ వైపరీత్యాన్ని చీల్చిచెండాడారు. దారుణాలన్నీ జరిగిపోయిన తర్వాత, జీవితాలన్నీ నాశనమయ్యాక సెనట్ కూడా మకార్తీని తప్పుపట్టి అభిశంసించింది. 'మెనీ ఆర్ ద క్రైమ్' పేరుతో ఎలన్ ష్రెకర్ ప్రచురించిన పుస్తకంలో మకార్తీయిజం గురించి చాలా విషయాలను ప్రస్తావించారు. మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలంపాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ వ్యాఖ్యానించారు.

# భాషపై స్వీయనియంత్రణ తప్పనిసరి!



పీవీ ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు 'మీరు ఏదైనా కీలక నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఎలా ఆలోచిస్తారు' అని ఒక విలేకరి ప్రశ్నించగా 'నేను ఏదైనా నిర్ణయం తీసుకునేముందు కాళోజీ స్పందన ఏ రకంగా ఉంటుందోనని కొద్దిసేపు మననం చేసుకుంటాను' అని బదులిచ్చారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రభుత్వాధినేతగా కూర్చున్న పీవీ పక్కా కాంగ్రెస్ వ్యక్తి. అయినా, పీవీపై ఉన్న ప్రభావం అది. ఒక రకంగా చెప్పాలంటే తెలంగాణ అంతటి చైతన్యవంతమైన సమాజం బహు శా భారతదేశంలోనే లేదు. అందుకే, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలు కమ్యూనిస్టు, విప్లవ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల్లో తెలంగాణ ప్రజల సాహిత్య, సాంస్కృతిక పరిణతి, అదే సమయంలో ఉదారవాద, మానవీయ, ప్రజాస్వామిక లక్షణాలు కనబడుతాయి. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో జరిగిన పొరపాట్లను ఆత్మవిమర్శ చేసుకున్న సమాజం, మలిదశ ఉద్యమంలో మరింత పరిణతిని ప్రదర్శించడమే కాకుండా, తన మిలిటెంట్ స్వభావాన్ని రాజ్యాంగ పరిధిలోనే కొనసాగించింది. అందుకే, ఉద్యమ సమయంలో భాషాపరంగా నినాదాలు, పాటలు ఆంధ్రా ప్రజల నాలుకలపై కూడా నాట్యమాడాయి. తెలంగాణ ఏర్పాటు అనివార్యతను సృష్టించడంలో కేసీఆర్, జేఏసీ, యావత్ తెలంగాణ సమాజం విజయవంతమైంది. కాబట్టే తెలంగాణ స్వప్నం సాకారమైంది. దక్కన్ పీఠభూమి, బంగారు తునక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం సహజంగానే తనకున్న భౌగోళిక అనుకూలతలను అందిపుచ్చుకొని సమర్థవంతమైన నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి దిశగా పయనించింది. అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయ పరచుకొని సాగు, తాగు నీరు, కరెంటు, రోడ్లు, ఐటీ, పారిశ్రామిక తదితర రంగాలన్నింటిలోనూ ఆశించినంత మేర ప్రజ లు సంతృప్తి చెందేటట్లుగా పునర్నిర్మాణం చేసుకున్నది. ఉద్యమ సమయంలో ప్రజలను ఉత్తేజపరచడానికి ప్రజలకు చేరేవిధంగా ప్రసంగాలు, మాటలు, పాటలు గ్రామీణ జీవన శైలిని, యాసను పల్లె పదాలను సంతరించుకున్నయి తప్ప బూతును దరి చేరనీయ లేదు. ఆంధ్ర నాయకత్వం తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చడానికి, కేసీఆర్ వ్యక్తిగత జీవితాన్ని బహిరంగంగా దిగజార్చడానికి కుయుక్తులతో, కృత్రిమ కవిత్వంతో, అసంబద్ధ కల్పనలతో, అవాస్తవ కథనాలతో ప్రయత్నం చేసినా కేసీఆర్ లక్ష్యపెట్టలేదు. అంతేకాదు, వాళ్లు ప్రవర్తించిన విధంగా ఆంధ్ర నాయకుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూడలేదు. ఉమ్మడి ఏపీ కాలంలోనూ, తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం సుమారు దశాబ్ద కాలం పాటు తెలంగాణలో ఏపీ రాష్ట్రం విడిపోయిన ఐదేండ్ల వరకు ఆయా రాష్ట్రాలలో రాజకీయ పరిస్థితులు కొంతవరకు హుందాగా ఉండేవి. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీల మధ్య పరస్పర నిందారోపణలు వ్యక్తిగత స్థాయికి దిగజారి కుటుంబంలోని మహిళల వరకు వెళ్లడం జుగుప్సాకర సంఘటనలుగా చెప్పవచ్చు. ఒక దశలో కొంతమంది రాజకీయ నాయకుల మాటల్లోని బూతులు మూడో తరగతి సినిమాల స్థాయి కంటే దిగజారాయి. హైదరాబాద్ ఏకైక ముఖ్యమంత్రిగా సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, వాగ్వైభవ సంపన్నులు స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు అసెంబ్లీలో చూపించిన వ్యవహారదక్షత నేటి తరానికి పాఠ్యాంశాల వంటివి. అవసరమైనప్పుడు సభలో ఆయన ప్రత్యర్థులను తన సునిశితమైన మాటలతో చీల్చి చెండాడేవారు కానీ, ఆ ప్రయత్నంలో ఎదుటివారు ఆవగింజంతైనా నొచ్చుకునేవారు కాదు. కారణం తన ప్రసంగంలో వ్యవహార సంబంధమైన వ్యాఖ్యలే కానీ, వ్యక్తిగత విషయాలను స్పృశించని హుందాతనం వారిది. దురదృష్టవశాత్తు గత రెండున్నరేండ్ల కాలం నుంచి తెలంగాణలో రాజకీయ విలువలు క్షీణించాయి. పరస్పర వ్యక్తిగత దూషణలతో హుందాతనం కోల్పోతున్న వైనం ప్రజలను అసహనానికి గురిచేస్తున్నది. పార్టీ వేదికల మీదనే కాకుండా దిగజారిన భాషా ప్రయోగం సర్వవ్యాపితమై కూర్చున్నది. పాలకులు.. ప్రతిపక్షాలు, ప్రజల నుంచి వచ్చే విమర్శలకు సంయమనంతో స్పందించాలి. వ్యక్తిగత దాడులు చేయకుండా, సైద్ధాంతికపరమైన చర్చలు ఆరోగ్యకరమైన వాతావరణంలో నిర్మాణాత్మకంగా సాగాలి. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష నాయకులు ఆవేశపూరిత, నిందాపూర్వక ఉపన్యాసాల కంటే వాస్తవిక దృష్టితో ఈ ప్రజా సమస్యలను విశ్లేషించి, పరిష్కార మార్గాలను సూచించే విధంగా మాట్లాడాలి. అటువంటివారినే సమర్థవంతమైన నాయకులుగా, పరిపాలనాదక్షులుగా, ప్రజాప్రతి నిధులుగా తెలంగాణ సమాజం చిరస్థాయిగా గుర్తుంచుకుంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, కన్నడ, మరాఠీ, పర్షి యా, సంస్కృతం వంటి భాషల్లో ప్రావీణ్యం ఉన్న బూర్గుల, పీవీలతో పాటు జలగం వెంగళరావు, తరిమెల నాగిరెడ్డి, ఓంకార్, ఈశ్వరీబాయి, సూదిని జైపాల్ రెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు, రోశయ్య లాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలి. ఇటువంటి వక్తలతో కూడిన అసెంబ్లీలో సమావేశాలు, ప్రసంగాలు జ్ఞానబోధనలుగా సాగేవి. హాస్యోక్తులతో, పరస్పర వ్యంగ్యోక్తులతో ప్రజా సమస్యల మీద అర్థవంతమైన చర్చలు జరిగేవి. కాగా, దురదృష్టవశాత్తు ప్రస్తుతం అధికారపక్ష నాయకులు రాష్ట్ర ప్రభుత్వాధినేత తరచుగా ప్రయోగిస్తున్న భాష ఆక్షేపణీయమని సర్వత్రా చర్చించుకుంటున్నారు. ప్రతిపక్షాలు నిగ్రహం కోల్పోయి, నిస్పృహతో అప్పుడప్పుడు సంయమన రేఖను దాటినప్పటికీ ప్రభుత్వం, ప్రభుత్వాధినేతలు బాధ్యతగా వ్యవహరి స్తేనే ప్రజలు హర్షిస్తారు. ఎన్నికల సమయంలో, కార్యకర్తల్లో జోష్ నింపడానికి కొన్ని మాటలు తూలినప్పటికీ ప్రజలు పట్టించుకోకపోవచ్చు, కానీ, ఎన్నికలు పూర్తయి అధికారపీఠం ఎక్కి ఏడాదిన్నర దాటిన తర్వాత కూడా భాష మెరుగుపడకపోవడం గర్హణీ యం. భాషా ప్రయోగం లాగులు, తొండలు, పేగులు, తోడ్కలు మీదుగా నడిబజారులో బట్టలిప్పడం వరకు రావడం అవాంఛనీయం మాత్రమే కాదు, ఆత్మవిమర్శ చేసుకోవలసిన సందర్భం. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకొని సాటి రాజకీయ నాయకులపై స్వీయ నియంత్రణ పాటిస్తూ హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్నది. లేనిపక్షంలో భవిష్యత్తు తరాల దృష్టిలో దోషులుగా మిగిలిపోవడమే కాకుండా, చైతన్యవంతులైన తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. అసెంబ్లీ.. కృష్ణదేవరాయల భువన విజయం, కుతుబ్‌షాహీల అజరామరంల వలె కాకపోయినా, బసవపురాణం నుంచి మహాప్రస్థానం వరకు, క్యాపిటలిజం నుంచి సోషలిజం వరకు చదువుకున్న గతకాలపు పార్లమెంటేరియన్ల వారసత్వాన్ని కొనసాగించాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు.

# నైతిక పతనంలో న్యూస్ ఛానల్స్

ఇతరుల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే జర్నలిస్టులు తమ వృత్తిధర్మ నిర్వహణ విషయమై చిత్తశుద్ధితో ఆత్మ పరిశీలన చేసుకోవడం అరుదు అని పలువురు తరచు విమర్శిస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి గృహంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు లభించడంపై న్యూస్ టీవీ ఛానెల్స్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాయి. అది సహేతుకమే. న్యాయమూర్తుల ప్రవర్తనలోని మంచి చెడులను నిర్ణయించేదెవరు? అని న్యూస్ యాంకర్లు తీక్షణంగా ప్రశ్నించారు. ఇది జరిగిన 24 గంటల అనంతరం సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్యకేసులో తమ దర్యాప్తును ముగించినట్టు సీబీఐ ఒక నివేదికను కోర్టుకు నివేదించింది. సుశాంత్ మరణానికి ఆత్మహత్యే కారణమని, ఆ ఘటనకు ఇతర అసహజ కారణాలు ఏవీ లేవని సీబీఐ స్పష్టం చేసింది. ఈ దర్యాప్తు నివేదికపై మీడియాలో ఎటువంటి గగ్గోలు లేదు. చర్చలేవీ జరగలేదు సుశాంత్ మరణానికి దారితీసిన కారణాలు నిజంగా ఏమిటనేవి తెలుసుకోవాలని ప్రజలు అభిలషిస్తున్నారు. సుశాంత్ స్నేహితురాలు రియా చక్రవర్తి శీల హననానికి పాల్పడినవారు 'నేను తప్పు చేశాను' అని ఒప్పుకున్నారా లేదా అనే విషయాన్ని కూడా ప్రజలు తెలుసుకోవలసి ఉన్నది. అయితే ఇవేమీ జరగలేదు. ప్రతిభావంతుడు అయిన బాలీవుడ్ నటుడు జూన్ 2020లో ముంబైలోని తన గృహంలో మరణించినట్టు పోలీసులు కనుగొన్నారు. ఈ యువ నటుడి మరణంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. సుశాంత్ మరణంలో యువ నటి రియా చక్రవర్తి ప్రమేయముండవచ్చని ఆరోపణలు వచ్చాయి. సుశాంత్ మరణంపై తలెత్తిన వివాదానికి ఆమే కేంద్రమయింది. ఇది ఆమెకు ఊహించని పరిణామం. వారాలు, నెలల తరబడి రియాను, ఆమె కుటుంబాన్ని మీడియా వెంటాడింది. పోలీసు దర్యాప్తును ఎదుర్కొన్నారు. సుశాంత్ మరణంలో రియా, ఆమె కుటుంబం ప్రమేయం ఉండి ఉంటుందని న్యూస్ టీవీ ఘోషించింది. తొలుత ప్రైమ్ టైమ్ టీవీ కథనాలు సుశాంత్ ఆత్మహత్య చేసుకునేలా అతడిని రియా, ఆమె కుటుంబమే ప్రేరేపించి ఉంటుందని సూచించాయి. ఆ తరువాత సుశాంత్ ఆత్మహత్య చేసుకోలేదని, హత్యకు గురయ్యాడని, అందుకు జరిగిన కుట్రలో రియా భాగస్వామి అని అభియోగాలు మోపాయి. సుశాంత్ ఆస్తులను కైవశం చేసుకునేందుకు రియా కుట్ర పూరితంగా ప్రయత్నించిందని ఆరోపించిన న్యూస్ టీవీ ఒక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలో భాగస్వామిగా ఉందని కూడా ఆమెను చిత్రించాయి. ఇలా ఆ యువ నటి పట్ల ద్వేషపూరితంగా ఎడతెగని దుష్ప్రచారం చేశాయి. అంతేనా? సుశాంత్‌కు చేతబడి చేసిందని కూడా విమర్శించాయి. రియాను 'మంత్రగత్తె' అని పేర్కొంటూ ఆమెను తీవ్రంగా దూషించాయి. సామాజిక మాధ్యమాల వైఖరి మరింత ఘోరంగా, భయానకంగా ఉన్నది. 'సుశాంత్‌కు న్యాయం జరగాలి' అనే ఉద్యమాన్ని ఆరంభించాయి. సుశాంత్ విషాద మరణానికి రియానే కారకురాలు అని గొంతుచించుకున్నాయి. ఈ ఆరోపణలు ఏవీ అప్పుడూ ఇప్పుడూ రుజువు కానేలేదు. అవి పూర్తిగా నిరాధారమైనవి. అయినప్పటికీ ఆమె ఒక నెలరోజుల పాటు జైలు వాసం చేయవలసివచ్చింది. న్యూస్ టీవీ తీరుతెన్నుల ఫలితంగానే ఈ శోచనీయమైన పరిణామాలు సంభవించాయి. రియాపై విమర్శలు, ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఇప్పుడు రుజువయింది. మరి ఐదు సంవత్సరాల క్రితం అప్పుడే ప్రారంభమైన వృత్తి జీవితం దాదాపుగా అంతమై పోయింది. ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లదలుచుకున్న ఆమె సోదరుడి స్వప్నాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో దర్యాప్తు ఛిద్రం చేసింది. రియా తండ్రి సైనిక వైద్యుడు. పాతికేళ్లకు పైగా మన భౌగోళిక సరిహద్దుల రక్షకులకు ఆయన వైద్య సేవలు అందించారు. అయినా మీడియాలోని తోడేళ్ల గుంపు ఆయన్నీ వదలలేదు. తమ ఛానెల్‌కు టీఆర్‌పీ రేట్లను పెంచడమే లక్ష్యంగా పనిచేసే న్యూస్ యాంకర్ల మూలంగా ఒక మధ్యతరగతి వృత్తి నిపుణుల కుటుంబం సర్వనాశనమయింది. ఇదంతా కోవిడ్ విలయంలో చోటుచేసుకున్న మరో విషాదం. దేశమంతా లాక్‌డౌన్‌లో మగ్గిపోయిన కాలమది. సామాజిక దూరం నిబంధనలు పాటించేందుకు ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయిన రోజులవి. అటువంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో తీసుకోవలిసిన జాగ్రత్తలపై ప్రజలకు మార్గదర్శకత్వం వహించాల్సిన మీడియా 'ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం' పేరిట పూర్తిగా అవాంఛనీయమైన వార్తలతో ప్రజలను తప్పుడు రీతుల్లో ఉద్దీపింపచేయడం జరిగింది. రియా చక్రవర్తి దురవస్థ నొక్కి చెప్పుతున్నదేమిటి? స్పర్థాత్మక మీడియా జగత్తులో ఒకటి రెండు మినహాయింపులతో న్యూస్ నెట్‌వర్క్‌ అన్నీ తమ నైతిక దిక్సూచిని కోల్పోయాయనే కదూ! 1990ల నడిమి సంవత్సరాలలో ఎంతో ఆశాజనకంగా ఆరంభమైన ప్రైవేట్ న్యూస్ టీవీ విప్లవాన్ని, టెలివిజన్ రేటింగ్ పాయింట్స్‌లో ప్రథమ స్థానంలో ఉండి తీరాలనే ఆరాటంతో అనైతిక మార్గంలో ముందుకు సాగిన మీడియా సంస్థలు పూర్తిగా వ్యర్థపరిచాయి. ఆ విప్లవం నిరర్థకమైపోయింది. అర్థవంతంగా జరగవలసిన వార్తా నివేదన అనవసర సంచలనాత్మకత సంతరించుకోవడం సాధారణమైపోయింది. అసలు ఘటనలపై కాకుండా ఏవో ఘోషలు, గందరగోళాలపైకి దృష్టి మళ్లేలా చేయడంలో న్యూస్ టీవీ ఆరితేరిపోయింది. దుష్ట స్వభావాలు, స్త్రీ ద్వేషం వలలో రియా చిక్కుకుపోయింది. ఒక స్వతంత్ర మహిళ, తన సొంత పేరు ప్రతిష్ఠలకు బాధితురాలు అయింది. లోకులను హీరోలు, విలన్లుగా విభజించిన మీడియా జగత్తు రియాను ఒక వగలాడి, లేదా దుష్టురాలుగా పరిగణించింది. 'సుశాంత్ ప్రభవిస్తున్న నటుడు. ఉజ్వల భవిష్యత్తు ఉన్నవాడు. రియాకు సహచరుడు. అమాయకుడు అయిన ఆ యువ నటుడిని ఆ 'స్వార్థ స్వభావి' తన సుఖ సౌఖ్యాలు, వృత్తిగత ఎదుగుదలకు తెలివిగా ఉపయోగించుకుంది'. వార్తల ముసుగులో ప్రసారితమవుతున్న టీవీ సీరియల్స్‌కు ఇంతకంటే మంచి ఇతివృత్తం మరొకటి ఉంటుందా? ఇక ఇప్పుడు అసలు ప్రశ్నకు వస్తాను: రియాను దూషించిన, ఆమె గౌరవాన్ని మంటగలిపిన వారిని తమ దుర్మార్గానికి జవాబుదారీలుగా చేయడం ఎప్పటికైనా జరుగుతుందా? రియా ఉదంతం కేవలం ఒక వ్యక్తి పరువుకు నష్టం కలిగించిన వ్యవహారం మాత్రమే కాదు. జర్నలిస్టులు అందరూ వార్తారచన ప్రక్రియలో పొరపాట్లు చేసే అవకాశమున్నది. తప్పుడు సమాచారమందించినందుకు పాత్రికేయులు తరచు లేదా అప్పుడప్పుడు క్షమాపణలు చెప్పుతుండడం కద్దు. అయితే రియా కేసు భిన్నమైది. అది అధర్మ పాత్రికేయానికి ఒక తిరుగులేని నిదర్శనం. సుశాంత్ ఆత్మహత్య విషయంలో తాను చెప్పవలసిన విషయాలను వెల్లడించేందుకు అవకాశం లభించని ఒక నిస్సహాయ యువతి జీవితాన్ని గౌరవాన్ని మంటగలిపేందుకు బుద్ధిపూర్వకంగా చేసిన ప్రయత్నమది. ఆ క్లిష్ట కాలంలో ఆమె గోడు ఎవరు విన్నారు? ఆగస్టు 2020లో కన్నీటి పర్యంతమవుతూనే విరాగినిలా నిర్లిప్తంగా ఉండిపోయిన రియాను నేను ఇంటర్వ్యూ చేశాను. ఆమెతో మాట్లాడడానికి, ఆమె చెప్పేదాన్ని స్థిమితంగా, సానుభూతితో వినడానికి ప్రప్రథమంగా జరిగిన ప్రయత్నమది. ఆమెతో సంభాషించడం ద్వారా ఒక పాత్రికేయుడుగా నా విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాను. అయితే రియాను ఇంటర్వ్యూ చేసినందుకు సామాజిక మాధ్యమాలలో నాపై నిరసన వెల్లువెత్తింది. నన్ను పదే పదే విమర్శించారు. దూషించారు. రియాను కాపాడేందుకు నేను ప్రయత్నిస్తున్నట్టు దుయ్యబట్టారు. ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. రియా విషయంలో నా వైఖరి పూర్తిగా కాకపోయినప్పటికీ సరైనదేనని రుజువయింది. రియా తీవ్ర వ్యాకులత నెదుర్కొన్నది. అయితే ధైర్యంగా నిలబడింది. ఆమె నిజాయితీ నిరూపితమయింది. ఆమె జీవితంలో ఆశాజ్యోతి కొడిగట్టలేదు.. అయితే రియా ఎదుర్కొన్న భయానక పరిస్థితులు ముగింపునకు వచ్చేది ఆమెను ఆ కష్టాల పాలుచేసినవారు తమ దుర్మార్గానికి భారీ మూల్యం చెల్లించేలా చేసినప్పుడే అని నిక్కచ్చిగా చెప్పుతున్నాను. న్యూస్ టీవీ విశ్వసనీయతను, మీడియాపై ప్రజల నమ్మకాన్ని పున రుద్ధరించాలంటే రియాకు ఎదురైన అనుభవాలు పునరావృతం కాకూడదు. రియా తన జీవితంలో ఐదేళ్ల విలువైన కాలాన్ని కోల్పోయింది. కోల్పోయిన గౌరవాన్ని పొందేందుకు ఆమె పరిపూర్ణంగా అర్హురాలు. రియాకు బేషరతు క్షమాపణలు ఆమె గౌరవ పునరుద్ధరణకు శుభారంభం కాగలదు.

# లింగ నిర్ధారణ నేరం - డాక్టర్ అరుణ



**గుంతకల్లు మార్చి 28 (ప్రజాజ్యోతి):** జిల్లా కలెక్టర్ మరియు మ్యాజిస్ట్రేట్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు డాక్టర్ అరుణ డాక్టర్ హరిత పిపి యూనిట్ గుంతకల్లు మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యం లో ఆరోగ్య విద్యా బోధకుడు వేణుగోపాల్, హంపయ్య కాలని,32 వ సచివాలయం నందు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై మరియు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ , మరియు హరిత మాట్లాడు తూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని,నిర్దేశిత వయసు లోపు పెళ్లిళ్లు చేస్తే వాటిని బాల్య వివాహాలుగా పరిగణించి అలాంటి వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. బాల్య వివాహాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, టీనేజీ గర్భం వలన జరిగే నష్టాలు, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం ( 1994) పట్ల విద్యార్థుల కు మరియు గర్భవతులకు అవగాహన కల్పించారు. టీనేజ్ గర్భం వలన రక్తహీనతకు గురి కావడమే కాకుండా. అధిక రక్త పీడనం, సంక్లిష్ట కాన్పుకు దారితీస్తుందని తెలిపారు. దీనివల్ల మాత శిశు మరణా లు జరిగే అవకాశం ఉంటుం దని సూచించారు. ఆరోగ్య విధబాధకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ఆడ, మగ ఇద్దరు సమానమే అన్న భావన ప్రతి తల్లిదండ్రి కలిగి ఉండాలని గుర్తు చేశారు. గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే అలాంటి వారు శిక్షార్హులని, అలాంటివి చేసుకున్నా, ప్రోత్సహించినా శిక్షతోపాటు జరిమానా తప్పదని తెలియ చేశారు. చిన్న వయసులో వివాహం చేసుకోవడం వలన అనేక రకాలైన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని గుర్తు చేశారు. ఆడపిల్లలు చదువుపై దృష్టి సారించాలని, దీంతో తల్లిదండ్రులు పెళ్లిళ్లు తొందరగా చేయాలనే ఆలోచన ఉండదని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పద్మలత, ఏఎన్ఎం విజయలక్ష్మి , రియాజ్,మరియు సచివాలయం సెక్రటరీ పాల్గొన్నారు.

# రెల్లిగడ్డ ద్వారా సాగునీరు అందించే దిశగా చర్యలు

**వైకాపా హయంలో రెల్లిగడ్డ అభివృద్ధి పనులకు ఆటంకం**

**ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారని ఇదుగురుపై కేసు నమోదు**

**కేసును పునః పరిశీలించాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే కూన రవి నివేదిక**

**స్పందించిన రాష్ట్ర ఇంజనీరింగ్ శాఖ**

**ఇరిగేషన్ అధికారులపై కేసు ఉపసంహరణ**




**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** రెల్లిగెడ్డ ద్వారా పొందూరు మండలంలో ఉన్న లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మండల అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ ,జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు ,ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు,తాడివలస సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు,పొందూరు మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మీ పత్రికా ప్రకటన లో పేర్కొన్నారు. ఈ దిశగా ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పియూసి చైర్మెన్ కూన రవికుమార్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. రెల్లిగడ్డ అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న పనులపై ఆయన దృష్టి సారించారన్నారు.గతంలో 2023 లో పొందూరు మండలం కొల్లిపేట గ్రామం నుండి ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట గ్రామం వరకు రెల్లిగడ్డ అభివృద్ధి పనులు చేపట్టిన నీటి పారుదల శాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారని 2023 వ సంవత్సరంలో గత వైకాపా ప్రభుత్వం ఐదుగురు ఇరిగేషన్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తరువాత లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే రెల్లిగడ్డ అభివృద్ధి పనులను చేపట్టేందుకు శ్రీకారం చుట్టిందన్నారు . ఈ మేరకు గత ప్రభుత్వంలో అన్యాయంగా అధికారులపై నమోదు చేసిన కేసును పునః పరిశీలించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పియూసి చైర్మెన్ కూన రవికుమార్ ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఇంజనీరింగు ఇన్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ వాటర్ రీసోర్స్ డిపార్ట్మెంట్ వారు 2023 లో ఐదుగురు ఇరిగేషన్ అధికారులపై నమోదు చేసిన క్రిమినల్ కేసును ఉపసంహరించుకున్నారని పేర్కొన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కూన రవికుమార్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గం లో ప్రతీ ఒక్క సెంటు భూమికి సాగునీరు అందించడమే ఆయన ముఖ్య ఉద్దేశ్యమని ఈ సందర్భంగా నేతలు తెలియజేశారు.

## విద్యుత్తు ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి. సిపిఎం



**పోడూరు /పెనుగొండ, మార్చి 28,ప్రజాజ్యోతి న్యూస్.** విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని, అధికారంలోకి వస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు తగ్గిస్తాం, విద్యుత్తు బిల్లులు తగ్గిస్తాం అని హామీలు ఇచ్చారు.లోకేష్ యువగళం యాత్రలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రజలకు పిలుపునిచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు సర్దుబాటు చార్జీలు పెంచారని సిపిఎం పార్టీ పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా, మండల కమిటీ సభ్యులు రత్నరాజు విమర్శించారు. శుక్రవారం పెనుగొండ, సిద్ధాంతం సబ్ స్టేషన్ల వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతూ రెండుసార్లు సర్దుబాటు చార్జీలు పెంచారని, రెండుసార్లు విద్యుత్ యూనిట్ చార్జిలు పెంచారని విమర్శించారు. వెంటనే పెంచిన విద్యుత్తు రేట్లు తగ్గించాలని, సర్దుబాటు చార్జీ రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, సెకి తో ఒప్పందం రద్దు చేయాలని, టైం ఆఫ్ డే విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పెనుగొండ, సిద్ధాంతం సబ్ స్టేషన్లు వద్ద అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగశెట్టి గంగారావు, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్, నీలాపు ఆదినారాయణ, మహిళా సంఘం నాయకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులు కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలి ఇన్చార్జ్ టీవీ రామారావు



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి 28, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో జనసేన పార్టీ నాయకులు అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జనసేన పార్టీ కొవ్వూరు ఇంచార్జ్ టీవీ రామారావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం బిజెపి ప్రభుత్వాలతో జనసేన పార్టీ కలిసి పనిచేస్తున్న జనసేన పార్టీ నాయకులు వీర మహిళలు ఉన్నప్పటికీ వారికి ఎటువంటి లబ్ధి చేకూరడం లేదని కూటమి ప్రభుత్వం పాలనలో తప్ప నాయకులలో లేదని మా నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మేరకు తెలుగుదేశం బిజెపి పార్టీలతో కలిసి ఉంటామని ఏది ఏమైనప్పటికీ జన సైనికులకు వీర మహిళలకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరికరేవుల నుండి తాళ్లపూడి వరకు ఎన్నో ఇసుక ర్యాంపులు ఉన్నాగాని వాటిలో ఏ ఒక్క దానిలో కూడా జనసేన పార్టీ నాయకులు వాటా లేకపోవడం దురదృష్టకరమన్నారు. తాళ్లపూడి మండలంలో జనసేన నాయకులకు అన్యాయం జరిగిందని కూటమి ప్రభుత్వం జనసేన నాయకులను కూడా గుర్తించి ర్యాంపు లలో వారికి కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరుతున్నారు.

## రసధుని ఆధ్వర్యంలో రేపు ఉగాది కవి సమ్మేళనం

**పాలకొల్లు. ప్రజా జ్యోతి.(కొట్టి రామం.) మార్చి 28.** విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈ నెల 30 ఆదివారం ఉదయం తొమ్మిదిన్నరకు పాలకొల్లు చిన్న గోపురం వద్ద గల ఆర్య వైశ్య కళ్యాణమండపం నందు పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరుపుతున్నట్లు సంస్థ అధ్యక్షులు కొట్టి భాస్కరరావు తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని పద్య, వచన కవితలు గజల్స్ వినిపిస్తారన్నారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కెవిపి శర్మ పంచాంగం విశ్లేషణ జరుపుతారన్నారు. ఉగాది సందర్భంగా రసధుని నిర్వహించిన ఉభయ రాష్ట్రాల స్థాయి తెలుగు కవిత పోటీలలో విజేతలకు ఈ కార్యక్రమంలో నగదు బహుమతులు స్థానిక ప్రముఖుల చేతుల మీదుగా అందజేయబడతాయని సంస్థ ప్రధాన కార్యదర్శి కె జయ దుర్గారావు కోశాధికారి యర్రంశెట్టి వెంకటరత్నం తెలిపారు. రసధుని నిర్వహిస్తున్న ఈ ఉగాది కవి సమ్మేళనంకు స్థానిక వాసవి ఆర్యవైశ్య సంఘం,వాసవి క్లబ్, పానకాలరాయ రామ్మోహన్ క్లబ్ వారితోపాటు మరి కొందరు సాహితీ ప్రియులు ప్రోత్సాహం అందిస్తున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షులు పి లక్ష్మీనారాయణ, తెలిపారు. పాలకొల్లు పరిసర గ్రామాల సాహితీ ప్రియులు, సాహిత్య అభిమానులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సభ్యులు మామిడిశెట్టి శ్రీనివాసరావు కోరారు.

## రసధుని ఉగాది కవితల పోటీలలో విజేతలు వీరే.

**విజేతలను వెల్లడించిన రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కర రావు.**

**పాలకొల్లు. ప్రజా జ్యోతి (కొట్టి రామం.)మార్చి 28.** శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ నిర్వహించిన కవితల పోటీలలో విజేతల వివరాలను రసధుని సంస్థ అధ్యక్షులు కొట్టి భాస్కరరావు శుక్రవారం వెల్లడించారు. "అ సంబద్ధం "కవితకు ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ (కొంతేరు,) ప్రధమ బహుమతి, " మానవత్వం మడుగు " కవితకు జవ్వాది దాశరథి శ్రీనివాస్ (భీమవరం) ద్వితీయ బహుమతి, "రాజధాని అమరావతి కవితకు చిలుకూరి సూర్యప్రసాద్,(యలమంచిలి.) బహుమతులు పొందారు. ప్రోత్సాహక బహుమతులను "మరిచిపోయిన మానవత్వాన్ని" కవితకు ఉప్పల వెంకటాచార్యులు (జంగారెడ్డిగూడెం) "ఓ మహర్షి మన్నించుమయ్యా " కవితకు ఎన్ కె నాగేశ్వరరావు, పెనుగొండ. "అమృతబీజం తెలుగు తేజం." కవితకు విజయలక్ష్మి పొప్పొప్పు (తణుకు ) పొందారు. కవితల పోటీల విజేతలకు ఈ నెల 30వ తేదీ ఆదివారం పాలకొల్లు శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు రసధుని నిర్వహిస్తున్న ఉగాది కవి సమ్మేళనం సభలో బహుమతులు అందజేయబడతాయని కొట్టి భాస్కర రావు తెలిపారు.

## ఉగాది పర్వదినం మరియు పవిత్ర రంజాన్ హిందూ ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన తలారి పరుశురాం చారిటబుల్ ట్రస్ట్





**గుంతకల్లు మార్చి 28 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని పాత బస్టాండ్ నూరాని మసీద్ పక్కన టి పి ఆర్ ట్రస్ట్ భవనము నందు శుక్రవారం ఉదయం ఉగాది పర్వదినం మరియు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని హిందూ ముస్లిం 125 కుటుంబాలకు ఉగాది కానుకలు,రంజాన్ తోఫా తలారి పరుశురాముడు చారిటబుల్ ట్రస్ట్ అధినేత తలారి పరుశురాముడు శకుంతలమ్మ దంపతుల చేతుల మీదుగా పేదలకు పంపిణీ చేయడం జరిగినది. అనంతరం పరశురాముడు మాట్లాడుతూ మేమంతా ఇండియన్స్ ఒకే కుటుంబం హిందూ ముస్లిం భాయి భాయి అనే సోదర భావాన్ని ఐక్యతను చాటుతూ పట్టణ జిల్లా రాష్ట్ర ప్రజలు భారతదే శంలోని అందరూ ఇలాగే కలిసి ఉండాలని కోరుతూ ఈరోజు హిందూ ముస్లింల పవిత్ర పండగలను పురస్క రించుకొని బియ్యం,బ్యాళ్లు, చక్కెర,బెల్లం,నూనె,రవ్వ షామియా,నెయ్యి సరుకులు ఇవ్వడం మా వంతు సహకా రం అందించినందుకు సంతోషిస్తూ సమాజం కోసం మా వంతు సేవలు చేయాలని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆశీస్సులతో 29.6.11 సం" పరశురాం ట్రస్ట్ స్థాపించి మానవసేవయే మాధవ సేవ నుంచి నిరుపేదలైన వారికి విద్య,వైద్యం,ఉపాధి,పెళ్లిళ్లు లక్షల విలువలు చేసే స్థలాలు సచివాలయాలకు ఇవ్వడం, ఉచిత కంటి,గుండె, ఎముకలకు,స్కిన్,షుగర్ వ్యాధులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం,దేవస్థానా లకు,మసీదులకు,చేర్చిలకు, సహకారం అందించటం స్కూలు గ్రామాలు దత్తకు తీసుకోవడం,కరోనా విపత్తు సమయంలోను అన్నదానా లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూరాని మసీద్ ఆజీ, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ అర్చకులు చెన్నకేశవ స్వామి,లాయర్ అరిఫ్, రెండో వార్డ్ కౌన్సిలర్ మేహ్రూనీబి,బిల్వ మస్తాన్, తలారి రాజశేఖర్ ఇంజనీర్ శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శంకర్,మురారి, ఓంశాంతి ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**తూర్పుగోదావరిజిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి28, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్ళపూడి మండలంలో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాబడిన రూ. 2,52,666/- ల విలువ గల చెక్కులను లబ్ధి దారుల గృహాలకు వెళ్ళి అందజేసిన కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు చెక్కులు అందజేశారు

అందుకున్న వారి వివరాలు 1. పాతాళ బాల అభిషేక్ రూ. 31,500/- బల్లిపాడు, 2. జవ్వాది భూషణం రూ. 20,524/- పెద్దేవం, 3. మెరుమ్ రవళి రూ. 25,000/- ప్రక్కిలంక, 4. సాలి శివ నారాయణ రూ. 30,787/- తిరుగుడుమెట్ట, 5. మల్లంపల్లి ప్రకాశం రూ. 37,100/- తిరుగుడుమెట్ట, 6. గుణ్ణం నాగమణి రూ. 45,655/- వేగేశ్వరపురం, 7. అడ్డాల సుప్రియ రూ. 25,000/- 8. జంగా సూర్యనారాయణ రూ. 37,100/- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పార్టీల కు అతీతంగా ప్రతి కుటుంబానికి అండగా ఉంటుంది అని అన్నారు ఈ కార్యక్రమం లో తాళ్లపూడి మండల కూటమి నాయకులు పాల్గొన్నారు

## స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలి..సిపిఎం.



**పోడూరు /ఆచంట, మార్చి 28,ప్రజాజ్యోతి న్యూస్.** ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెకి ఒప్పందాలపై విమర్శలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం నోరు మెదటడం లేదని సిపి మండల కార్యదర్శి పి మోహన్ రావు అన్నారు. ట్రూ అప్ సర్దుబాటు చార్జీలు, సెకి ఒప్పందం, టైం అప్ స్కేల్ రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఆచంట మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ వి ఎన్ శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, కొండేటి సత్యనారాయణ, నెక్కంటి కృష్ణమూర్తి, చదలవాడ చంటిబాబు శ్రీపాద ప్రజ్వల శ్రీపాద ప్రభావ, కారం చినబాబు, నిమ్మన సత్యనారాయణ, చదలవాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాంతం పెరుగు లంక భూములను దళిత పేదలకు పంచాలి.. సిపిఎం



**పోడూరు, పెనుగొండ, మార్చి 28,ప్రజాజ్యోతి న్యూస్.** వశిష్ట గోదావరి సిద్ధాంతం పెరుగులంక భూములలో మట్టి అక్రమ త్రవ్వకాలను ఆపాలని, దళితులు మరియు పేదలకు ఆ భూములు పంపిణీ చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ సహజ సిద్ధంగా గోదావరి పరివాహక ప్రాంతంలో ఏర్పడిన లంకలను కొంతమంది వ్యాపారులతో కుమ్మక్కై ఎప్పటికప్పుడు అక్రమంగా త్రవ్వేయడం జరుగుతుందని అన్నారు. పెరిగిన లంక ను త్రవ్వకాలు వలన రైతులు పండించుకునే 'సీ పట్టా భూములకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఆ భూములు దళిత పేదలకు పంచాలని లంక ప్రాంతంలో ఆందోళన నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లంక మట్టి అక్రమ తవ్వకాలపై సన్నాహాలు చేసుకున్న సంగతులు పై సిపిఎం పెనుగొండ మండల తహసిల్దార్ వారికి ఫిర్యాదు చేసిన వెంటనే త్రవ్వకాలు నిలిచిపోయాయని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పెరుగు లంక భూములు పంచి వారి ఆర్థిక స్థితిగతులు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుసుమే వెంకటేశ్వరరావు,గుమ్మడి రాజు, గెడ్డం నాగేశ్వరరావు, గెడ్డం ప్రభాకర్ రావు, బత్తుల శీను, చింతా శ్రీను, గుమ్మడి భాను, గెడ్డం చంటి కుసుమే నవీన్, నేలపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## వేసవి దృష్ట్యా వృద్ధులు గర్భిణీలు తగు జాగ్రత్తలు పాటించాలి డిప్యూటీ డిఎండిహెచ్ఓ సంధ్య



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం,మార్చి28,** ప్రజా జ్యోతిన్యూస్ తాళ్లపూడి మండలం పరిధిలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్ ను సాధారణ పరిశీలనలో భాగంగా శుక్రవారం డిప్యూటీ డిఎండిహెచ్ఓ సంధ్య సందర్శించడం జరిగినది , హాస్పిటల్ రికార్డులను పరిశీలించి వివరాలు సక్రమంగా ఉన్నాయో లేవో అని పరిశీలించడం జరిగింది హాస్పటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చికిత్స కోసం వచ్చే రోగుల కు త్రాగునీరుని అందుబాటులో ఉంచాలన్నారు అనంతరం పి హెచ్ సి కి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలందరూ అవసరమైతేనే తప్ప బయటకు రాకుండా ఉండాలని ఒకవేళ బయటికి వెళ్లే పరిస్థితి ఉంటే వాటర్ బాటిల్ ను గొడుగు వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ముఖ్యంగా బాలింతలు ,చిన్న పిల్లలు , వృద్ధులు,బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు స్థానిక పిహెచ్ సి లో వైద్య సలహాలు తీసుకోవచ్చునని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## సింగనమల దళిత ఎమ్మెల్యేని అడ్డుపెట్టుకొని టు మెన్ కమిటీ అరాచకం




ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి బుక్కరాసముద్రం సిఐ కరుణాకరం పై అక్రమ బదిలీ వేటు వెంటనే నిలిపివేయాలి భారతీయ భీమ్ సేన మరియు దళిత గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన కార్యాలయం నందు వ్యవస్థాపకులు రాకెట్ల చందు నాయక్ వ్యవస్థాపకులు జై భీమ్ రామాంజనేయులు రాష్ట్ర అధ్యక్షులు పామిడి సాకే ఓబులేసు %ణ+ూ% రాష్ట్ర అధ్యక్షులు పోతలయ్య కలిసి కార్యాలయం నందు మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో జై భీమ్ రామాంజనేయులు మాట్లాడుతూ కర్ణాకర్ సిఐ బదిలీ దుర్మార్గమని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రాజకీయ నాయకులు కుల రాజకీయాలు చేస్తున్నారని సింగనమల నియోజకవర్గం నందు దళిత ఎమ్మెల్యేని అడ్డుపెట్టుకొని టూ మెన్ కమిటీ వారు అరాచకాలు చేస్తున్నారని ఈ అరాచకాలకు అడ్డుకట్టుగా దళిత సిఐ కరుణాకర్ అడ్డుగా ఉన్నారని ఉద్దేశపూర్వకంగానే ఆయనను బదిలీ చేపించి విఆర్ఓ పంపించారని దళిత ఉద్యోగస్తులు ఏ స్థాయిలో ఉన్న బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ అలాగే ఈ పెత్తందారి వ్యవస్థకు మాట వింటేనే ఏ అధికారి అయిన క్షేమంగా ఉంటారని లేదా ఏ ఉద్యోగస్తుడికైనా ఇలాంటి పరిస్థితి వస్తుందని సమాజానికి తెలియజేస్తూ నియంత్ర పరిపాలన చూపిస్తున్నారని మండిపడ్డారు అలాగే %ూజ% నియోజవర్గంలో మీ పెత్తనం ఏమిటి అని మీకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ రిజర్వేషన్ను జనరల్ నియోజవర్గం చేసి పోటీ చేయాలని మీడియా ముఖంగా సవాలు విసురుతూ ఆయన మీడియా సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే %ణ+ూ% వ్యవస్థాపకులు రాకెట్ల చందు నాయక్ మాట్లాడుతూ సీఐ కరుణాకర్ బదిలీ వేటు ఆపాలని అలాగే సింగనమాల ఎమ్మెల్యే శ్రీ బండారు శ్రావణి ఉండగా మరి టూ మెన్ కమిటీ ఎందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రశ్నించారు ఇప్పటికైనా ఈ కూటమి ప్రభుత్వం దళిత ఉద్యోగస్తులు పైన కక్ష సాధింపు చేస్తున్న టూ మెన్ కమిటీ వారిపై చర్యలు తీసుకోకపోతే అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పామిడి సాకే ఓబులేసు. డిజిపి రాష్ట్ర అధ్యక్షులు పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్థితిగతులు గుర్తింపుకు సర్వే



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** స్వయం శక్తి సంఘాల మహిళల ఆర్థిక స్థిరత్వానికి తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఏపియంలు ఆర్. రామ మూర్తి ,గురుగుబెల్లి శ్యామలరావు తెలిపారు. పొందూరు మండల కేంద్రంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వి. ఓ. ఏ లు ,సీసీ కు,ఎల్.సి లకు ఎస్.హెచ్.జి సభ్యుల రుణ,జీవన ఉపాధి ప్రణాలిక పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 ఎస్.హెచ్.జి లకు ఒక ఎన్యుమరేటర్ ను పెట్టి తద్వారా స్వయం శక్తి సంఘాల సభ్యుల కుటుంబ రుణ, ఆర్థిక స్థితిగతులు , జీవన ఉపాధి వంటి అంశాలపై సర్వే నిర్వహించి ప్రణాలికలు తయారు చేస్తారని పేర్కొన్నారు. సర్వే కొరకు వి. ఓ. ఏ లకు హ్యాండ్ హోల్డింగ్ సపోర్ట్ తో ప్రణాలిక ఎన్యుమరేటర్ శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. ఈ సర్వే ద్వారా మహిళల ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని వారి పురోభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలు , ఇతర సౌకర్యాలను కలించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షులు , సీసీ లు , ఎల్.సి, వి. ఓ. ఏ లు , ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## ఈ కేవైసీ గడువు పెంచాలని తాసిల్దార్‌కు సిపిఐ నాయకులు వినతి



**గుంతకల్లు మార్చి 28 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణం నందు ఈ కేవైసీ గడువు పెంచాలని శుక్రవారం గుంతకల్లు సిపిఐ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ రమాదేవికి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, గోపీనాథ్,రాము రాయల్ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణం నందు ఈ కేవైసీ గడువు పెంచాలని అదేవిధం గా విద్యార్థులు విద్యార్థులు వలస వెళ్లిన ప్రజలు వాళ్ళంద రి దృష్టిలో పెట్టుకొని ఈకేవైసి గడువు పెంచాలని అదేవిధం గా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని రేషన్ కార్డులో వ్యక్తులను మార్పు లు,చేర్పులు చేయుటకు మరియు చనిపోయిన వారి తొలగించడానికి ఆప్షన్లను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, కొంతమంది రేషన్ షాప్ లో తూకాలు డబ్బాలు పెట్టి వేయడం వల్ల లబ్ధిదారులు నిజంగా నష్టపోతున్నారు. కావున వారికి సక్రమంగా తూకాలు ద్వారా రేషన్ అందే విధంగా చూడాలని.. అదేవిధంగా రేషన్ షాపులో సన్నబియ్యం ఉచితంగా ఇవ్వాలని, ఇంటి దగ్గరకు వచ్చే రేషన్ వాహనాలు కానీ సక్రమంగా రావడం లేదని చెప్పి పలు సమస్యలపై తాసిల్దార్ తో చర్చించి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర ప్రజా నాట్యమండలి మండల కార్యదర్శి పుల్లయ్య సిపిఐ శాఖ కార్యదర్శులు నూర్ భాషా,ఉమర్ భాష,,వెంకట నాయక్,దాసరి శ్రీనివాసులు, దౌలా తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

వ్యాపార రంగంలో ముందంజలో ఉండాలి

ఓఎన్డిసితో మహిళలకు తోడ్పాటు

ఏపియంలు ఆర్. రామమూర్తి ,గురుగుబెల్లి శ్యామలరావు



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** నైపుణ్యం ఉన్న మహిళలను నిజమైన ఆర్థిక స్వాతంత్రులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపి యంలు ఆర్ రామమూర్తి, గురుగుబెల్లి శ్యామలరావు అన్నారు. ఈ మేరకు పొదుపు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను ఆన్లైన్ లో విక్రయించు కునేందుకు వీలుగా ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓ .ఎన్.డి.సి )అనే కొత్త యాప్ కు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు పొందూరు మండలంలో 1009 ఆర్డర్స్ బుకింగ్ జరిగగా ఇప్పటివరకు 517 ఉత్పత్తులను సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించి వారికి ఆర్థిక స్వేచ్ఛ కల్పించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతీ ఒక్క మహిళ డిజిటల్ మార్కెటింగ్ పైన అవగాహన కలిగి ఉండి మరింత ఉత్పత్తులను తయారు చేస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.

## ముఖ్యమంత్రి సభకు వేగంగా ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు..

క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్, అధికారంతో టెలి కాన్ఫరెన్స్..

శనివారం నాటికి హెలిపాడ్ పనులు పూర్తి చేయాలి..

సభకు విచ్చేసే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదు..

అధికారులకు దిశ నిర్దేశం చేసిన కలెక్టర్..




**బాపట్ల, మార్చి 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి పర్యటించనున్న చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం సాయంత్రంలోగా ముఖ్యమంత్రి హెలిప్యాడ్ పనులను పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లకు చెప్పారు. ముఖ్య మంత్రిపాల్గొనే సభా వేదిక వద్ద బ్యారికెడ్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్య మంత్రి పాల్గొనే ప్రజావేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. ప్రజా వేదికను సౌకర్య వంతంగా తయారు చేయాలని ఆయన అన్నారు. ముఖ్య మంత్రి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్త కుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్య మంత్రి కోసం అలాగే ప్రజా ప్రతినిధుల కోసం గ్రీన్ రూమ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా వేదిక వద్ద 2వేల మంది కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించవలసిందిగా జిల్లారెవెన్యూ అధికారికి చెప్పారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ వెంకట మురళి సూచించారు.

## స్మార్ట్ మీటర్లు వద్దు -పాత మీటర్లే ముద్దు.

ట్రూ ఆఫ్, సర్దుబాటు చార్జీలు, సెకి ఒప్పందం రద్దు,

టైం ఆఫ్ స్కేల్ విధానం రద్దు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్.



**పోడూరు, మార్చి 28,** ప్రజాజ్యోతి న్యూస్.స్మార్ట్ మీటర్లు ప్రక్రియను విరమించుకోవాలని సిపిఎం పోడూరు మండలం కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పశ్చిమగోదావరి జిల్లా పోడూరు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేసి, స్మార్ట్ మీటర్లు వద్దు, పాతమీటర్లే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపి విద్యుత్ అధికారి కే. మధుకుమార్ కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెదేపాప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెకి ఒప్పందాలపై విమర్శలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమిప్రభు త్వం నోరు మెదటడం లేదన్నారు. ట్రూ అప్ సర్దుబాటు చార్జీలు, సెకి ఒప్పందం, టైం అప్ స్కేల్ రద్దుచేయాలన్నారు.ఈకార్యక్రమంలోనేతలు బి.వెంకట్రావు, కే శ్రీనివాసరావు,

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ఉక్కుపాదం


**అసాంఘిక కార్యకలాపాల కట్టడికి డ్రోన్ ల వినియోగం**

**పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్పీ**




బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ హాలులో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. చెడు నడత కలిగిన వ్యక్తుల పై నిఘా ఉంచాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వారు నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నదని గ్రహిస్తే వెంటనే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అత్యంత నేర స్వభావం కలిగిన 20 మంది పాత నేరస్తులను గుర్తించడం జరిగిందన్నారు. వారిపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. దీనికి ప్రధాన కారణం వేసవి సెలవుల్లో చాలామంది విహారయాత్రలకు బంధువుల ఇళ్లకు తీర్థయాత్రలకు వెళుతుంటారన్నారు. తాళాలు వేసిన గృహాలను లక్ష్యంగా చేసుకొని నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. పోలీస్ అధికారులు వారి పరిధిలో గస్తీ విధులను ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అనుమానితులు తారసపడితే వారిని విచారించి మొబైల్ సెక్యూరిటీ చెక్డ్ డివైస్ ద్వారా వారి వేలిముద్రలు స్కాన్ చేయాలన్నారు. అనుమానితులు ఎక్కడైనా నేరం చేసినట్లు వస్తే వారిని అదుపులోకి తీసుకొని విచారించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడాన్ని పూర్తిస్థాయిలో కంట్రోల్ చేయాలన్నారు. హైవే ల దగ్గరలో ఉన్న వెంచర్లు, శిథిలావస్థలో, నిరుపయోగంగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయన్నారు. అటువంటి ప్రదేశాల పై నిఘా ఉంచాలన్నారు. తరచూ ఆ ప్రదేశాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. డ్రోన్ ల సహాయంతో నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు చేయాలన్నారు. సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమైన కూడళ్ళు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, వాణిజ్య దుకాణాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలోనే నేరాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేసులను చేదించడంలో సీసీ కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తాయి అన్నారు. వాటిని ఉపయోగించి త్వరితగతిన అత్యంత సులువుగా కేసుల దర్యాప్తు నిర్వహించవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండే ప్రదేశాలను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాలు తరచూ జరగడానికి గల కారణాలను అధ్యయనం చేయాలన్నారు. అ ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు, బ్లింకింగ్ లైట్స్, జీబ్రా క్రాసింగ్ లైన్స్ ఏర్పాటు చేయడం, చెట్ల పొదలను తొలగించడం వంటి చర్యలతో పాటు ఆ ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కేసుల విచారణలో నైపుణ్యతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించి భౌతిక సాక్షా దారాలను సేకరించి వాటిని నిపుణుల పరిశీలనకు పంపి వారు ఇచ్చే నివేదికను త్వరగా పొంది సంబంధిత కోర్టులో పూర్తి ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పోలీస్ స్టేషన్లకు, పోలీస్ కార్యాలయాలకు వచ్చే అర్జీ దారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను కూలంకషంగా విని తగిన చర్యలు తీసుకుంటామని భరోసాను వారికి కల్పించాలన్నారు. శక్తి యాప్ గురించి మహిళలకు విద్యార్థినులకు విస్తృత అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. సబ్ డివిజన్ లలో ఉన్న శక్తి బృందాలు పాఠశాలలో, కళాశాలలో, వివిధ కార్యాలయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్ లను సందర్శించి యాప్ యొక్క ఆవశ్యకత గురించి మహిళలకు వివరించాలన్నారు. శక్తి యాప్ నుండి పోలీస్ స్టేషన్లకు ఏదైనా సందేశం లేదా కాల్ వస్తే వెంటనే స్పందించి పది నిమిషాల లోపు ఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. త్వరితగతిన స్పందించకుంటే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, చీరాల డిఎస్పి మోయిన్, రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి విజయ సారథి, ట్రైనీ డిఎస్పి రావూరి అభిషేక్, జిల్లా ఎస్ బి ఇన్స్పెక్టర్ నారాయణ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సూర్య సోలార్ ఎనర్జీ సొల్యూషన్‌ను ప్రారంబించిన ఎమ్మెల్యే వేగేశన..



**బాపట్ల, మార్చ్ 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జి బి సి రోడ్డు ఇన్కమ్ టాక్స్ ఆఫీస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పీఎం సూర్య ఘర్ సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ ను శుక్రవారం ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, తో కలసి బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం సోలార్ ప్యానల్స్ వాటి పనితీరుని సోలార్ ప్యానల్స్ ఎండి కేస్ రాజుని అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాల కోసం విద్యుత్ ను ఆదా చేయాలనే మహా సంకల్పంతో అలాగే మనం ఎలక్ట్రిక్ వస్తువులను వాడుకున్న ఎలాంటి విద్యుత్ చార్జీలు లేకుండా మన అకౌంట్ లోకి అదనంగా డబ్బులను వస్తాయని పి యం సూర్య ఘర్ సోలార్ యోజన పథకాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఆదా చేయడానికి సోలార్ పథకాన్ని ప్రోత్సహిస్తున్నాయని అలాగే ఈ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ ప్రజలకు ప్రతినెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు కేంద్రం ఇటీవల బడ్జెట్ లో పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే, రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు సబ్సిడీ నుంచి రాయితీతో కూడిన బ్యాంకు రుణాలు పొందవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ఎస్సీ ఎస్టీ ప్రజలకు పదివేల కలెక్షన్లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఓసి బిసి ప్రజలకు సబ్సిడీ ఉంటుందని బ్యాంకు లోన్లు కూడా అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సోలార్ కేటగిరీలో ఒక యూనిట్ రెండు యూనిట్లు మూడు యూనిట్లు, ఇలా కేటగిరీని బట్టి ఉన్నాయని, ఒక కే డబ్ల్యు కి 70000 చొప్పున ఉంటుందని అందులో 30 వేల రూపాయలు సబ్సిడీ ఉంటుందని, అలాగే 2 కే డబ్ల్యు తీసుకున్న వారికి 60000 సబ్సిడీ, 3 కే డబ్ల్యు తీసుకున్న వారికి 78000 వేల రూపాయలు సబ్సిడీ ఉంటుందని అలాగే 3 కె డబ్ల్యూ తీసుకున్న వారికి ప్రతి నెల 2000 రూపాయల వరకు మిగులు యూనిట్లుకు వారి బ్యాంకు అకౌంట్లో జమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలందరూ సూర్య ఘర్ సోలార్ కలెక్షన్లను బిగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ జే. వెంకట మురళి, ఎస్ ఈ, జి ఆంజనేయులు, డి.ఈ జి భాస్కరరావు, ఏడి శ్రీనివాసరావు, పట్టణ ఏఈ సాయి శ్రీనివాస్, రూరల్ ఏఈ కె శ్రీనివాసరావు, సోలార్ ప్యానల్స్ హెచ్ఆర్ బి ఫణి లైన్మెన్లు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వర్షాకాలం వచ్చేసరికి ఇసుక రీచ్‌లో నిల్వాలు పెంచాలి..

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ..



**బాపట్ల, మార్చి 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** రాబోవు వర్షాకాలం దృష్ట్యా ఇసుక రీచ్ లలో ఇసుక నివ్వల పెంపుపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇసుక రీచ్ లో ఉన్న ఇసుక నిలువులపై గనుల శాఖ అధికారులను ఆయన ఆరా తీశారు. గాజులంక-1, జువ్వలపాలెం బీచ్ నుండి ఇసుక తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు ముగిసిన నేతద్యంలో వాటిని రెన్యువల్ కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గాజులంక-1 బీచ్ లో 50 శాతం వరకు ఇసుక తవ్వకాలు జరగగా, జువ్వలపాలెంలో ఎటువంటి తవ్వకాలు జరగలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం గాజులంక-2 బీచ్ లో 40 వేల టన్నులు ఇసుక నిలువలు మాత్రమే ఉన్నాయని ఆయన తెలిపారు. జూన్ 15 నుండి అక్టోబర్ మాసం వరకు వర్షాకాలం కారణంగా బీచ్ ల నుండి ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా జిల్లాలో ఇసుక డిమాండ్ మేరకు ముందుగా మే నెలాఖరు నాటికి ఇసుక నిల్వ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఓలేరు బీచ్ నుండి ఇసుక తవ్వకాలకు అన్ని అనుమతులు ఉన్నందున ఇసుక తవ్వకాలకు చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. ఓలేరు బీచ్ లో 74 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. వాటి తవ్వకాలకు సంబంధించి ఏజెన్సీ ఎన్నికకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితులలో వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.జిల్లా అవసరాలకు మాత్రమే వాడుకోవాలని, ఇతర జిల్లాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గాజులంక -1, జువ్వలపాలెం బీచ్ ల రెన్యువల్ కోసం సంబంధిత అధికారులతో చర్చించి అనుమతులు పొందాలని అధికారులను ఆయన ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, ఏడి మైన్స్ రాజేష్ బాబు, జిల్లా రవాణా అధికారి పరంధామ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఎస్సీ ఆర్డబ్ల్యూఎస్ అనంతరాజు, రేపల్లె ఆర్డీవో రాజ్యలక్ష్మి మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ఆదేశం మేరకు



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మొగిలి పెద సత్తిబాబు, మొగిలి వెంకన్న, మొగిలి కృష్ణ లకు చెందిన రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా గారి ఆదేశాల మేరకు ఓమ్మంగి టిడిపి నాయకులు దుప్పట్లు, వస్త్రాలు, వంట సామాగ్రి, కూరగాయలు, బియ్యం అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గారు బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒమ్మంగి టిడిపి నాయకులు కొప్పన సీతారాముడు, రామిశెట్టి మునసుబు, సుంకర సోమరాజు, రామకుర్తి కామేష్, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొప్పన నాని తదితరులు పాల్గొన్నారు

## వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే, రంజాన్ తోఫా పంపిణీ..



**బాపట్ల, మార్చ్ 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేగేశన ఫౌండేషన్ చైర్మన్,బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు వేగేశన ఫౌండేషన్ ద్వారా శుక్రవారం బాపట్ల నియోజకవర్గంలో ఉన్న మసీదులలో ఇమామ్ లు, మౌజన్ లకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ రంజాన్ పండుగ ముఖ్య ఉదేశ్యం పేదలకు సహాయం చేయడం, శాంతి సౌభ్రాత్వం,అందుకే ఆ దేవుడు నాకు ఇచ్చినంతలో ఇలా ముస్లిం సోదరులకు అండగా నిలుస్తుంది అని అన్నారు. మా వేగేశన ఫౌండేషన్ ద్వారా గత తొమ్మిదేళ్ళుగా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు,ఇమామ్ లు, మౌజన్ లకు రంజాన్ తోఫాలు అందించడంతో పాటు,మసీదు ల అభివృద్ధి కి ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు,పిట్టలవాని పాలెం మండల అద్యక్షులు అఫ్జల్,రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఫరీద్ మస్తాన్, యూనిట్ ఇన్ ఛార్జ్ ఖాన్,కాలేషా మరియు తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## వేసవి కాలం నీరు వృధా చేయకండి మున్సిపల్ కమిషనర్



**బద్వేల్ మార్చి 28 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈ రోజు పురపాలక కార్యాలయం నందు వార్డు అమెనిటీస్ సెక్రెటరీ లతో సమీక్షా సమావేశం నిర్వహించిన మున్సిపల్ కమీషనర్. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొంత మంది పురపాలక సంఘం ద్వారా అందించే త్రాగునీరు మునిసిపాలిటీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులకు , స్లాబ్, క్యూరింగ్ మరియు ఇతర నిర్మాణ పనులకు వాడుతున్నట్లుతెలిసిందన్నారు. బ్రహ్మ సాగర్ నుండి మునిసిపాలిటీ అందించే త్రాగునీటి లో తగు మోతాదులో క్లోరిన్ వుండడం వలన సదరు నీటిని స్లాబ్, క్యూరింగ్ ఇతర ఎలాంటి నిర్మాణ పనులకు వాడిన ఇనుము,సిమెంట్ తదితర వాటితో రియాక్షన్ జరిగి ఇంటి నిర్మాణాలు త్వరగా పాడవుతాయి(%జుఞ%: స్లాబ్ పెలుసులు ఉడిపడటం, గోడలు ఉర్లీ పడటం) జరుగుతుందన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ కుళాయిలు అన్నీ కూడా తక్షణమే రెగ్యులర్ చేయించాలని చేయించుకొని పక్షంలో కుళాయిలు తొలగించాలని తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదుల దగ్గర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. లైటింగ్ సిబ్బంది వార్డులలో తిరుగుతూ లైటింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. నీరు సరఫరా చేయు సిబ్బంది నిత్యం తిరుగుతూ ప్రజలకు పై విషయాలపై అవగాహన కల్పించి ఎవరైతే అట్లు కనెక్షన్ తీసుకున్నరో ఆ కుళాయి కనెక్షన్ లు తక్షణమే తొలగించాలన్నారు. పురపాలక సంఘానికి చెందిన అన్నీ రకాల పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ తో పాటు మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ లు మహేష్ ,బాబు మరియు అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ఉక్కుపాదం

## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి డ్రోన్ ల వినియోగం

## పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్పీ




బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ హాలులో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. చెడు నడత కలిగిన వ్యక్తుల పై నిఘా ఉంచాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వారు నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నదని గ్రహిస్తే వెంటనే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అత్యంత నేర స్వభావం కలిగిన 20 మంది పాత నేరస్తులను గుర్తించడం జరిగిందన్నారు. వారిపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. దీనికి ప్రధాన కారణం వేసవి సెలవుల్లో చాలామంది విహారయాత్రలకు బంధువుల ఇళ్లకు తీర్థయాత్రలకు వెళుతుంటారన్నారు. తాళాలు వేసిన గృహాలను లక్ష్యంగా చేసుకొని నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. పోలీస్ అధికారులు వారి పరిధిలో గస్తీ విధులను ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అనుమానితులు తారసపడితే వారిని విచారించి మొబైల్ సెక్యూరిటీ చెక్డ్ డివైస్ ద్వారా వారి వేలిముద్రలు స్కాన్ చేయాలన్నారు. అనుమానితులు ఎక్కడైనా నేరం చేసినట్లు వస్తే వారిని అదుపులోకి తీసుకొని విచారించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడాన్ని పూర్తిస్థాయిలో కంట్రోల్ చేయాలన్నారు. హైవే ల దగ్గరలో ఉన్న వెంచర్లు, శిథిలావస్థలో, నిరుపయోగంగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయన్నారు. అటువంటి ప్రదేశాల పై నిఘా ఉంచాలన్నారు. తరచూ ఆ ప్రదేశాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. డ్రోన్ ల సహాయంతో నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు చేయాలన్నారు. సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమైన కూడళ్ళు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, వాణిజ్య దుకాణాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలోనే నేరాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తాయి అన్నారు. వాటిని ఉపయోగించి త్వరితగతిన అత్యంత సులువుగా కేసుల దర్యాప్తు నిర్వహించవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండే ప్రదేశాలను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాలు తరచూ జరగడానికి గల కారణాలను అధ్యయనం చేయాలన్నారు. అ ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు, బ్లింకింగ్ లైట్స్, జీబ్రా క్రాసింగ్ లైన్స్ ఏర్పాటు చేయడం, చెట్ల పొదలను తొలగించడం వంటి చర్యలతో పాటు ఆ ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కేసుల విచారణలో నైపుణ్యతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించి భౌతిక సాక్షా దారాలను సేకరించి వాటిని నిపుణుల పరిశీలనకు పంపి వారు ఇచ్చే నివేదికను త్వరగా పొంది సంబంధిత కోర్టులో పూర్తి ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పోలీస్ స్టేషన్లకు, పోలీస్ కార్యాలయాలకు వచ్చే అర్జీ దారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను కూలంకషంగా విని తగిన చర్యలు తీసుకుంటామని భరోసాను వారికి కల్పించాలన్నారు. శక్తి యాప్ గురించి మహిళలకు విద్యార్థినులకు విస్తృత అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. సబ్ డివిజన్ లలో ఉన్న శక్తి బృందాలు పాఠశాలలో, కళాశాలలో, వివిధ కార్యాలయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్ లను సందర్శించి యాప్ యొక్క ఆవశ్యకత గురించి మహిళలకు వివరించాలన్నారు. శక్తి యాప్ నుండి పోలీస్ స్టేషన్లకు ఏదైనా సందేశం లేదా కాల్ వస్తే వెంటనే స్పందించి పది నిమిషాల లోపు ఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. త్వరితగతిన స్పందించకుంటే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, చీరాల డిఎస్పి మోయిన్, రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి విజయ సారథి, ట్రైనీ డిఎస్పి రావూరి అభిషేక్, జిల్లా ఎస్ బి ఇన్స్పెక్టర్ నారాయణ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మనకు ఉన్న దాన్ని మరొకరితో పంచుకోవడమే..

**ఉపవాస దీక్ష విరమణ సందేశం..**
**జిల్లా కలెక్టర్ ప్రశాంతి..**
**ఇఫ్తార్ విందు కార్యక్రమం లో కలెక్టర్ ..**
**ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్..**
**హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, గోరంట్ల, ఎస్పీ డి నరసింహా కిషోర్, జెసి చిన్న రాముడు..**





**రాజమహేంద్రవరం, మార్చి 28 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** మనకు ఉన్న దాన్ని మరొకరితో పంచుకోవడమే రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సందేశమని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక పందిరి ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాసన సభ్యులు, ఎస్పీ లతో కలిసి ఉపవాస దీక్ష విరమింప కార్యక్రమానికి కలెక్టర్ పి. ప్రశాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు ఉపసంహారణ కేవలం ఉపవాస దీక్ష విరమింప చెయ్యడం కాదు , మనకి ఉన్నదాన్ని మరొకరితో పంచుకోవడం అన్న సందేశం ఇవ్వడమేనని అన్నారు. దైవంపై నమ్మకం కలుగ చేసే గొప్ప గ్రంథం ఖురాన్ అన్నారు. మనకు జీవితాన్ని ఇచ్చిన దేవుడును ప్రార్థన చేయడం ద్వారా ప్రతి రోజు ఐదుసార్లు గుర్తుకు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా దాతృత్వం, గొప్పతనాన్ని చాటి చెప్పే మాసం రంజాన్ అన్నారు. మనకు ఉన్నది ఐదుగురితో పంచుకోవడం, హజ్ యాత్ర చెయ్యడం ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే విషయాలు అన్నారు. రంజాన్ మాసం ఇచ్చే గొప్ప పిలువు దాతృత్వం అన్నారు. అదే స్ఫూర్తితో రంజాన్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం పి 4 కార్యక్రమానికి నాంది పలికిందన్నారు. సంఘటితంగా ఉంటే మనం అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు, పేదరికం లేని సమాజ స్థాపన సాధ్యం అన్నారు. ఇటువంటి ఒక మంచి కార్యక్రమం లో నన్ను కూడా పాల్గొనే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాజమహేంద్రవరం సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రమశిక్షణ దాతృత్వం తో ముస్లిం సోదరులందరూ అల్లా ఆశీస్సులతో ఈ రంజాన్ మాసంలో ఎంతో పవిత్రముగా ఉపవాస దీక్షలను చేస్తారన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్తను గుర్తు చేసుకోవాలన్నారు. నగరంలో నెల రోజులుగా పవిత్రమైన రంజాన్ మాసంలో ప్రతి మసీదులో రంజాన్ ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. మైనార్టీల అభివృద్ధి అభ్యున్నతి కోసం 1300 కోట్లు అదనంగా కలుపుకొని మొత్తం 5300 కోట్లు వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించిందన్నారు. 2014-2019 అప్పటి శాసనమండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి 5 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. తాడితోట మసీదు వద్ద 3 లక్షల రూపాయలు తన సొంత ఖర్చుతో షెడ్డును నిర్మించినట్లు చెప్పారు. అదేవిధంగా 46 డివిజన్లో ఐఎస్ఆర్ మసీదు వద్ద కూడా 7 లక్షల రూపాయలతో షెడ్డు నిర్మించినట్లు పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ సోదరుల అభ్యున్నతి కోసం వారు తలపెట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతమయ్యే దిశగా ఎమ్మెల్యే గా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు గోరంట్ల బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్షలో ఉన్న పెద్దలందరినీ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ లో నిర్వహించిన ఇఫ్తార్ ఇందు కార్యక్రమంలో పాల్గొని మైనారిటీ సోదరుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అదేవిధంగా జిల్లాలో కూడా ఇఫ్తార్ ఇందు కార్యక్రమాన్ని ప్రభుత్వ పరంగా నిర్వహించుకుంటున్న మన్నారు.మతం అనేది విశ్వాసం, నమ్మకం అన్నారు. ముస్లింలకు కురాన్, క్రిస్టియన్ కు బైబిల్, హిందువులకు భగవద్గీత గా వున్న అన్ని మత గ్రంథాల సారాంశం మంచిని బోధించడమే అని పేర్కొన్నారు. భారతదేశంలో అనేక కులాలు అనేక మతాలు ఉన్నప్పటికీ మనమందరం ఐకమత్యంగా ఉండి రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, సహనానికి, తోటి వారికి తనకి ఉన్నదాన్ని పంచడం అనే గొప్ప సందేశం ఇచ్చే రంజాన్ మాసం స్ఫూర్తి కలిగిస్తోందని అన్నారు. జిల్లా ఎస్పీ డి నరసింహా కిషోర్ మాట్లాడుతూ, సమాజం మంచిని కోరుకుంటూ సమాజ శ్రేయస్సు ఆకాంక్షించే విధంగా రంజాన్ ఉపవాస దీక్ష కార్యక్రమం స్ఫూర్తి కలిగిస్తోందని అన్నారు. అజ్మీర్ దర్గా వద్ద జరిగే కార్యక్రమంలో సుమారు 70 నుంచి 80 వేల మంది పాల్గొన్నా, ఒక్క కానిస్టేబుల్ లేకుండా అక్కడ క్రమశిక్షణ కలిగిన తీరును ప్రదర్శించడం ఎంతో స్ఫూర్తి ఇచ్చినట్లు తెలిపారు. వేడుకలలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, ఎస్పి, డి. నరసింహ కిషోర్, జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి, ఆర్డివో లు ఆర్ కృష్ణ నాయక్, రాజానగరం, రాజ మహేంద్రవరం అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు బత్తుల రామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చ య్య చౌదరి, యం. డి. అబ్దుల్లా, ఎస్. కె. అమీర్ రాజా, బషీర్ భాయ్, రో యల్ మజ్జిద్ గురు వు, మహ బూబ్ ఖాన్, మహ బూబ్ జానీ బాషా ఖాన్, జానీ భాయ్ పాల్గొ న్నారు.

## పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలి..

**జిల్లా ఎస్పీ తుషార్ డూడి..**
**విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు..**
**స్వయంగా అందజేసి అభినందించిన ఎస్పీ..**



**బాపట్ల, మార్చి 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు విధి నిర్వహణ పట్ల నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రజలు మెచ్చే విధంగా సిబ్బంది నడుచుకోవాలని ఎస్పీ హితవు పలికారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను సిబ్బందిని అభినందించి జిల్లా ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది పోలీస్ అధికారులు సిబ్బందిని శుక్రవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి నేరం జరిగిన 9 నెలల లోపే జీవిత ఖైదు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న ఇంకొల్లు సీఐ రమణయ్య, చిన్నగంజాం ఎస్సై రమేష్, కోర్టు కానిస్టేబుల్ నాగేశ్వరరావు లను, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మహిళ హత్య కేసులోని నిందితునికి యావజ్జీవ కరాగర శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాసరావు, బాపట్ల రూరల్ కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ శివయ్య లను లోక్ అదాలత్ లో రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కరించిన కర్లపాలెం ఎస్సై రవీంద్ర, అద్దంకి సీఐ సుబ్బరాజు, చీరాల వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు లను, సైబర్ నేరాలను ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్ఐ శ్రీకాంత్ లను అభినందించారు. అదేవిధంగా చీరాల టూ టౌన్ సిఐ నాగభూషణం, అమర్తలూరు ఎస్సై అమరవర్ధన్, సైబర్ సెల్ మహిళా కానిస్టేబుల్ కీర్తి, ఐటీ కోర్ మహిళా కానిస్టేబుల్ తబిత, ఐటి కోర్ కానిస్టేబుల్ రామ్మోహన్ రావు లను, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సోషల్ మీడియా సెల్ కానిస్టేబుల్ రాజకుమార్ లను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా డిసిఆర్బి కానిస్టేబుల్ సువర్ణరాజు, వెంకటేశ్వర్లు లను, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల సాధికారత మరియు లింగ సమానత్వం చాటే విధంగా వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించిన ఉమెన్ పిఎస్ సిఐ శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ వెన్నెల లను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ సెల్ సీఐ శ్రీనివాసులు, ఎస్సై శ్రీనివాసరావు లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి స్వయంగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

## కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్కు రెండు టీవీలు అందజేత..

**మొబైల్ షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించిన సీఐ..**




**కైకలూరు, మార్చి 28 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** సీసీటీవీ పర్యవేక్షణ కోసం కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌కు మొబైల్ షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు 65 అంగుళాలు టి.సి ఎల్ స్మార్ట్ టీవీ, 55 అంగుళాలు బి.పి.ఎల్ స్మార్ట్ టీవీ లను అందజేశారు. కైకలూరు టౌన్ పరిధిలో ప్రజా భద్రతను మెరుగుపరచేందుకు, నేర నియంత్రణ మరియు ట్రాఫిక్ పర్యవేక్షణను బలోపేతం చేయడానికి సీసీటీవీ మానిటరింగ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో కైకలూరు మొబైల్ షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజా సంకల్పంతో ముందుకు వచ్చి, సీసీటీవీ ఫుటేజ్‌ను సమర్థంగా పర్యవేక్షించేందుకు అవసరమైన 2 పెద్ద పరిమాణంలోని టీవీని కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌కు శనివారం అందజేశారు.ఈ సందర్భంగా, కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ దుకాణ యజమానుల సంఘాన్ని అభినందిస్తూ, ప్రజలు ఇచ్చే మద్దతు భద్రతా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సీసీటీవీల ద్వారా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు వంటి సమస్యలను సమర్ధవంతంగా పర్యవేక్షించి, నియంత్రించేందుకు ఈ వ్యవస్థ తోడ్పడుతుంది అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్,ఏలూరు డిఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఆదేశాలపై సీసీటీవీల ఉపయోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన చర్యల ఫలితంగా, దుకాణదారులు, వ్యాపారస్తులు, మరియు స్థానిక ప్రజలు పోలీసులకు మద్దతుగా ముందుకు రావడం ప్రశంసనీయమని సీఐ కృష్ణ పేర్కొన్నారు.కార్యక్రమంలో గూడూరు మారుతి శివరామ్, లక్కింశెట్టి మోహన్,మహమ్మద్ ఫిరోజ్,మహమ్మద్ సిరాజ్, మనోజ్ మరియు అసోసియేషన్ సభ్యులు కైకలూరు టౌన్ ఎస్సైలు వెంకట కుమార్, శ్రీనివాసులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్,ఎస్పీ ..



**కాకినాడ, మార్చి 28 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కాకినాడ జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం కోసం శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ కి విచ్చేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి,రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్,జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసి వారు పూల మొక్కలు అందజేశారు.

# భూముల వేలం...రచ్చేంటీ

**హైదరాబాద్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన విద్యార్థులు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్నారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి వేలాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యూనివర్శిటీకి చెందిన భూములను వేలం వేయటమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ భూమి యూనివర్శిటీకి చెందినదని? ఇక్కడ జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వ చర్యలున్నాయని ఆరోపిస్తున్నారు.ఓవైపు విద్యార్థుల ఆందోళన చేస్తుండగా? మరోవైపు ప్రభుత్వ స్పందన మరోలా ఉంది. ఆ భూములతో యూనివర్శిటీకి సంబంధం లేదని స్పష్టం చేస్తోంది. ఆ 400 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి చెందినదే అని చెబుతోంది. ఓపెన్ ఆక్షన్ ద్వారా పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించామని అంటోంది. అసలు హెచ్ సీయూ భూముల వివాదమేంటి..? విద్యార్థుల ఆందోళనకు కారణాలేంటి..? వంటి వాటిపై అంశాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు ఇక్కడ తెలుసుకోండి?

**ఊఅజ భూముల వివాదం – ముఖ్యమైన విషయాలు:**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పరిధిలో(కంచ గచ్చిబౌలి) 400 ఎకరాల భూమిని టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాలను వేలం వేసేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే బిడ్డింగ్స్ కూడా దాఖలయ్యాయి.

400 ఎకరాల భూముల వేలాన్ని యూనివర్శిటీ విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని? ఆ 400 ఎకరాలు యూనివర్శిటీకి చెందినవి చెబుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో యూనివర్శిటీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కోల్పోయే పరిస్థితి ఉంటుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ భూమి మొదట విశ్వవిద్యాలయానికి చెందినదని అని చెబుతున్నారు. వేలం నిలిపివేయాలని విద్యార్థులతో పాటు విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి కూడా లేఖ రాశారు.విశ్వవిద్యాలయం యొక్క విలువైన వనరులను దోచుకునేలా భూములను వేలం వేస్తున్నారు హెచ్ సీయూ విద్యార్థి జేఏసీ ఆరోపిస్తోంది. వీరికి పలువురు ప్రకృతి ప్రేమికులు కూడా మద్దతునిస్తున్నారు. అటవీ ప్రాంతాన్నిఅభివృద్ధి చేస్తే నగరానికి సమీపంలో కొలువైన జీవవైవిధ్యం అంతరించిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. హెచ్‌సీయూ భూముల చరిత్ర చూస్తే? ఈ యూనివర్శిటీ 1974లో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో 2,300 ఎకరాల భూమిని కేటాయించారు. పలు విభాగాలకు కేటాయింపులు చేయగా.. ప్రస్తుతం 1800 ఎకరాల వరకు భూమి ఉందని లెక్కలు చెబుతున్నాయి. అయితే తెలంగాణ ప్రభుత్వం, యూనివర్శిటీ మధ్య ఉన్న భూవివాదానికి కంచ గచ్చిబౌలిలోని అటవీ భూమి కేంద్రంగా ఉంది.





నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం(2003)లో 400 ఎకరాల భూమిని క్రీడా సౌకర్యా అభివృద్ధి పేరిట ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. ఐఎంజీ ఆ ప్రాజెక్టును ప్రారంభించలేదు.నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలటంతో?. 2006లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కేటాయింపును రద్దు చేసింది.

ఇదే విషయంపై ఐఎంజీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరగా? ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును కూడా ఐఎంజీ ఆశ్రయించింది. అక్కడ కూడా వారి పిటిషన్‌ను కొట్టివేసింది. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్‌లు రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఈ 400 ఎకరాలను ప్రభుత్వ భూమిగా ధ్రువీకరించారు. ఈ భూమికి అటవీ శాఖకు ఏ సంబంధం లేదని ప్రభుత్వం ప్రకటన కూడా విడుదల చేసింది. ఈ భూమిని ఇటీవలే టీజీఐఐసీకి కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చింది.ఈ భూమిని వేలానికి కూడా ఇటీవలే ప్రకటన జారీ కాగా.. బిడ్డింగ్స్ దాఖలయ్యాయి.

భూముల వేలాన్ని ఖండిస్తున్న విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. అయితే ఈ ఆందోళనల నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో స్పందించారు. "25 ఏండ్ల క్రితం బిల్లీరావుకు(ఐఎంజీ)గచ్చిబౌలిలో భూమిని కేటాయించారు. ఆ భూమితో సెంట్రల్ యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదు. ఇప్పటి వరకు బిల్లీరావు నుంచి భూమిని వెనక్కు తీసుకోలేదు. ఓపెన్ ఆక్షన్ ద్వారా పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సంస్థలకు ఇవ్వాలని ముందుకు వస్తే.. అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో "పెట్టుబడులకు తీసుకొచ్చేందుకు అక్కడ విస్తరణ చేయాలనుకుంటున్నాం" అని చెప్పారు.రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు కూడా ఇదే విషయంపై స్పందించారు. టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల భూమిలో బఫెలో లేక్, పికాక్ లేక్ వంటి ప్రకృతి ప్రదేశాలు లేవు. యూనివర్సిటీ భూములను తీసుకోవటం లేదని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని రెండు సరస్సులతో పాటు అక్కడి ప్రకృతిని కూడా రక్షిస్తామని చెప్పారు.

విద్యార్థుల ఆందోళనకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మద్దతు తెలిపింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పలువురు విద్యార్థి సంఘాల నాయకులు.. మంగళవారం కేటీఆర్ ను కలిశారు. తమ ఉద్యమానికి మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో?. ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా మద్దతు అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి వైవిధ్యమైన జీవవైవిధ్యం మరియు వృక్షజాలం నశించి?. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# 177 మంది రిటైర్డ్ అధికారులకు షాక్

**హైదరాబాద్ :** మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సహా రిటైర్డ్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. రిటైర్డ్ అయిపోయిన తర్వాత కూడా డ్యూటీలో కొనసాగుతున్న అధికారులను ప్రభుత్వం తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో మార్చి 31 నాటికి 177 మంది రిటైర్డ్ ఉద్యోగులను తొలగించనున్నారు. వీరిలో హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి కూడా ఉన్నారు. హెచ్ఎండీఏ నుంచి 64 మంది రిటైర్ అయిన తర్వాత కూడా కొనసాగుతున్న అధికారులను టర్మినేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీలో 46, వాటర్ బోర్డులో 7 మందిని టెర్మినేట్ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ ఆదేశాలిచ్చింది.మేయర్ గా పనిచేస్తున్న విజయ్ కృష్ణ, మేయర్ పేషన్‌లో పనిచేస్తున్న రాజు కుమార్‌ను కూడా టెర్మినేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరందర్నీ వెంటనే టాప్ ప్రయారిటీపై తొలగించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ అధికారులు ఆదేశాలిచ్చారు. ఇందులో మెట్రో రైల్ ఎండీతో పాటు 28 మందిని సైతం అధికారులు తొలగించారు.2007లో హైదరాబాద్ మెట్రో రైల్ ఏర్పడినప్పటి నుంచి ఎన్వీఎస్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. అంతకుముందు, ఆయన జీహెచ్ఎంసీ ట్రాఫిక్, రవాణా విభాగానికి అదనపు కమిషనర్‌గా కూడా పనిచేశారు. అధికారిగా తన సర్వీసును విడిచిపెట్టి రాష్ట్ర ప్రభుత్వంలో చేరారు. పర్మినెంట్ ఎండీగా అయ్యారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఆయన పదవీకాలం కొనసాగింది. వాటర్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎమ్ సత్యనారాయణ, టీజీ జాయింట్




కలెక్టర్ ఎస్ సత్యయ్య, ఫార్ములా ఇ-రేస్ కేసులో పేరున్న హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇప్పటికే పదవుల నుంచి వైదొలిగారు... అన్ని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,సచివాలయ విభాగాల ప్రధాన కార్యదర్శులు మార్చి 31 నాటికి రిటైర్మెంట్ తర్వాత పనిచేస్తున్న అన్ని రిటైర్డ్ ఉద్యోగుల సర్వీసులు, నియామకం, కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన, వేతనం, కార్పొరేషన్లు,బోర్డులు, రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లోని అన్ని ప్రభుత్వ సంస్థలతో సహా సంబంధం లేకుండా తొలగించాలని ఆదేశించారు.ఈ రిటైర్డ్ అధికారులు ఇప్పటికే అవసరమయ్యే విభాగాల సంబంధిత అధికారి నుంచి తాజా ఉత్తర్వులను పొందవలసి ఉంటుంది. ఈ విషయంలో, డిప్యుటేషన్‌పై లేదా కాంట్రాక్ట్ లేదా సోర్సింగ్ ప్రాతిపదికన నియమించిన 177 మంది అధికారులను సర్వీసుల నుంచి తొలగించారు.వీరిలో హెచ్ఎండీఏలో పనిచేస్తున్న 63 మంది రిటైర్డ్ అధికారులు, జీహెచ్ఎంసీ నుంచి 45 మంది ఉన్నారు. ఇప్పటికే రిటైర్డ్ అధికారులు లేదా ఉద్యోగుల సర్వీసులు అవసరమయ్యే విభాగాల సంబంధిత అధికారి నుంచి అనుమతిని పొందాల్సి ఉంటుంది.

# హైదరాబాద్‌లో హైబ్రిడ్ మోడల్ రోడ్ల విధానం

**హైదరాబాద్ :** రాష్ట్రంలో రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఒక కొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. అదే హైబ్రిడ్ మోడల్ రోడ్ల విధానం. ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులను కలిపే ఈ మోడల్.. వనరుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేస్తూ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచుతుంది. ఊంట్ ఫ్రేమ్‌వర్క్ కింద.. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం భరిస్తుంది. మిగిలిన 60 శాతంప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూరుస్తారు. దీనిలో మొత్తం 12 వేల కిలోమీటర్ల రోడ్లను మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశలో 4,600 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం ఒక ప్రత్యేకమైన యాప్‌ను ఉపయోగిస్తున్నారు.ఈ యాప్ ద్వారా రోడ్ల సమాచారాన్ని సేకరించి.. అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. వాహనదారులకు భారం లేకుండా, టోల్ ట్యాక్స్ లేకుండా రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరగనున్నాయి. మొత్తం 12 వేల కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేస్తారు. మొదటి దశలో 4,600 కిలోమీటర్లు, రెండో దశలో 4,600 కిలోమీటర్లు.. మూడో దశలో 2,800 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తారు.మొదటి దశలో చేపట్టే రోడ్లను గుర్తించడానికి అధికారులు ఒక యాప్‌ను ఉపయోగిస్తున్నారు. దీని ద్వారా రోడ్డు పొడవు, వెడల్పు, కల్వర్టులు, వంతెనలు,వాహనాల రాకపోకల సామర్థ్యం వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ సమాచారం ఆధారంగా ఏ రోడ్లను అభివృద్ధి చేయాలో నిర్ణయిస్తారు.మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు రెండు వరుసల రహదారిని ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా మిస్సింగ్ లింక్ కనెక్టివిటీని అందిస్తారు. ఇక్కడ ఇలా 1,110 కి.మీ. రోడ్లను గుర్తించనున్నారు. జిల్లా కేంద్రం నుంచి రాజధాని వరకు నాలుగు వరుసల రహదారిని ఏర్పాటు చేస్తారు. దీని ద్వారాకూడా మిస్సింగ్ లింక్



కనెక్టివిటీని అందిస్తారు. ఇలాంటి 820 కి.మీ. రోడ్లను గుర్తించారు. వీటితో పాటు నేషనల్ హైవే, ముఖ్య జిల్లా రహదారులు, ఇతర జిల్లా రహదారులు లకు సంబంధించిన 10 వేల కిలోమీటర్లరోడ్లను కూడా అభివృద్ధి చేస్తారు.ఈ రోడ్లను అభివృద్ధి చేయడం వల్ల వాహనదారులపై ఎలాంటి భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'టోల్ ట్యాక్స్‌లను వసూలు చేసే ప్రసక్తే లేదు' అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాసనసభలో ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. మొదటి దశ పనుల కోసం ప్రభుత్వం బడ్జెట్లో రూ.300 కోట్లను కేటాయించింది.

## ఎట్టకేలకు దేవన్నపేట పంప్ హౌజ్ మోటార్‌ఆన్



కరీంనగర్ : జువ్వాడి చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశ పనుల్లో భాగంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల శివారులో నిర్మించిన దేవన్నపేట పంప్ హౌజ్ మోటార్ ఎట్టకేలకు ఆన్ అయ్యింది.ఇక్కడ ఏర్పాటు చేసిన మూడు మోటార్లలో ఒక దానిని ఆన్ చేసి జనగామ జిల్లాలో ఎండుతున్న పంటలకు సాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేయగా.. సాంకేతిక లోపాల కారణంగా ఇబ్బందులు తలెత్తాయి.దీంతో ప్రభుత్వం ఛాలెంజింగ్ తీసుకుని పనులు చేయించగా.. ఎట్టకేలకు సమస్యలన్నీ తీరాయి. దీంతో గురువారం తెల్లవారుజామున ఇరిగేషన్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ మేరకు దేవన్నపేట పంప్ హౌజ్ నుంచి గోదావరి నీళ్లు తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ధర్మసాగర్ రిజర్వాయర్ కు చేరుకున్నాయి. దాదాపు పది రోజులుగా అధికారులు, ఇతర ఇంజనీర్లు దేవాదుల పంప్ హౌజ్ వద్దనే మకాం వేసి పనులు చేయించగా.. ఎట్టకేలకు మోటార్ ఆన్ కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో సాగునీరు అందక పంటలు ఎండుతున్న దృష్ట్యా ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో భాగంగా దేవన్నపేట వద్ద నిర్మించిన పంప్ హౌజ్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారం నుంచి భీమ్ ఘన్ పూర్ నుంచి రామప్పకు వచ్చిన గోదావరి నీటిని ధర్మసాగర్ రిజర్వాయర్ కు తరలించేందుకు దాదాపు 49.06 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తి చేశారు.దేవన్నపేట వద్ద ఇప్పటికే మూడు మోటార్లు ఏర్పాటు చేయగా.. అందులో ఒక దైన్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఒక మోటార్ ను ఆన్ చేసి దాని ద్వారా నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఈ నెల 18న రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు దేవన్నపేట పంప్ హౌజ్ ను విజిట్ చేసి మోటార్ ను ఆన్ చేసే ప్రయత్నం చేశారు. కానీ సాంకేతిక సమస్యల కారణంగా మోటార్ ఆన్ కాకపోవడంతో మంత్రులు చేసేదేమీ లేక వెనుదిరగాల్సి వచ్చింది.దేవన్నపేట పంప్ హౌజ్ లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్కాడా సిస్టమ్ లో సాంకేతిక లోపాల కారణంగా మోటార్ మొరాయించగా.. ఆస్ట్రియా నుంచి ఆండ్రిట్జ్ కంపెనీ ఇంజనీర్లు వచ్చి రిపేర్ చేసే పనులు చేపట్టారు. పంప్ హౌజ్ వద్దే మకాం వేసి మంగళవారం నాటికి ఆ సమస్యను పరిష్కరించారుతరువాత ట్రయల్ నిర్వహించే ప్రయత్నాలు మొదలు పెట్టగా, ఈసారి గేట్ వాల్వ్స్ లు లాక్ అయి సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో మరో ఇద్దరు టెక్నీషియన్లను హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి రెండు రోజులుగా శ్రమించి, ఆ పనులు పూర్తి చేశారు. దీంతో పది రోజుల పాటు అధికారులు, ఇంజనీర్లు శ్రమించగా.. ఎట్టకేలకు సమస్యలన్నీసాల్వ్‌అయ్యాయిసమస్యలన్నీ సాల్వ్ అయిన అనంతరం ట్రయల్ రన్ నిర్వహించేందుకు బుధవారం సాయంత్రం అధికారులు ప్రయత్నం చేశారు. కానీ ఈసారి ఎలక్ట్రికల్ సిస్టంలో సమస్య కారణంగా మోటార్ మొరాయించింది. దీంతో ఆండ్రిట్జ్ కంపెనీ ఇంజనీర్లు, జిల్లా ఇరిగేషన్ అధికారులు రాత్రంతా శ్రమించి, ఆ సమస్యను పరిష్కరించారు.

## కరీంనగర్ లో వింత దొంగ

## రెండు బీరు బాటిళ్లు చోరీ

**కరీంనగర్ :** దొంగలు రోజు రోజుకు తెలివి మీరిపోతున్నారు. చోరీలు చాలా జాగ్రత్తగా, తెలివిగా చేస్తున్నారు. దొంగతనాలు చేసేందుకు పక్కాగా ప్లాన్లు వేసుకోవటం చూస్తుంటే ఓరి మీద తెలివి పాదుగానూ అనిపిస్తుంటుంది. చేసేది.తప్పుడు పని కాబట్టి బయటికి అసరు కానీ.. కొన్ని చోరీలు చేసే విధానం, అమలు చేసే ప్లాన్లు, దొరికిపోకుండా ఉండేందుకు తీసుకునే జాగ్రత్తలు చూస్తుంటే.. చాలా మందికి 'అబ్బ ఏం తెలివిరా నాయనా' అనిపిస్తుంటుంది.మరీ అలా అనిపించేది కాకపోయినా.. ఈ దొంగలు కూడా సావు తెలివితేటలే వాడారు ఈ చోరీలో కూడా. మరి వాళ్ల తెలివి తేటలు ఏంటో తెలియాలంటే కరీంనగర్ జిల్లాలో జరిగి వైన్ షాప్ దొంగతనం గురించి తెలుసుకోవాల్సిందే.కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెటంగూర్ క్రాస్ వద్ద దుర్గా వైన్స్‌లో దొంగతనం జరిగింది. ఎప్పటిలాగే ఉదయం సమయంలో దుకాణం తెరవగానే.. పైకప్పుగా వేసిన రేకులకు కత్తిరించి ఉండటం చూసి.. యజమాని షాక్ అయ్యాడు. చుట్టూ చూశాడు. దొంగతనం జరిగిందని గమనించాడు. దీంతో.. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి.. అసలు విషయం చెప్పాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు..వైన్స్‌కు చేరుకున్నారు. చోరీ జరిగిన విధానాన్ని.. ఎంత సరుకు పోయిందన్న విషయాలు పరిశీలించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా..దొంగలు ఎలా చోరీ చేశారు.. ఏమేం ఎత్తుకుపోయారు.. అసలు వాళ్లు ఎవరూ.. అన్న విషయాలు తెలుసుకునేందుకు విచారణ మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే.. వైన్స్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు పరిశీలించే ప్రయత్నం చేశారు. కానీ.. దొరకకుండా ఉండేందుకు ఆ దొంగలు చేసిన పనికి పోలీసులు కూడా అవాక్కయ్యారు. ఎలాగూ.. ఈ మధ్య ఏ నేరం జరిగినా.. నిఘా నేత్రాల నిమిషాల్లోనే నిందితులను పట్టిస్తున్నాయి. ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన దొంగలు.. మొదట ఆ నిఘా నేత్రాల మీదే ఫోకస్ చేశారు.వైన్స్ షాపులో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ధ్వంసం చేస్తే.. వాళ్ల చోరీ దృశ్యాలు మాత్రమే రికార్డవ్వవు.. కానీ ధ్వంసానికి ముందు వరకు రికార్డ్ చేస్తాయి కదా. ఈ లాజిక్‌ను కూడా పసిగట్టిన చోరులు.. కావాల్సిన మందుబాటిళ్లు, కౌంటర్‌లోని డబ్బుతో పాటు సీసీ కెమెరా ఫుటేజీ బాక్సులను కూడా ఎత్తుకెళ్లారు.అంతేకాదు.. పోతూ పోతూ ఇన్వర్టర్‌ను కూడా పూర్తిగా ధ్వంసం చేశారు. అయితే.. ఇంతా చేసిన దొంగలు ఎత్తుకెళ్లింది మాత్రం కేవలం రెండు బీర్ బాటిళ్లే కావడం అందరినీ ఆశ్చర్యపోయేలా చేసింది.ఇంతకూ ఎంత సరుకు ఎత్తుకెళ్లారని పోలీసులు ఆరా తీస్తే.. లోపల ఉన్న స్టాక్ మొత్తాన్ని పరిశీలించిన యజమాని షాక్ అయ్యాడు. గత రాత్రి షాప్ మూసేసేముందు రాసుకున్న లెక్కల ప్రకారం.. రెండే రెండు బీర్ బాటిళ్లు తక్కువ వస్తున్నట్లు గమనించి.. ఒకటికి రెండు సార్లు పరిశీలించి.. అదే విషయాన్ని పోలీసులకు తెలిపాడు. అయితే.. ఆ దొంగలు ఫోకస్ చేసింది మందుబాటిళ్లపై కాకుండా నగదు మీద కావటంతో.. కౌంటర్‌లో పెద్దగా డబ్బు లేకపోవటంతో.. ఫ్రస్టేషన్‌లో ఇలా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఇఫ్తార్ విందుల ద్వారా స్నేహభావం పెంపొందుతుంది

సిమెంట్ ఫ్యాక్టరీ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి

**కమాన్ పూర్ :** ఇఫ్తార్ విందులు ద్వారా స్నేహ పూర్వక వాతావరణం పెంపొందిస్తాయని లోక కళ్యాణ అర్థమే ఉపవాస దీక్షలు ముస్లిం సోదరులు చేపడతారని బసంత నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ పర్మినెంట్ కార్మికుల అధ్యక్షుడు కన్నాల సింగిల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండల పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులతో ఉపవాస దీక్షలో ఉన్న వారితో పలు రకాల పండ్లు డ్రై ఫ్రూట్స్ వారికి అందించారు . అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంపొందించడంతో పాటు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పవిత్ర రంజాన్ పండుగ మాసంలో ముస్లిం మైనార్టీ లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం బహు పుణ్య కార్యక్రమం అన్నారు. అన్ని కులాలు మతాలు సమానమే నన్న భావాన్ని పెంపొందించేందుకు ఇఫ్తార్ విందులు దోహదపడతాయని, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం మైనార్టీలు ఉపవాసం ఉండి తమ యొక్క దైవాన్ని భక్తిశ్రద్ధలతో మసీదులలో ప్రార్థనలు చేసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకుంటారని స్పష్టం చేశారు. సర్వమత సారాంశం ఒక్కటేనన్న భావాన్ని ప్రజల్లో కల్పించాలని కోరారు.



# వేసవిలో డీ హైడ్రేషన్ కట్టడికి కొబ్బరి నీరే తప్పనిసరా..?



సమ్మర్ వచ్చేస్తుందంటేనే భయం వేస్తుంది. ఉక్కపోతాలు, సూర్యుడి భగభగలు తలుచుకుంటే వామ్మో..! అనిపిస్తుంది. ఆఖరికి వండిన ఏ వంటకాలు నిల్వ ఉండవు. మధ్యాహ్నం 12 దాటితే బయటకు అగుపెట్టే ఛాన్సే లేదన్నంత వేడి సెగలు. ఎంత నీడ పట్టున కూర్చొన్న ఆ ఎండల వేడికి ఒకటే దాహం, నోరంతా పెడుచుకట్టుకు పోయినట్లు ఉంటుంది. దాంతో చాలావరకు కొబ్బరి బొండాలు, చెరుకురసం వంటివి వాటితో హైడ్రేటెడ్‌గా ఉండేలా చేసుకుంటారు. అయితే చెరుకురసంలో ఉండే అధిక చక్కెరల దృష్ట్యా కొబ్బరి నీళ్ల వైపుకే మొగ్గు చూపుతారు. అందులోనూ వేసవి అని అటు కొబ్బరి కాయల వ్యాపారలు అదును చూసి ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటారు. ఎండల భయంతో విధిలేక అంత ధర వెచ్చించి మరీ కొని తాగేస్తుంటారు. అయితే అదేం అవసరం లేదంటున్నారు వైద్య నిపుణులు. సమ్మర్‌లో కొబ్బరి బొండాలు తప్పనిసరి ఏం కాదని తేల్చి చెబుతున్నారు. వాటికి బదులుగా తక్కువ ఖర్చులో డీహైడ్రేషన్‌కి చెక్‌పెట్టొచ్చని చెబుతున్నారు అదెలాగో చూద్దామా..!. ఆరోగ్య స్పృహ ఎక్కువై సోషల్ మీడియాలోనూ, పేపర్‌లోనూ కొబ్బరి నీరుకి మించిన దివ్యౌషధం లేదంటూ ఊదరగొట్టుస్తున్నారు. నిజానికి కొబ్బరి నీరేమి సర్వరోగ నివారిణి కాదంటున్నారు వైద్యులు. ఇది హైడ్రేషన్‌గా ఉంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అది సమంజసమే అయినా..మార్కెట్లో అధిక ధర పలుకుతున్నప్పుడు ప్రత్యామ్నాయంగా తరుచుగా నీరు తాగితే చాలు. పోనీ వేడికి తాళ్లలేకపోతున్నాం అనుకుంటే అరటిపండ్లు, నీళ్లు తాగినా డీహైడ్రేషన్‌కి గురవ్వరని చెబుతున్నారు నిపుణులు.


**ఎలక్ట్రోలైట్ల సమృద్ధి కారణంగా..**

చాలామంది వేసవిలో కొబ్బరి నీళ్లు తాగకపోతే వేడి చేస్తుందని, ముక్కు నుంచి రక్తం కారుతుందని ఫిర్యాదులు చేస్తుంటారు. అది చాలా తప్పు ఆ సమస్యకు మూల కారణం తెలుసుకునేలా ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాలే గానీ కొబ్బరినీరు తగ్గిస్తుందని చెప్పడం సరైనది కాదంటున్నారు వైద్యులు. అలాగే చాలామంది మూత్రపిండాల్లో రాళ్లను నివారించడానికి కొబ్బరి నీరే మంచిదనుకుంటారు. అది కూడా సరైనది కాదు. ఎందుకంటే కొబ్బరినీటిలో పోషకాలు ఉన్నాయి కానీ అది మూత్రపిండాల్లో రాళ్లను తగ్గించేంత శక్తి అయితే ఉండదని నొక్కి చెప్పారు నిపుణులు. కేవలం వడదెబ్బ తగ్గినప్పుడు ఈ కొబ్బరినీరు తక్షణమే శక్తిని ఇచ్చి, ఎలక్ట్రోలైట్లతో బాడీని భర్తీ చేస్తుంది. త్వరితగతిన కోలుకునేలా చేస్తుందన్నారు. లేత కొబ్బరి నీరు ప్రకృతి ప్రసాదించిన రిఫ్రెషింగ్ అమృతం!. ఎలక్ట్రోలైట్లతో నిండిన ఇది, తక్కువ కేలరీలు, అధిక పొటాషియం, విటమిన్ బీ, సీలు కలిగిన హైడ్రేటింగ్ పానీయం. రీహైడ్రేషన్, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. మనకు మంచి ఆరోగ్యకరమై ఎనర్జీ ఇచ్చేందుకు తీసుకోవాలే తప్ప. అది తీసుకుంటేనే హైడ్రేటెడ్‌గా ఉంటామనేది అపోహేనని తేల్చి చెప్పారు. అలాగే దీన్నీ హైడ్రేషన్‌కి సంబంధించిన ప్రాథమిక వనరుగా తీసుకోకూడదు.

**ఆ సమస్యలు ఉత్పన్నమైనప్పుడూ..**


అథ్లెట్లకు లేదా వేడి వాతావరణంలో పనిచేసేవారికి కొబ్బరినీటిలో ఉండే అధిక ఎలక్ట్రోలైట్ కంటెంట్ కారణంగా తీసుకోమని వైద్యులు సూచిస్తారే తప్ప, ప్రత్యామ్నాయంగా అరటిపండ్లు, చల్లటి నీరు తాగవచ్చు అని చెబుతున్నారు నిపుణులు. కొబ్బరి నీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందించినప్పటికీ ఇది అన్నీ ఆరోగ్య సమస్యలకు అద్భుత నివారిణీ మాత్రం కాదని చెప్పారు. ముఖ్యంగా విరేచనాలు, మూత్రపిండాల్లో రాళ్ల సమస్యతో బాధపడుతున్నవారికి అలసట బారిన పడకుండా ఉండేలా వైద్యులు నీటికి బదులుగా దీన్ని సూచించడం జరుగుతుందని వివరించారు. కాబట్టి సరసమైన ధరల్లో కొబ్బరి బొండాలు దొరికితే హాయిగా కొనుక్కుని ఆస్వాదించండి లేదంటే హైడ్రేషన్ కోసం తక్కువ ధరలోనే ప్రత్యామ్నాయులు ఉన్నాయనే విషయం గ్రహించండి అని చెబుతున్నారు వైద్యులు.

# ది బెస్ట్ మాంసాహార రెసిపీగా భారతీయ వంటకం కీమా..!



ప్రపంచంలోనే ఉత్తమ మాంసాహార వంటకాల జాబితాను విడుదల చేసింది ప్రముఖ ఫుడ్ అండ్ ట్రావెల్ గైడ్. ఎప్పటిలానే బెస్ట్ స్వీట్స్, కర్రీల జాబితాను ఇచ్చినట్లుగానే ఈసారి బెస్ట్ మాంసాహార రెసిపీ జాబితాను విడుదల చేసింది. మొత్తం 100 ఉత్తమ మాంసాహార వంటకాలను విడుదల చేయగా అందులో మన భారతీయ వంటకం కీమా నాల్గోస్థానంలో నిలవడం విశేషం. ఈ కీమాని సమోసాలు, బ్రెడ్‌లు, పరాఠాలు వంటి వాటిల్లో నొంచుకుని ఆస్వాదిస్తారు. ముఖ్యంగా ఇది మేక లేదా కోడి మాంసాన్ని చాలా చిన్నగా కట్ చేస్తారు. దాంతో చేసే వంటకమే ఈ కీమా రెసిపీ. అయితే దీన్ని ఉడికించడం సులభం, రుచిగానూ ఉంటుంది. ఇక ప్రపంచంలోనే ఉత్తమ మాంసాహార వంటకాల జాబితాలో టర్కీకి చెందిన టైర్ కోఫ్టేసి అగ్రస్థానంలో నిలిచింది. తదుపరిస్థానాల్లో సెర్బియా నుంచి లెస్కోవాకి రోస్టిల్జ్ , టర్కీకి చెందిన అదానా కెబాప్, బారత్ నుంచి కీమా ట్రావ్నిక్, బోస్నియా నుంచి ట్రావ్నిక్కి సెవాపి, అజర్‌బైజాన్ నుంచి గురు ఖింగల్, ఇటలీ నుంచి పోల్పెట్ బోస్నియా మొదలైనవి చోటు దక్కించుకున్నాయి. కాగా, ఈ కీమా వంటకాలను అల్లం వెల్లుల్లి పేస్ట్, మిరపకాయ, ఉల్లిపయాలు, నెయ్యి, గరం మసాల, కొద్దిపాటి సుగంధద్రవ్యాలతో రుచికరంగా తయారు చేస్తారు. సాధారణంగా పచ్చి బఠానీలు ఉపయోగించి చేస్తుంటారు చెఫ్‌లు.

# ఆ లోపంతో బాధపడేవారికి అమృతం లాంటిది..



ఉరుకులు పరుగుల జీవితం.. పేలవమైన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం.. ఇవన్నీ ఎన్నో అనారోగ్య సమస్యల బారిన పడేలా చేస్తున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం మంచిదంటున్నారు.. అయితే.. ఇటీవల కాలంలో విటమిన్ల లోపం కూడా వేధిస్తోంది.. ముఖ్యంగా.. శరీరంలో విటమిన్ బి12 లోపం అనేక రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. సరైన ఆహారం తీసుకోకపోవడం, పోషకాలను గ్రహించకపోవడం, అనేక వైద్య పరిస్థితులు శరీరంలో విటమిన్ బి12 లోపానికి కారణమవుతాయి. దీని లోపం కారణంగా, ఒక వ్యక్తి అలసట, బలహీనత, జలదరింపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి సమస్యలకు గురవుతారు.. విటమిన్ బి12 లోపాన్ని అధిగమించడానికి, మాంసం, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, బలవర్ధకమైన ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఈ వార్తలో అలాంటి డ్రై ఫ్రూట్స్ గురించి మేము మీకు చెప్పబోతున్నాం.. అంజీర్ నీరు శరీరంలో విటమిన్ బి12 ను వేగంగా పెంచుతుంది. అందుకే.. దీనిని అమృతం లాంటిదని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. అదేంటంటే.. అంజీర్ (అత్తిపండ్లు) నీరు.. అత్తిపండ్లలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు దాగున్నాయి.. అంజీర్ పండును లేదా.. డ్రైఫ్రూట్ గా కూడా తీసుకోవచ్చు

విటమిన్ బి12 లోపాన్ని అధిగమించడానికి అంజీర్ నీరు త్రాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

అధిక ఫైబర్ కంటెంట్ కలిగిన అంజీర్ పండ్లు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి..

-1114తీ11తీతీకడుపు ఉబ్బరం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి.

అంజీర్ నీరు శరీర నిర్విషీకరణకు సహాయపడుతుంది.


ఐరన్, ఫోలేట్, రాగి, మెగ్నీషియం వంటి పోషకాలు అంజీర్‌లో కనిపిస్తాయి..

ఇవి శరీరంలో ఎర్ర రక్త కణాల పెరుగుదలను పెంచడంలో.. విటమిన్ బి12 శోషణను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

అంజీర్ నీటిని ఎలా తయారు చేయాలి?

అంజీర్ డ్రైఫ్రూట్ ను నానబెట్టి తింటారు. అంజీర్ నీటిని తయారు చేయడానికి, అంజీర్ పండ్లను నానబెట్టి, రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయం దాన్ని ఫిల్టర్ చేసి ఖాళీ కడుపుతో త్రాగాలి. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే అంజీర్ నీరు శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# ఎనర్జీ డ్రింక్స్ ఎక్కువగా తాగుతున్నారా..?



మూత్రపిండాలు మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడం, రక్తాన్ని శుభ్రం చేయడం, నీటి సమతుల్యతను కాపాడటం, రక్తపోటును నియంత్రించడం వంటి ముఖ్యమైన పనులు చేస్తాయి. అయితే ఆరోగ్యకరమైన ఆహారం, సరైన జీవన విధానం పాటించకపోతే మూత్రపిండాల పనితీరు మందగించి, ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ డ్రింక్స్ లో ఎక్కువగా కెఫిన్, చక్కెర, రంగులు, రుచులను మెరుగుపరిచే రసాయనాలు, కొన్ని మూలికా పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరానికి తాత్కాలిక శక్తిని అందించినా.. అధికంగా తీసుకుంటే కొన్ని సమస్యలు కలిగించవచ్చు. ఈ డ్రింక్స్ మూత్రపిండాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

డీహైడ్రేషన్

ఎనర్జీ డ్రింక్స్‌లో కెఫిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో నీటిని త్వరగా తగ్గించడమే కాకుండా.. ఎక్కువగా మూత్రం పోవడానికి కారణమవుతుంది. తగినంత నీరు తాగకుండా ఎక్కువగా ఎనర్జీ డ్రింక్స్ తాగితే నీటి లోపం వస్తుంది. దీని వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి పెరిగి వాటి పనితీరు బలహీనపడుతుంది.

రక్తపోటు పెరగడం

ఈ ఎనర్జీ డ్రింక్స్‌లో ఉండే కెఫిన్ రక్తనాళాలను ప్రభావితం చేసి రక్తపోటును పెంచే అవకాశం ఉంది. అధిక రక్తపోటు ఉంటే మూత్రపిండాల పనితీరు దెబ్బతిని.. దీర్ఘకాలంలో మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

చక్కెర ప్రభావం

చాలా ఎనర్జీ డ్రింక్స్‌లో అధిక స్థాయిలో చక్కెర ఉంటుంది. ఎక్కువగా చక్కెర తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. మధుమేహం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

**మూత్రపిండాల్లో రాళ్లు**

కొన్ని ఎనర్జీ డ్రింక్స్‌లో ఫాస్ఫారిక్ యాసిడ్ అనే పదార్థం ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో కాల్షియం స్థాయిలను పెంచి రాళ్లు ఏర్పడే అవకాశాన్ని పెంచుతుంది.

కొన్ని పరిశోధనల ప్రకారం.. ఎక్కువగా ఎనర్జీ డ్రింక్స్ తాగేవారిలో మూత్రపిండాల పనితీరు మందగించే ప్రమాదం ఉందని తేలింది. ముఖ్యంగా అక్యూట్ కిడ్నీ ఇంజురీ (%ూఖ×%) అనే పరిస్థితి కొందరిలో తలెత్తే అవకాశముందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది మూత్రపిండాలు ఆకస్మాత్తుగా పనిచేయడం ఆపేసే తీవ్రమైన సమస్య. అయితే ఈ డ్రింక్స్ మూత్రపిండాల పనితీరును పూర్తిగా దెబ్బతీస్తాయా.? లేదా..? అనేది ఇంకా పూర్తిగా రుజువుకాలేదు.

**ఎవరు జాగ్రత్తగా ఉండాలి..?**

ఇప్పటికే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు

కొబ్బరి నీరు, తాజా పండ్ల రసాలు, గ్రీన్ టీ, మజ్జిగ వంటి వాటిని తీసుకోవడం ద్వారా శరీరానికి మేలు కలుగుతుంది.

తగినంత నీరు తాగడం, మంచి ఆహారపు అలవాట్లు పాటించడం, శరీరాన్ని చురుకుగా ఉంచడం ద్వారా ఎనర్జీ డ్రింక్స్ అవసరం లేకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.

ఎనర్జీ డ్రింక్స్ తక్షణ శక్తిని ఇచ్చినప్పటికీ.. ఎక్కువగా తీసుకుంటే మూత్రపిండాలపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. అందుకే వీటిని మితంగా తాగడం లేదా పూర్తిగా మానేయడం మంచిది. వీటికి బదులుగా సహజమైన, ఆరోగ్యకరమైన డ్రింక్స్ ని ఎంచుకోవడం ఉత్తమం.

## బిజినెస్

### బ్రిటన్ వీడనున్న స్టీల్ టైకూన్ లక్ష్మీ మిత్తల్ కారణం ఇదే..



చాలామంది ధనవంతులు పన్ను మినహాయింపులు కల్పించే దేశాలలో స్థిరపడటానికి మక్కువ చూపిస్తారు. ఇప్పటికే కొంతమంది బ్రిటన్‌లో స్థిరపడ్డారు. అయితే అక్కడి ప్రభుత్వం.. ఇప్పటి వరకు అమలులో ఉన్న 'నాన్-డోమ్' పన్ను విధానాన్ని రద్దు చేసే దిశగా ఆలోచిస్తోంది. ఇదే జరిగితే ప్రముఖ పారిశ్రామికవేత్త 'లక్ష్మీ మిత్తల్' యూకే వీడనున్నారు. నాన్-డోమ్ పన్ను విధానం అమలులో ఉన్నంత వరకు.. ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఈ పన్ను విధానాన్ని రద్దు చేస్తే.. ట్యాక్స్ కట్టాల్సి ఉంటుంది. సుమారు రెండు శతాబ్దాలకంటే ఎక్కువ కాలంగా ఈ పన్ను విధానం బ్రిటన్‌లో అమలులో ఉంది. కానీ ఇప్పుడున్న అక్కడి ప్రభుత్వం ఈ పన్ను విధానానికి మంగళం పాడనుంది.

యూకేలో కొత్త పన్ను విధానం అమలులోకి వస్తే, ధనవంతులు.. పన్ను విధించని యూఏఈ, ఇటలీ, స్విట్జర్లాండ్ దేశాలలో ఎదో ఒకదానికి వెళ్లే అవకాశం ఉంది.

లక్ష్మి మిత్తల్ విషయానికి వస్తే.. స్టీల్ టైకూన్‌గా ప్రసిద్ధి చెందిన ఈయన యూకేలోని అత్యంత సంపన్నుల జాబితాలో ఒకరు. గత సంవత్సరం సండే టైమ్స్ రిచ్ లిస్ట్‌లో 14.9 బిలియన్ ఫౌండ్లతో ఏడవ స్థానంలో నిలిచారు. ఈయనకు లండన్‌లోని కెన్సింగ్టన్ ప్యాలెస్ గార్డెన్స్‌లో ఒక భవనం, స్విస్ రిసార్ట్ పట్టణం సెయింట్ మోరిట్జ్‌లో ఒక ఛాలెట్‌తో సహా యూరప్, యుఎస్, ఆసియా అంతటా విలువైన ఆస్తులు ఉన్నాయి. అంతే కాకుండా ఈయన దుబాయ్ రియల్ ఎస్టేట్‌లో కూడా పెట్టుబడులు పెడుతున్నట్లు సమాచారం.

# ప్రపంచం భారతదేశం వైపు చూస్తోంది

### మై హోమ్స్ గ్రూప్ వైస్ చైర్మన్ జూపల్లి రాము రావు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వాట్ ఇండియా థింక్స్ టుడే సమ్మిట్‌లో పాల్గొన్నారు. మై హోమ్ గ్రూప్ వైస్ చైర్మన్ జూపల్లి రాము రావు భారతదేశ ఆర్థిక పురోగతి, ప్రధానమంత్రి నాయకత్వంలో జరిగిన ఆర్థిక పురోగతి ప్రయత్నాల గురించి వివరించారు. ప్రపంచ బ్యాంకు, డేటా ప్రకారం, రాబోయే రెండు ఆర్థిక సంవత్సరాల్లో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందన్నారు. ప్రస్తుత ఆర్థిక మాంధ్యం పరిస్థితుల్లో ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని అన్నారు. పీఎం గతి శక్తి, స్టార్టప్ ఇండియా, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు వంటి కార్యక్రమాలు తయారీ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక చేరిక వంటి రంగాలలో పరివర్తనకు దారితీస్తున్నాయి. డిజిటల్ ఇండియా చొరవ అభివృద్ధి చెందిన దేశాలకు కూడా ఒక ఆదర్శంగా మారుతోందని మై హోమ్ గ్రూప్ వైస్ చైర్మన్ రాము రావు అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ఆయన అన్నారు. డిజిటల్ ఇండియా దార్శనికత దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చిందని అన్నారు. మోదీ నాయకత్వంలో భారతదేశం ఒక మార్గదర్శి పాత్రను పోషిస్తోందని పేర్కొన్నారు.

**ఆర్థిక రంగంలో బలోపేతం:**




ప్రధాని మోదీ నాయకత్వంలో 1.45 బిలియన్ల భారతీయుల ఆకాంక్షలకు బలమైన దిశానిర్దేశం చేయడం, ప్రపంచ వృద్ధికి భారతదేశం ప్రధానంగా మారడం ద్వారా తాను ఎంతో ప్రేరణ పొందానని అన్నారు. భారతదేశం ఈ పురోగతిని ప్రపంచ బ్యాంకు, కూడా అంగీకరిస్తున్నాయని ఆయన ఉదాహరణగా చెప్పారు. మోదీ ప్రభుత్వ నాయకత్వంలో భారతదేశం ఆర్థిక రంగంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడమే కాకుండా, ప్రపంచానికి స్థిరత్వం, అభివృద్ధికి కొత్త నమూనాను చూపించిందన్నారు.

**డిజిటల్ ఇండియా విజయవంతమవుతోంది:**

డిజిటల్ ఇండియాను ప్రోత్సహించడానికి మోదీ చేస్తున్న ప్రయత్నాలు చాలా వేగంగా విజయవంతమవుతున్నాయని, ఇప్పుడు కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా దీనిని స్వీకరించడానికి ఆసక్తి చూపుతున్నాయని రాము రావు అన్నారు. దేశ పురోగతికి అంకితభావంతో ఉన్న నాలాంటి లక్షలాది మందికి, మన నైపుణ్యాలను మెరుగుపరుచు కోవడానికి, మన ప్రయత్నాలను విస్తరించడానికి, అలాగే అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఇది సరైన సమయం అని ఆయన అన్నారు. మై హోమ్ గ్రూప్ సూత్రం ఏమిటంటే మన వ్యాపార లక్ష్యాలను దేశ అభివృద్ధితో అనుసంధానించాలని, మాకు లాభాల కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం ఆయన పేర్కొన్నారు.

# ట్రంప్ దెబ్బకు ఆటో విలవిల.. దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం సుంకం

వచ్చే వారం నుంచి అమల్లోకి కొత్త పన్ను

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశారు. విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. కానీ, అమెరికాలో తయారైన కార్లపై ఎలాంటి సుంకం ఉండదని స్పష్టంచేయడం విశేషం. ఈ సుంకం పెంపు వచ్చే వారం నుంచి అమలులోకి రానున్నట్లు ప్రకటించారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన.. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రతియేటా 100 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం విదేశీ ఆటోమొబైల్ సంస్థలకు షాకిచ్చినట్లు అయింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ట్రంప్ సుంకాల పెంపును తెరపైకి తీసుకొస్తున్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే ఏ వస్తువుపైన 25 శాతం సుంకం విధించనున్నట్లు గతంలోనే పేర్కొన్నారు.

**ప్రాణసంకటంగా ఆటోమొబైల్**

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో విదేశీ ఆటోమొబైల్ సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. యూఎస్‌కు ఎగుమతి చేయాలంటే అధికంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకవేళ ధరలు పెంచితే వాహన అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో సరాసరి కారు ధర 49 వేల డాలర్లు ఉండగా, త్వరలో భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతయ్యే కారుపై విధిస్తున్న సుంకం 12,500 డాలర్లకు ఎగబాకనున్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఎగుమతులపై నీలినీడలు కమ్ముకోనున్నది. ప్రతియేటా భారత్ నుంచి 7 బిలియన్ డాలర్ల విలువైన కార్లు అమెరికాకు ఎగుమతి అవుతుండగా..తాజా నిర్ణయంతో ఆయా సంస్థలు వెనక్కితగ్గే అవకాశాలున్నాయి. ప్రధానంగా యూఎస్ మార్కెట్లో పాగావేసిన టాటా మోటర్స్ అనుబంధ సంస్థ జేఎల్ఆర్‌పై ఈ ప్రభావం అధికంగా పడనున్నది. బ్రిటన్ ప్లాంట్లో తయారైన జేఎల్ఆర్ వాహనాలను ప్రతియేటా లక్షల వాహనాలను అమెరికాకు ఎగుమతి చేస్తుండటమే ఇందుకు కారణం. సుంకాల పెంపు ప్రతిపాదనపై వాహన సంస్థలతోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థలు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ టారిఫ్ బాదుడుతో తమ ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం చూపనున్నాయని వారు వాపోతున్నారు. 2024లో భారత్ నుంచి 2.2 బిలియన్ డాలర్ల విడిభాగాలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

**కుప్పకూలిన ఆటో షేర్లు**

ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో దేశీయ ఆటోమొబైల్ రంగ షేర్లు కుప్పకూలాయి. టాటా మోటర్స్ షేరు అత్యధికంగా 5.50 శాతం నష్టపోయింది. దీంతోపాటు అశోక్ లేలాండ్ 2.77 శాతం తగ్గగా, ఐచర్ మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అపోలో టైర్స్ షేర్లు పతనం చెందాయి. మొత్తంగా ఆటో ఇండెక్స్ ఒక్క శాతం తగ్గి 48,220.85కి పడిపోయింది. వీటితోపాటు వాహన విడిభాగాల తయారీ సంస్థల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. సోనా బీఎల్‌డబ్ల్యూ షేరు 5.89 శాతం నష్టపోగా, సంవర్ధన్ మథర్‌సన్ ఇంటర్నేషనల్ 2.22 శాతం, భారత్ ఫోర్జ్ 2.30 శాతం, ఏఎస్‌కే ఆటోమోటివ్ లిమిటెడ్ 1.83 శాతం, రామ్‌కృష్ణ ఫార్జింగ్స్ షేర్లు పతనం చెందాయి. కొన్ని అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. అయితే అగ్రరాజ్యం అమెరికా ఒత్తిడికి తలొగ్గి ఈ నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. 23 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ప్రతియేటా భారత్ దిగుమతి చేసుకుంటున్నది. ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా దిగుమతి చేసుకునే వస్తువులపై టారిఫ్‌ను 55 శాతం వరకు తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి.

# అనుకోకుండా ఐపీఎల్ ఛాన్స్.. మ్యాచ్ విన్నర్‌గా మారిన శార్ధూల్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో శార్దూల్ ఠాకూర్ పేరు మార్మోగిపోతోంది. గురువారం ఉప్పల్ స్టేడియంలో సూపర్ బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను దెబ్బకొట్టాడీ పేసర్. పవర్ ప్లేలో వరుస బంతుల్లో రెండు కీలక వికెట్లు.. ఆపై ఆఖర్లో మరో రెండు ఖాతాలో వేసుకున్న అతడు మ్యాచ్ విన్నర్‌గా అవతరించాడు. ఆడిన రెండు మ్యాచుల్లో ఆరు వికెట్లు తీసి అగ్రస్థానంలో నిలిచాడు శార్ధూల్. మూడు నెలల క్రితం జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో అమ్ముడుపోని.. ఈ ఆల్‌రౌండర్ అనూహ్యంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో చేరాడు. తన సుదీర్ఘ అనుభవంతో జట్టు విజయాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నాడు లార్డ్స్ శార్ధూల్. టీమిండియాకు ఆడిన శార్ధూల్ ఐపీఎల్‌లో చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ.. జట్లకు ఆడాడు. అయితే.. 18వ సీజన్ మెగా వేలంలో ఏ ఫ్రాంచైజీ తనను కొనకపోవడంతో ఐపీఎల్ అవకాశం చేజారింది అనుకున్నాడు. అలా అనీ దిగాలుగా ఉండిపోకుండా ఇంగ్లండ్ గడ్డపై కౌంటీల్లో ఆడేందుకు సిద్ధమయ్యాడట. అయితే.. అనుకోకుండా లక్నో యాజమాన్యం ఈ పేసర్‌ను సంప్రదించింది.




**ఇద్దరికీ అనుకూలించేలా**

'మెగా వేలంలో ఎవరూ నన్ను కొననందుకు కొంచెం బాధ పడ్డాను. కొన్ని రోజులకు తేరుకొని కౌంటీల్లో ఆడేందుకు సిద్ధమయ్యాను. ఐపీఎల్ 18వ సీజన్ మొదలవ్వగానే లక్నో యాజమాన్యం నాతో మాట్లాడడం.. జట్టుతో కలవడం.. చకచకా జరిగిపోయాయి. రెండు మ్యాచుల్లో నా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నాను. అయితే.. బ్యాటర్లకు అనుకూలంగా ఉండే పిచ్‌లు తయారు చేస్తున్నారు క్యూరేటర్లు. అలా కాకుండా బౌలర్లకు, బ్యాటర్లకు.. ఇద్దరికీ అనుకూలించే పిచ్‌లు రూపొందిస్తే బాగుంటుంది. ఇక ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధనతో బౌలర్లు బలి అవుతున్నారు. 200, 240కి పైగా స్కోర్లు నమోదు అవుతున్నాయి. అందుకు బౌలర్లను నిందించడం సరైంది కాదు' అని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు తీసుకున్న అనంతరం వెల్లడించాడు శార్ధూల్.

## ఆర్సీబీ వర్సెస్ సీఎస్‌కే హిస్టారికల్ క్లాష్.. ప్లేయింగ్ 11 ఇదే..

ఆర్సీబీ- సీఎస్‌కే.. ఐపీఎల్‌లో వీటిని చిరకాల ప్రత్యర్థులుగా చెబుతుంటారు. ఈ రెండు జట్లు బరిలోకి దిగితే కొదమసింహాల్లా కొట్టుకుంటాయి. ట్రోఫీ సంగతి తర్వాత.. ఫస్ట్ ఈ మ్యాచ్‌లో గెలవాలి అని డిసైడ్ అవుతాయి. ఈ రెండు టీమ్స్ మధ్య రైవల్రీ క్యాష్ రిచ్ లీగ్‌కే హైలైట్ అని చెప్పాలి. అలాంటిది మరోమారు బెంగళూరు, చెన్నై తలపడనున్నాయి. శుక్రవారం సాయంత్రం చెపాక్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఇవాళ్టి క్లాష్‌లో ఇరు జట్ల ప్లేయింగ్ ఎలెవన్ ఎలా ఉండనుంది అనేది ఇప్పుడు చూద్దాం.. విన్నింగ్ స్ట్రీక్‌ను కంటిన్యూ చేయాలని చూస్తున్న చెన్నై జట్టు.. దాదాపుగా తొలి మ్యాచ్‌లో ఆడించిన జట్టునే రిపీట్ చేసే చాన్స్ కనిపిస్తోంది. ఓపెనర్లుగా రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), రచిన్ రవీంద్ర బరిలోకి దిగుతారు. దీపక్ హుడా, రచిన్ రవీంద్ర వరుసగా ఫస్ట్ డౌన్, సెకండ్ డౌన్‌లో ఆడతారు. శివమ్ దూబె, సామ్ కర్రన్, ధోని ఫినిషింగ్ బాధ్యతలు చూసుకుంటారు. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా రవిచంద్రన్ అశ్విన్, నూర్ అహ్మద్ దిగుతారు. నాథన్ ఎల్లిస్, ఖలీల్ అహ్మద్ పేస్ రెస్పాన్సిబిలిటీస్ చూసుకుంటారు. రాహుల్ త్రిపాఠి, కమ్లేష్ నాగర్‌కోటిలో ఒకరు మ్యాచ్ కండీషన్స్‌ను బట్టి ఇంపాక్ట్ ప్లేయర్లుగా ఆడతారు.

**ఒక్క మార్పు ఖాయం**

ఆర్సీబీలో రెండు మార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. పేసర్ భువనేశ్వర్ రీఎంట్రీ ఇవ్వడం ఖాయం. ఓపెనర్లుగా కోహ్లీ, సాల్ట్ ఆడతారు. కెప్టెన్ పాటిదార్ ఫస్ట్ డౌన్‌లో, లియామ్ లివింగ్‌స్టన్ సెకండ్ డౌన్‌లో దిగడం పక్కా. జితేష్ శర్మ, టిమ్ డేవిడ్ ఫినిషింగ్ బాధ్యతలు చూసుకుంటారు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మ స్పిన్ రెస్పాన్సిలిబిలిటీస్ తీసుకుంటారు. జోష్ హేజల్‌వుడ్, భువనేశ్వర్ పేస్ యూనిట్‌ను నడిపిస్తారు. మ్యాచ్ సిచ్యువేషన్‌ను బట్టి పడిక్కల్, యష్ దయాల్‌లో ఒకరు ఇంపాక్ట్ సబ్‌గా ఆడతారు.


రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), రచిన్ రవీంద్ర, దీపక్ హుడా, శివమ్ దూబె, రవీంద్ర జడేజా, సామ్ కర్రాన్, ఎంఎస్ ధోని (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, నూర్ అహ్మద్, నాథన్ ఎల్లిస్, ఖలీల్ అహ్మద్.

ఇంపాక్ట్ సబ్: రాహుల్ త్రిపాఠి/కమ్లేష్ నాగర్‌కోటి.

ఆర్సీబీ ప్లేయింగ్ 11 (అంచనా): విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, రజత్ పాటిదార్ (కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టన్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, రసిఖ్ దార్, సుయాష్ శర్మ, జోష్ హేజల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్.

## స్పోర్ట్స్

### ఉప్పల్‌లో సన్‌రైజర్స్ ఓటమి.. కావ్యా మారన్ రియాక్షన్స్ చూశారా!



ఐపీఎల్ ప్రదర్శనతో వార్తల్లో నిలిచిన ఆటగాళ్లను చాలామందినే చూశాం. స్టేడియంలో మ్యాచ్ వీక్షిస్తూ అభిమానులను అలరించే సెలబ్రిటీలను చూశాం. అయితే.. సినీతారలకు ఏమాత్రం తీసిపోని క్రేజ్ ఆమె సొంతం. తను ఎవరో కాదు కావ్యా మారన్ ఐపీఎల్ ఎడిషన్ వచ్చిందంటే చాలు ఫ్యాన్స్‌కు ఆమె పేరు గుర్తుకు వస్తుంది. ప్రతి సీజన్‌లో తమ జట్టు సన్‌రైజర్స్ హైదారబాద్‌ను ఉత్సాహపరుస్తూ ఉండే కావ్య.. స్టేడియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటుంది. 18వ ఎడిషన్‌లో భాగంగా ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్ జట్టు ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఈ బ్యూటీ తెగ సందడి చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ అయిన కావ్య.. ఆటలో పూర్తిగా లీనమైపోతుంది. అంతేకాదు ఇన్నింగ్స్ ఆసాంతం రకరకాల హావభావాలు పలికిస్తుంటుంది. సన్‌రైజర్స్ ఆటగాళ్లు బౌండరీలు బాదేస్తుంటే చప్పట్లు, కేరింతలు కొడుతూ ఖుషీ అవుతుంది కావ్య. అందుకే.. కెమెరావాళ్లు బిగ్ స్క్రీన్‌పై ఆమె రియాక్షన్స్‌ను చూపిస్తుంటారు. మార్చి 27న ఉప్పల్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ సమయంలో కావ్య.. పలురకాల ఎక్స్‌ప్రెషన్స్‌తో కెమెరా కంట పడింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ గాల్లోకి లేపిన బంతిని పూరన్ క్యాచ్ పట్టేందుకు సిద్ధమవుతుండగా 'ఓ నో' అంటూ రియాక్షన్ ఇచ్చిన కావ్య.. పూరన్ బంతిని వదిలేసినప్పుడు.. 'ఓ గాడ్ బతికిపోయాడు' అంటూ తలపై చేయి పెట్టుకుంది. ఇక ఛేజింగ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ధనాధన్ ఆడుతుంటూ కావ్య.. ముఖం చిన్నబోయింది. తన సీట్లో డల్‌గా కూర్చుండిపోయింది.

**దెబ్బకొట్టిన శార్దూల్**


ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోర్‌తో 18వ సీజన్‌ను విజయంతో ఆరంభించిన హైదరాబాద్ రెండో మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడిపోయింది. లక్నో బౌలర్లో శార్ధూల్ ఠాకూర్(4-34) వరుస బంతుల్లో అభిషేక్ శర్మ(8), ఇషాన్ కిషన్(0)లను ఔట్ చేసి ఒత్తిడి పెంచాడు. ట్రావిస్ హెడ్(47), నితీశ్ కుమార్(32).. కుర్రాడు అనికిత్ వర్మ(36)లు ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా జట్టు స్కోర్ 200 దాటించలేకపోయారు. ఇక ఛేదనలో షమీ ఆదిలోనే బ్రేక్ ఇచ్చినా నికోలస్ పూరన్(70), మిచెల్ మార్ష్(52) విధ్వంసక బ్యాటింగ్‌తో సన్‌రైజర్స్ ఆశలపై నీళ్లు చల్లారు. మార్చి 30న జరుగబోయే తర్వాతి పోరులో కమిన్స్ సేన ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఢీ కొట్టనుంది.



# ఆస్ట్రేలియా టూర్‌లో సమంత బిజీ బిజీ..

టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సమంత ఇప్పుడు సినిమాలు కాస్త తగ్గించింది. మయోసైటిస్ బారిన పడినప్పటి నుండి కూడా సమంత తన పూర్తి దృష్టి ఆరోగ్యంపైనే పెడుతుంది. ఇక వీలున్నప్పుడల్లా విహార యాత్రలకి వెళుతూ రిలాక్స్ అవుతుంది. ఇప్పుడు సమంత ఆస్ట్రేలియా వెకేషన్ ఎంజాయ్ చేస్తుంది. సిడ్నీ వైల్డ్‌లైఫ్ పార్క్‌లో ఓ రోజంతా సరదాగా గడిపిన సామ్, ఆ అద్భుతమైన క్షణాలను కెమెరాలలో బంధించి సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫొటోలలో సమంత క్యాజువల్ డ్రెస్‌లో ఉన్నా మరింత క్యూట్‌గా కనిపిస్తుంది. అయితే సమంత అక్కడి అందమైన ప్రకృతిని , జంతువులని చూస్తూ చాలా మురిసిపోయింది. ఆస్ట్రేలియా వెకేషన్ పిక్స్‌లో సమంత బూడిద రంగు ఫుల్ స్లీవ్ చొక్కా, నీలి రంగు జీన్స్ లో మెరిసింది. కౌబాయ్ క్యాప్ స్పెషల్ అట్రాక్షన్. ఇక తన పోస్ట్‌లో ప్రకృతి, జంతువులు, మంచి వైబ్స్! కంగారూలకు ఆహారం ఇవ్వడం నుంచి నిద్రపోతున్న కోలాల వరకు ఇది చాలా ఆనందమైన సమయం! ఆస్ట్రేలియన్ వన్యప్రాణుల కోసం వారు చేసే అద్భుతమైన పునరావాస పనులన్నింటికీ ఏ  బృందానికి అభినందనలు అంటూ సమంత తన పోస్ట్‌లో పేర్కొంది. అయితే సమంత పోస్ట్‌కి ఓ నెటిజన్ ఈ ఫొటోలను ఎవరూ తీశారని అడగగా, దానికి సిడ్నీ టూర్ గైడ్ నయోమి అని సమాధానం ఇచ్చింది. అంటే సమంత వెకేషన్ పిక్స్ తీసింది అక్కడి లోకల్ టూరిస్ట్ గైడ్ అని చెప్పుకొచ్చింది. సమంత రాజ్ డీకే దర్శక ద్వయంలోని రాజ్ నిడుమోరుతో ప్రేమలో ఉందని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అతనితో కలిసి ఆస్ట్రేలియా టూర్‌కి వెళ్లిందేమో అని నెటిజన్స్ బావిస్తున్నారు. ఇటీవల రాజ్‌తో ఎక్కువగా కనిపిస్తుంది సమంత. రీసెంట్‌గా ఈ జంట ఎంగేజ్మెంట్ కూడా చేసుకుందని, అందుకు సాక్ష్యంగా ఓ డైమండ్ రింగ్ కూడా చూపించారు. గత కొద్ది రోజులుగా వీరిద్దరి గురించి జోరుగా ప్రచారాలు సాగుతున్నా ఇద్దరిలో ఎవరు స్పందించడం లేదు. ఇక సమంత తదుపరి చిత్రం రాజ్–డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3. ఈ సిరీస్ ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకోగా, ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాజ్–డీకే దర్శకత్వంలోనే 'రక్త్ బ్రహ్మాండం: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ రూపొందుతుండగా, అందులోను సామ్ నటిస్తున్నట్టు తెలుస్తుంది. ఇక సమంత స్వయంగా నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలోనూ ఆమె మెరిసి అలరించనుంది.

## ఆసక్తికరంగా కర్మణ్యే వాధికారస్తే టీజర్...



వర్తమాన నేర ప్రపంచంలో జరుగుతున్న ఘటనల ఆధారంగా వైవిధ్యభరితమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'కర్మణ్యే వాధికారస్తే' ఈ నేర ప్రపంచంలో జరిగే ఉదంతాలను కర్తవ్యమే దైవంగా భావించే ఒక పోలీసు అధికారుల బృందం ఏవిధంగా ఎదుర్కొంది అనేది ఈ సినిమా కథాంశం. అమర్ దీప్ చల్లపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. డి.ఎస్.ఎస్. దుర్గా ప్రసాద్ దీనిని నిర్మించారు. శత్రు బ్రహ్మాజీ , 'మాస్టర్' మహేంద్రన్ ప్రధాన పాత్రల్లో పోషించిన ఈ చిత్రంలో ఇతర కీలక పాత్రలను పృథ్వీ, శివాజీ రాజా, శ్రీసుధా, బెనర్జీ, అజయ్ రత్నం తదితరులు చేశారు. ఐరా దయానంద్ రెడ్డి ఈ చిత్రంతో పరిచయమవుతున్నారు. విశాఖపట్నం, హైదరాబాద్ లలో చిత్రీకరణ జరుపుకున్న 'కర్మణ్యే వాధికారస్తే' చిత్రం ప్రస్తుతం ప్రసాద్ ఫిలిం ల్యాబ్, సారధి స్టూడియోస్ లో నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సన్నద్ధమవుతోంది. తాజాగా ఈ విభిన్నమైన యాక్షన్ ఎంటర్టైనర్ నుంచి విడుదలైన టీజర్ ఉత్కంఠభరితంగా నిలిచి సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. శివకుమార్ పెళ్ళూరు కథ, సంభాషణలు సమకూర్చిన ఈ సినిమాకు గ్యానీ సంగీతం అందించారు.

# గోపీచంద్ కోసం అశోకవనంలో బ్యూటీ

గోపీచంద్ హీరోగా 'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. శ్రీనివాస్ చిట్టూరి నిర్మాతగా ఈ చిత్రం ఇటీవల పూజా కార్యక్రమాలతో మొదలైంది. త్వరలోనే రెగ్యులర్ షూట్‌కి వెళ్లనుంది. అయితే ఈ చిత్రం గోపీచంద్ సరసన హీరోయిన్‌గా రితికా నాయక్‌ని ఎంచుకొన్నారు. బుధవారం ఇద్దరిపై ఫొటోషూట్ నిర్వహించారని తెలిసింది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. 'అశోకవనంలో అర్జున కల్యాణం' సినిమాతో అలరించింది రితికి. ఆ తర్వాత ఆమెకు పెద్దగా అవకాశాలు రాలేదు. ఇటీవల మొదలైన వరుణ్ తేజ్ 15 చిత్రంలో కథానాయికగా తీసుకున్నారు. ఈ చిత్రానిక 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఆ సినిమా మొదలైందో లేదో.. మరో ఛాన్స్ కొట్టేసింది రితికా నాయక్.    గోపీచంద్ 33వ సినిమా ఇది. సంకల్ప్ దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంతో ఈ సినిమా తెరకెక్కనుందని తెలిసింది. 7వ శతాబ్దంలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. విజువల్స్, మేకింగ్ విషయంలో సంకల్ప్ ప్రత్యేక దృష్టిని పెడుతున్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇతర  విషయాలు తెలియాల్సి ఉంది.





## బాలయ్య సినిమాకి చిరంజీవితో ప్రమోషన్స్.. ఇదెక్కడి ట్విస్ట్..!

90లలో స్టార్ హీరోలుగా చిరంజీవి, బాలకృష్ణ,నాగార్జున, వెంకటేష్ ఉన్నారు. వారి సినిమాలకి ప్రేక్షకులలో మంచి ఆదరణ ఉండేవి. ముఖ్యంగా మాస్ ఆడియన్స్‌ని చిరు, బాలకృష్ణ ఎక్కువగా అలరించేవారు. సంక్రాంతి సమయంలో ఈ ఇద్దరి హీరోల పోటీ మాములుగా ఉండేది కాదు.అప్పుడు మొదలైన ఈ వార్ 2023 సంక్రాంతికి వీరనరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య వరకు కొనసాగింది. మధ్యలో ఈ ఇద్దరు హీరోలు మధ్య చిన్న చిన్న మనస్పర్థలు వచ్చిన కూడా వ్యక్తిగతంగా వారిద్దరి మధ్య ఇప్పటికీ మంచి రిలేషన్స్ ఉన్నాయి. అయితే అప్పట్లో ఇద్దరి మధ్య పోటీ పీక్స్‌లో ఉన్నా కూడా బాలకృష్ణ సినిమాని చిరంజీవి ప్రచారం చేయడం ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురిచేసింది బాలకృష్ణ కెరీర్‌లో అద్భుత కళాఖండంగా నిలిచిన చిత్రం ఆదిత్య 369.. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో రూపొందిన ఈ చిత్రం అప్పటి ప్రేక్షకులకి సరికొత్త అనుభూతిని పంచింది. అయితే ఈ సినిమా సమయంలో నిర్మాతలు కాస్త అయోమయానికి గురయ్యారట. సినిమాలో కృష్ణకుమార్ పాత్ర ఎవరు పోషించినా ఫర్వాలేదు గానీ శ్రీకృష్ణదేవరాయలుగా బాలయ్య ఒప్పుకోకపోతే ఆపేయాలని నిర్మాతలు అనుకున్నారట. శ్రీకృష్ణదేవరాయలు పాత్రకు యన్టీఆర్ నటవారసుడైన బాలకృష్ణ మాత్రమే న్యాయం చేయగలరని అందరూ భావించి బాలయ్యని అడగ్గానే ఆయన మరోమాట లేకుండా సినిమాను అంగీకరించారు. సినిమా తెరకెక్కి సూపర్ దూపర్ హిట్ అయింది. ఈ సినిమాకి వచ్చిన క్రేజ్‌ని మరింత పెంచేందుకు గాను మెగాస్టార్ చిరంజీవితో ప్రమోషన్ చేస్తే బాగుంటుందనుకుని నిర్మాతలు భావించారు. ఈ క్రమంలో చిరంజీవిని కలిసి విషయం చెప్పగా సరే అన్నారు. ' ఈ సినిమా తెలుగువారికే గర్వకారణం. అందరూ చూసి ఆనందించండి' అంటూ చిరంజీవి ఇచ్చిన పిలుపు సినిమాకు కనకక వర్షం కురిసింది. ఇక ఈ విషయాన్ని అయితే ఇద్దరు హీరోల ఫ్యాన్స్ చాలా గొప్పగా చెప్పుకునే వారు. 34 ఏళ్ళ క్రితం తెలుగు ఇండస్ట్రీని షేక్ చేసిన 'ఆదిత్య 369' సినిమా ఏప్రిల్ 4వ తేదీన రీ రిలీజ్ అవుతోంది. ఈ సినిమాని ఇప్పటి సాంకేతిక హంగులతో మరింత గొప్ప అనుభూతిని అందించేలా ముస్తాబు చేసి ప్రేక్షకుల ముందుకు తెచ్చే ప్లాన్ చేస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com